
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
రాజమహేంద్రవరం
: fb.com/vaartha Digital

మీ నమ్మకమే మా తరగని సంపద
KAPIL GROUP
కపిల్ చిట్స్
46 Years
Visit Us: www.kapilchits.com
కపిల్ చిట్స్ మీ కలలకు సాకారం

Published from Rajahmundry, Vijayawada, Hyderabad, Visakhapatnam, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
3-1-2026 శనివారం సంపుటి: 31 సంచిక: 333 పేజీలు: 8+4 వెల: 6.50

# నీటి తగవుపై ప్రత్యేక కమిటీ



అతుల్ జైన్

### ఎపి, తెలంగాణ మధ్య జలవివాదాల పరిష్కారానికి కేంద్రం కొత్త యత్నం

### సిడబ్ల్యుసి చైర్మన్ అతుల్ జైన్ నాయకత్వం

**విజయవాడ,జనవరి 2,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల మధ్య దశాబ్దకాలంగా కొనసాగుతున్న కృష్ణా, గోదావరి నదీ జలాల వివాదాల పరిష్కారానికి కేంద్ర ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. ఈ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు ఉన్నతస్థాయి నిపుణుల కమిటీని ఏర్పాటు చేస్తూ కేంద్ర జల్‌శక్తి మంత్రిత్వశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. కేంద్ర జలవనరుల సంఘం (సీడబ్ల్యూసీ) ఛైర్మన్ ఈకమిటీకి అధ్యక్షత వహిస్తారు. కృష్ణా, గోదావరి నదీ యాజమాన్య బోర్డుల (కేఆర్ఎంబీ, జీఆర్ఎంబీ) ఛైర్మన్లు, జాతీయ జల అభివృద్ధి సంస్థ (ఎన్‌డబ్ల్యూడీఏ) చీఫ్ ఇంజినీర్‌తో పాటు ఇరు రాష్ట్రాల జలవనరుల శాఖల ఉన్నతాధికారులు ఇందులో సభ్యులుగా ఉంటారు. గతేడాది జులైలో కేంద్ర జల్‌శక్తి మంత్రి సీఆర్‌పాటిల్ అధ్యక్షతన జరిగిన అపెక్స్ కౌన్సిల్ సమావేశంలో ఈ కమిటీ ఏర్పాటుకు నిర్ణయం తీసుకున్నారు. ఆసమావేశంలో ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులు పాల్గొని చర్చించారు. ఇటీవల డిసెంబర్‌లో తెలంగాణ ప్రభుత్వం తమ ప్రతినిధులను నామినేట్ చేయడంతో కమిటీ ఏర్పాటు ప్రక్రియ వేగవంతమైంది. ఇరురాష్ట్రాల మధ్య నీటిని సమానంగా పంచడం, పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులు, కొత్త ప్రతిపాదనలు వంటి కీలక అంశాలపై ఈ కమిటీ సమగ్రంగా అధ్యయనం చేసి, పరిష్కార మార్గాలను సూచిస్తుంది. ఇదేసమయంలో, కృష్ణా జలవివాదాల ట్రైబ్యునల్2 (కేడబ్ల్యూడీటీ2) గడువును కూడా కేం ద్రం 2026జులై వరకు పొడిగించింది. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టంలోని >>2

# సకాలంలో సాగునీటి పథకాలు



### 2027 డిసెంబరుకు పోలవరం పూర్తికి లక్ష్యం, వెలిగొండ, పోలవరం తదితర ప్రాజెక్టులను ఈ నెలలోనే పరిశీలించనున్న సిఎం చంద్రబాబు

### ప్రభుత్వ నీటివిధానంపై త్వరలో ముసాయిదా, 2027జూన్‌లో గోదావరి పుష్కరాలకు ఏర్పాట్లు

**విజయవాడ,జనవరి2,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో సాగునీటి పథకాలను నిర్దేశిత కాలవ్యవధిలో పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. 2027 డిసెంబరు నాటికి పోలవరం ప్రాజెక్టును పూర్తి చేయాలనేది లక్ష్యంతో కార్యాచరణ చేపట్టామని తెలిపారు.ఈ నెలలో సాగునీటి ప్రాజెక్టులను పరిశీలించించనున్నట్లు వివరించారు.ఈ మేరకు సీఎంవో కార్యాలయం కీలక సమాచారాన్ని అప్డేట్ చేస్తూ వెల్లడించింది. పోలవరం ప్రాజెక్టుకు తొలివిడత నిధుల మంజూరుతో పాటు, అడ్వాన్సుగా నిధులిచ్చేందుకు అంగీకరించిన క్రమంలోనే కేంద్రం గడువు కూడా నిర్దేశించింది. ఇప్పటికే కాఫర్ డ్యాం పనులు ఓ కొలిక్కి వస్తున్నాయి. మరోవైపు గ్యాప్1 ప్రధాన డ్యాం పనులు ప్రారంభమయ్యాయి. ప్రధాన డ్యాంగ్యాప్ 2 పనులూ సాగుతున్నాయి. డయాఫ్రం వాల్‌పై ప్రధాన డ్యాం పనులు ప్రారంభించారు. వీటితోపాటు కుడి, ఎడమ కాలువలను అనుసంధానించే పనులూ వేగంగా జరుగుతున్నాయి. 2027 ఖరీఫ్ నాటికి పోలవరం ప్రాజెక్టు నుంచి నీటి విడుదలకు ఉన్న అవకాశాలు,నిర్మాణ పురోగతిపైనా ముఖ్యమంత్రి దృష్టి సారించనున్నారు. పోలవరం ఎడమ కాలువ పనులు జనవరి నెలాఖరుకు పూర్తిచేయాలనేది లక్ష్యం.ఇప్పటికే పనులువేగంగా జరుగుతున్నాయి. పోలవరం వద్ద చేపట్టే పర్యాటక ప్రాజెక్టులపైనా సీఎం సమీక్షిస్తారని సంబంధిత అధికారుల తెలుపుతున్నారు. పోలవరం ప్రాజెక్టు వద్ద ఈ ఏడాది నీటి విధానానికి ముసాయిదా విడుదల చేయనున్నారు. జలాశయాల్లో నీటి నిల్వలు 80కు మించి అందుబాటులో ఉండటంతో అన్నిప్రాంతాల్లో చెరువులు నింపేందుకు ప్రాధాన్యం ఇస్తున్నారు. నీళ్ల అందుబాటులో ఉన్నందున ఖరీఫ్ సాగు ముందుగా ప్రారంభించాలనేది ప్రణాళిక. భూగర్భజలాలు పెంచే ప్రణాళికలనూ గ్రామాలవారీగా అమలు చేస్తున్నారు. ప్రభుత్వ నీటివిధానంపై ముసాయిదా విడుదల చేస్తారు. పారిశ్రామిక, తాగు, సాగునీటి విడుదలకు ప్రణాళిక వెలువరిస్తారు.

**వెలిగొండకు జనవరి 7 లేదా 9న :** వెలిగొండ ప్రాజెక్టును ఈ నెల 7 లేదా9న సీఎం సందర్శించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ ఏడాది జులై నాటికి వెలిగొండ ప్రాజెక్టు నుంచి నల్లమలసాగర్‌కు నీళ్ల మళ్లించి తొలిదశలో 1,19,000 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు ఇవ్వాలనే లక్ష్యంతో పనులు చేస్తున్నారు. రెండు టన్నెళ్లలో బెంచింగ్ లైనింగ్ పనులు పూర్తిచేసేలా అడుగులు పడుతున్నాయి. ఇలా నీళ్ల ఇవ్వాలంటే హెడ్ రెగ్యులేటర్ల రిటైనింగ్ వాల్, వింగ్స్, రిటర్న్‌ల నిర్మాణం పూర్తిచేయాలి. తొలి టన్నెల్‌లో 15 మీటర్ల మేర లైనింగ్, రెండో టన్నెల్‌లో 361మీటర్ల మేర బెంచింగ్ తవ్వకంతో పాటు 3,686 మీటర్ల మేర లైనింగ్ చేయాలి. ఫీడర్ కాలువలో పెండింగ్ పనులనూ కొలిక్కి తేవాలి. ఇక్కడ రిటైనింగ్ వాల్ >>2

## రాజముద్రతో రైతులకు

# పట్టాదార్ పాస్‌పుస్తకాల పంపిణి

**విజయవాడ,జనవరి2,ప్రభాతవార్తప్రతినిధి:** రాజముద్రతో రైతులకు పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ నూతన సంవత్సర కానుక అని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. ఏపీవ్యాప్తంగా పట్టా దారు పాసుపుస్తకాల పంపిణీపై ముఖ్యమంత్రి శుక్రవారం టెలీకాన్ఫరెన్స్ ద్వారా మంత్రులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. పాసుపుస్తకాల పంపిణీ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రికి రెవెన్యూ శాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్ వివరించారు. ఈ సందర్భంగా మత్రులకు సీఎం చంద్రబాబు పలు కీలక అంశాలపై దిశానిర్దేశం చేశారు. పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ కార్యక్రమంలో ఒకరోజు పాల్గొంటానని తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వంలో నాటి సీఎం జగన్ మోహన్ రెడ్డి ఫొటోలతో భూమి హక్కు పత్రాలను పంపిణీ చేశారని ధ్వజమెత్తారు. నాటి ప్రభుత్వ చర్యలపై ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేశారని అన్నారు. తాము అధికారంలోకి రాగానే రీ సర్వే చేసి తప్పులను సరిదిద్ది కొత్త పాసుపుస్తకాలు ఇస్తామని హామీ ఇచ్చామని ప్రస్తావించారు. ఎన్నికల సమయంలో హామీ ఇచ్చినట్లుగానే రాజముద్రతో కొత్త పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీకి శ్రీకారం చుట్టామని పేర్కొన్నారు. రీ సర్వే పూర్తైన గ్రామాల పరిధిలో 22 లక్షల కొత్త పాసుపుస్తకాల పంపిణీని ప్రారంభించామని పేర్కొన్నారు. జనవరి 2వ తేదీ నుంచి 9వ తేదీ వరకు పాసు పుస్తకాలు పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తున్నామని చెప్పుకొచ్చారు. ఇవాళ ఏపీ వ్యాప్తంగా ఎమ్మెల్యేలు, మంత్రుల చేతుల మీదుగా పట్టాదారు పాసుపుస్తకాలను పంపిణీ చేస్తున్నామని వెల్లడించారు. వేలాది గ్రామాల్లో సంబరంగా పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ మొదలైందని తెలిపారు. జగన్ బొమ్మతో ఉన్న పాసు పుస్తకాల స్థానంలో రాజముద్ర ఉన్న వాటిని పంపిణీ చేస్తోండటంతో ప్రజల నుంచి సర్వత్రా హర్షం వ్యక్తం అవుతోందని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

> రీసర్వే పూర్తయిన గ్రామాల పరిధిలో కొత్త పాస్ పుస్తకాలు అందజేత
>
> 9వ తేదీ దాకా కొనసాగనున్న కార్యక్రమం

**భూ సమస్యల పరిష్కారం**

గత ప్రభుత్వ తప్పిదాలతో ప్రతి గ్రామంలో రెవెన్యూసమస్యలు ప్రజలను పట్టిపీడిస్తున్నాయని అన్నారు. వివాదాలు లేని స్థలాలను కూడా రీ సర్వే పేరుతో అడ్డదిడ్డంగా చేసి వివాదాస్పదం చేశారని మండి పడ్డారు. భూమే ప్రాణంగా బతికే రైతన్నలకు భూ సమస్యలు లేకుండా చేయడం మన లక్ష్యమని చెప్పుకొచ్చారు. గత ప్రభుత్వం అసంబద్ధంగా తెచ్చిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దుతో ప్రజలకు అభద్రతను దూరం చేశామని తెలిపారు. నేడు పాసుపుస్తకాల పంపిణీ ప్రతి ఇంట్లో కొత్త సంతోషాన్ని తెస్తోందని అన్నారు. పాసుపుస్త కాలపై తమ బొమ్మలకు నాటి పాలకులు రూ.22కోట్లు ఖర్చు చేశారని ఆరోపించారు. ప్రజలకు భూవివాదాలు లేకుండా చేయడం మనప్రథమ కర్తవ్యం కావాలని సూచించారు. అధికారులు, మంత్రులు, ఎమ్మెల్యేలు నిర్దిష్ట సమయాన్ని లక్ష్యంగా పెట్టుకుని పనిచేయాలని ఆదేశించారు. మంత్రులు, జిల్లా కలెక్టర్లు ఈ విషయంలో ఎక్కువగా చొరవ తీసుకోవాలని సీఎం చంద్రబాబు దిశానిర్దేశం చేశారు.



### పెట్టుబడుల సాధనలో

# రాష్ట్రం నం.1

### ఇది ఎపి సాధించిన మరో రికార్డు: మంత్రి లోకేష్

**విజయవాడ,జనవరి2,ప్రభాతవార్తప్రతినిధి:** బ్యాంక్ ఆఫ్ బరోడా తాజా నివేదికలో పెట్టుబడుల సాధనలో దేశంలోనే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నెంబర్‌వన్‌గా నిలిచింది. ఇందుకు సంబంధించిన నివేదికను ప్రస్తావిస్తూ సామాజిక మాధ్యమం ఎక్స్‌లో మంత్రి నారా లోకేశ్ ట్వీట్ పెట్టారు. ఆంధ్రప్రదేశ్ ముందుకు దూసుకెళ్తుందని అంటూ ఈ విషయాన్ని లోకేశ్ పంచుకున్నారు. 2025 2026 ఆర్థిక సంవత్సరంలో తొమ్మిది నెలల్లోనే దేశవ్యాప్తంగా ప్రకటించిన పెట్టుబడుల్లో 25.3 శాతం ఆంధ్రప్రదేశ్ ఆకర్శించిందని తెలిపారు. దేశవ్యాప్తం >>2

## నేటి నుంచి గుంటూరులో

# ప్రపంచ తెలుగు మహాసభలు

> హాజరవుతున్న వివిధ రంగాలకు చెందిన పలువురు ప్రముఖులు
>
> ప్రారంభసభకు ముఖ్యఅతిథిగా విశ్వయోగి విశ్వంజి
>
> ప్రతిభావంతులకు 80 పూర్ణకుంభ పురస్కారాలు, 40 విశిష్ట పురస్కారాలు
>
> 3రోజులపాటు సాహితీ సదస్సులు, అవధానాలు, సంగీత కార్యక్రమాలు

**విజయవాడ,జనవరి2,ప్రభాతవార్తప్రతినిధి:** మాతృభాషకు ప్రాధాన్యతను.అవశ్యకతను వివరించే దిశలో తెలుగువారి ఆత్మీయ పండుగకు గుంటూరు సర్వాంగ సుందరంగా ముస్తాబయింది,. జనవరి 3, 4, 5 తేదీల్లో మూడో ప్రపంచ తెలుగు మహాసభలకు ముమ్మరంగా ఏర్పాట్లు జరిగాయి.శనివారం ఈ సభలు అంగరంగ వైభోగంగా ఆరంభమవుతున్నాయి.ఈ సభలకు తెలుగువారి అనురాగ సంగమంగా నామకరణం చేశారు. ఆంధ్ర సారస్వత పరిషత్తు అధ్యక్షుడు గజల్ శ్రీనివాస్ అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్నారు.3వ తేదీ విశ్వయోగి విశ్వంజీ ముఖ్య అతిధిగా ప్రారంభ సభలో పాల్గొంటారు. కీలక సభలో జస్టిస్ పమిడిఘంటం నరసింహా ముఖ్య అతిధిగా, స్పీకరు చింతకాయల >>2

### మరోసారి సిట్ కస్టడీకి

# జోగి బ్రదర్స్

### నకిలీ మద్యం కేసు

**విజయవాడ,జనవరి 2,ప్రభాతవార్తప్రతినిధి:** నకిలీ మద్యం తయారీకేసులో మాజీ మంత్రి, వైసీపీనేత జోగి రమేశ్‌కు సంబంధించిన సిట్ దూకుడు పెంచింది. ఈ కేసులో కీలక నిందితులుగా ఉన్న జోగి రమేశ్, ఆయన సోదరుడు రాములును ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) మరోసారి కస్టడీలోకి తీసుకుంది. శుక్రవారం ఉదయం వారిద్దరినీ అధికారికంగా కస్టడీలోకి తీసుకున్న సిట్ అధికారులు, మూడురోజుల పాటు లోతైన విచారణ చేపట్టనున్నారు. ఇబ్రహీంపట్నం ప్రాంతంలో నకిలీ మద్యం తయారీ, సరఫరాకు సంబంధించిన కేసులో ఇప్పటికే జోగి >>2

# మాతృభాషను రక్షించుకుందాం

### 'సుప్రీం' న్యాయమూర్తి జస్టిస్ పమిడిఘంటం నరసింహా

**విజయవాడ,జనవరి2,ప్రభాతవార్తప్రతినిధి:** మాతృభాష పరిరక్షణ అందరిపైనా ఉందని సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ పమిడిఘంటం నరసింహా అన్నారు. పిల్లలను పుస్తకాలు చదివేలా ప్రోత్సహించాలన్నారు.పుస్తకమహోత్సవాలను పిల్లలకు చూపించాలన్నారు.తాను కుడా అనేకమంది పిల్లల మాదిరిగా కాన్వెంట్ స్కూల్‌లో చదివానన్నారు. అప్పట్లో తెలుగులో రాస్తే కొట్టేవారన్నారు.ఇంగ్లీష్‌లోనే లేఖ రాయమనే వారు.అలా రాస్తే మా నాన్న తెలుగులోనే రాయమని చెప్పారన్నారు.విజయవాడ నగర పాలకసంస్థ క్రీడా మైదానంలో 36వ పుస్తక మహోత్సవం శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది.ఈ కార్యక్రమాన్ని జస్టిస్ పమిడిఘంటం నరసింహా ప్రారంభించారు.రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్,ఉపసభాపతి కనుమూరు రఘురామ కృష్ణరాజు, సీపీఐ జాతీయ నేత నారాయణ,సీనియర్ సంపాదకులు కె.రామచంద్రమూర్తి,మాజీ ఎంపీ యార్లగడ్డ లక్ష్మీప్ర సాద్ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా జరిగిన సభలో జస్టిస్ పమిడిఘంటం నరసింహా మాట్లాడుతూ కాన్వెంటు చదువు తరువాత తాను తెలుగునేర్చుకుని రామయణం, భాగ వతం చదివాను.తనకు చిన్నతనం నుంచి పుస్తకాలంటే అనుబంధం ఉండేదన్నారు.అవి ప్రాణం పోసుకున్న జీవులనే అభిప్రాయం అన్నారు. పుస్తకాలు మనల్ని ఎన్నుకుని నన్ను చదవరా అని పిలుస్తాయి, పుస్తకాలు మనందరి మధ్యలో పెరుగుతాయి. కొన్ని నవ్విస్తాయి, కొన్ని సీరియస్‌గా ఉంటాయి.తీర్పును నిర్ణయం చేసే సమయంలో రాజ్యాంగంలో ఉన్న అక్షరాలు >>2



శుక్రవారం విజయవాడ పుస్తక మహోత్సవంలో ప్రారంభోపన్యాసం చేస్తున్న జస్టిస్ పమిడిఘంటం నరసింహా

# నేడు కొండగట్టుకు డిసిఎం పవన్

**విజయవాడ,జనవరి2,ప్రభాతవార్తప్రతినిధి:** తెలంగాణ రాష్ట్రంలోని కొండగట్టు ఆంజనేయస్వామి క్షేత్రానికి ఈనెల 3 శనివారం ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ వెళ్లనున్నారు. సీఎం చంద్రబాబు నాయుడు సహకారం, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చొరవతో తెలంగాణలోని కొండగట్టు ఆంజనేయ క్షేత్రానికి తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) నిధులు మంజూరు చేసింది. టీటీడీ నుంచి రూ.35.19 కోట్ల నిధులతో సత్రం, దీక్షావిరమణ మండపం నిర్మాణాలు చేయనున్నారు. రేపు పవన్ కల్యాణ్ కొండగట్టుకు వెళ్లి ఈ నిర్మాణాల పనులకు శంకుస్థాపన చేయనున్నారు. శనివారం ఉదయం 10.30 ని.నుంచి 11గం.30ని. మధ్య డిప్యూటీ సీఎం పవన్ కొండగట్టు క్షేత్రంలో >>2



# బళ్లారిలో టెన్షన్..టెన్షన్..

### బ్యానర్ వివాదంలో కాంగ్రెస్, బిజెపిల మధ్య ఘర్షణ

### కాల్పుల్లో ఒకరి మృతి.. పలువురికి గాయాలు, 144 సెక్షన్ అమలు

### భారీగా పోలీసు బలగాల మొహరింపు

### ఎమ్మెల్యే గాలి జనార్ధన్‌రెడ్డి, మాజీ మంత్రి శ్రీరాములు, మాజీ ఎమ్మెల్యే సోమశేఖర్‌రెడ్డిపై కేసులు

**అనంతపురం, జనవరి 2 ప్రభాతవార్త బ్యూరో:** కర్ణాటక రాష్ట్రం బళ్లారిలో బిజెపి, కాంగ్రెస్ వర్గాల మధ్య బ్యానర్ వివాదంతో మొదలైన రెండు వర్గాల మధ్య గొడవ ఘర్షణలకు దాడి తీసింది. >>2

# శ్రేయా ఇన్‌ఫ్రా ఆస్తుల జప్తు!

### వందల కోట్ల కుంభకోణం ఆరోపణలు

### దర్యాప్తు జరుపుతున్న సిఐడి

**విజయవాడ,జనవరి2,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లోని శ్రేయా ఇన్‌ఫ్రా కంపెనీలపై ప్రభుత్వం చర్యలు వేగవంతం చేసింది. ఈ కంపెనీపై రూ.వందల కోట్ల కుంభకోణం ఆరోపణలు ఉన్న నేపథ్యంలో సీఐడీతోపాటు, స్థానిక పోలీసులు చర్యలు చేపట్టారు. శ్రేయా ఇన్‌ఫ్రా డైరెక్టర్లు, వారి బంధులు పేరిట ఉన్న స్థిరాస్తులును డిపాజిటర్ల రక్షణ చట్టం కింద అటాచ్ (జప్తు) చేసే ప్రక్రియలో భాగంగా సీఐడీ అధికారులు శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపినట్లు సమాచారం. దాదాపు రూ.206 కోట్లు వరకు మోసం జరిగిందని ప్రాథమికంగా గుర్తించినట్లు తెలుస్తుంది. ఇన్‌ఫ్రా వల్ల నష్టపోయిన 8వేల మంది బాధితుల బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించడానికి ప్రత్యేక డెస్క్ ఏర్పాటు చేశారు. ఈ సంస్థకు చెందిన కీలక >>2

### పోక్సో కేసు:

> రూ.5 వేలు జరిమానా
>
> బాధితురాలికి రూ.5 లక్షలు మంజూరు

# నిందితునికి 20యేళ్ల జైలు

**విజయనగరం, జనవరి 2 ప్రభాతవార్త:** విజయనగరంజిల్లా బాడంగి పోలీసు స్టేషనులో 2024సం.లో నమోదైన పోక్సో కేసులో నిందితుడు బాడంగి మండలం, వాడాడ గ్రామంకు చెందిన వాడాడ వెంకటరమణ (23)కు 20ఏళ్లు జైలు శిక్ష విధిస్తూ పోక్సో కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి కే.నాగమణి తీర్పు వెలువరించారు. అలాగే నిందితుడికి రూ.5,000లు జరిమానా విధించడంతోపాటు, బాధితురాలికి పరిహారంగా రూ.5లక్షలు మంజూరు చేస్తూ జనవరి 2న తీర్పు వెల్లడించారని విజయనగరం జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్, ఐపీఎస్ తెలిపారు. వివరాల్లోకి వెళ్ళితే బాడంగి మండలం, రాజేరు గ్రామానికి చెందిన ఒక బాలిక (14) కనపడుటలేదని 2024 డిసెంబరు 28న బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదుపై ఎస్ఐ జె.తారకేశ్వరరావు మిస్సింగు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు. కేసు దర్యాప్తులో బాడంగి మండలం, వాడాడ గ్రామానికి చెందిన ఒకనిందితుడు వాడాడ వెంకటరమణ (23)ఆ బాలికను ప్రేమిస్తున్నాని వెంటపడుతూ, పెళ్లి చేసుకుంటానని నమ్మించి బాలికను కత్తిపూడి తీసుకొని వెళ్లి, అక్కడ శారీరకంగా పలుమార్లు అనుభవించాడని తెలియడంతో పోక్సో చట్టం క్రింద కేసును ఆల్టర్ చేయగా, బొబ్బిలి డిఎస్పీ జి.భవ్యరెడ్డి కేసును దర్యాప్తు చేపట్టి, నిందితుడిని అరెస్టు చేసి రిమాండుకు తరలించారు. నిందితుడిపై న్యాయస్థానంలో అభియోగపత్రం దాఖలు చేసారన్నారు. నిందితుడు వెంకటరమణపై నేరారోపణలు రుజువు కావడంతో విజయనగరం పోక్సో కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి కె.నాగమణి 20సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, రూ.5,000లు జరిమానా విధించడంతోపాటు, బాధితురాలికి పరిహారంగా రూ.5లక్షలు మంజూరు చేస్తూ జనవరి 2న తీర్పు వెల్లడించారని జిల్లా ఎస్పీ తెలిపారు. ఈ కేసులో నిందితుడిపై నేరం నిరూపణ అయ్యే విధంగా పోలీసులు తరుపున ఫోక్సో కోర్టు ఇన్చార్జ్ పబ్లిక్ ప్రాసిక్యూటరు ఎం. ఖజానారావు వాదనలు వినిపించారన్నారు. ఈ కేసులో క్రియాశీలకంగా పనిచేసి, నిందితుడిని శిక్షించబడే విధంగా సమర్ధవంతంగా పని చేసిన బొబ్బిలి >>2



శుక్రవారం వైకుంఠంలో భక్తుల క్యూలైన్లను ఏఐ విధానం ద్వారా పరిశీలిస్తున్న అదనపు ఇఒ వెంకయ్యచౌదరి

# ఇక సామాన్యుడిదే 'వైకుంఠం'

## ప్రశాంతంగా భక్తుల సంతోష దర్శనం

**తిరుమల,జనవరి 2(ప్రభాతవార్తప్రతినిధి):** ధనుర్మాసంలో పవిత్రమైన పదిరోజుల వైకుంఠద్వార దర్శనంలో నాల్గవరోజు శుక్రవారం నుండి వారంరోజులు సామాన్యభక్తులకే అవకాశం కల్పిస్తున్నారు. ఈ వైకుంఠ దర్శనాలకు ఎటువంటి టోకెన్ ,టిక్కెట్ లేకున్నా సర్వదర్శనంలో భక్తులను తిరుమలలోని ఔటర్ భవనం కూడలి నుండి గురువారం రాత్రి అనుమతించిన టిటిడి అధికారులు శుక్రవారం ఉదయం శిలాతోరణం వద్ద ఉన్న క్యూలైన్ల మీదుగా భక్తులను వైకుంఠం 2 లోనికి అనుమతిస్తున్నారు. తొలి నుండి పటిష్టప్రణాళికలు రచించిన టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, టిటిడి ఇఒ అనిల్‌కుమార్‌సింఘాల్, అదనపు ఇఒ చిరుమామిళ్ల వెంకయ్యచౌదరి ,తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ సతీజాముల వెంకటేశ్వర్, జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు, టిటిడి సివిఎస్ఒ కెవి మురళీకృష్ణ గురువారం మధ్యాహ్నం నుండి క్యూలైన్లను పర్యవేక్షించారు. శుక్రవారం ఉదయం నుండి సామాన్యభక్తులకు ఆన్‌లైన్‌లో 300 రూపాయలు 15వేలమంది, వెయ్యమంది శ్రీవాణి టిక్కెట్ భక్తులతో పాటు వైకుంఠద్వార దర్శనాలను మహాలఘులోనే అనుమతించి చేయిస్తున్నారు. సాయంత్రం వరకు 47వేలమంది భక్తులు వైకుంఠ ద్వారంలో ఏడుకొండలస్వామిని దర్శించుకున్నారు. పదిరోజుల వైకుంఠ దర్శనాల్లో తొలిమూడురోజులు డిసెంబర్ 30,31,జనవరి 1న మాత్రం ఆన్‌లైన్‌లో ఇడిప్ టోకెన్లు కలిగిన 1.79లక్షలమంది భక్తులు దర్శనం చేసుకోగా అదనంగా మరో దాదాపు 23వేలమంది వరకు భక్తులు రాజ్యాంగహోదాలో ఉన్న వివిఐపిలు వారి కుటుంబసభ్యులు ,టిటిడి ఉద్యోగులు దర్శనం చేసుకోవడం విశేషం. ఆ మూడురోజులు సాఫీగా చేయించిన టిటిడి అధికారులు శుక్రవారం నుండి రెండింతలు ప్రశాంతంగా, సాఫీగా సంతోషకర వైకుంఠ దర్శనాలు చేయిస్తున్నారు. తిరుమల ఆలయంలో ప్రతి ఏడాది వైకుంఠ ఏకాదశి,ద్వాదశి పర్వదినాలతోపాటు మరో ఎనిమిదిరోజులు భక్తులు తిరుమలకు చేరుకున వారిని గోవింద మాలలు ధరించి గోవిందనామాలతో తిరుమల మారుమోగుతోంది. భక్తులను టిటిడి అధికారులు సకల సౌకర్యాలు కల్పిస్తున్నారు. సరాసరి రోజుకు 70వేలమందికి మించి దర్శనం చేయిస్తున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాలమేరకు సామాన్యభక్తులకే వైకుంఠద్వార దర్శనాలు ప్రాధాన్యతనిస్తున్నామని టిటిడి అదనపు ఇఒచిరుమామిళ్ల వెంకయ్యచౌదరితెలిపారు. నిర్దేశిత సమయం ప్రకారమే భక్తులను రెండు గంటల్లోనే సర్వదర్శనంలో వైకుంఠద్వారం దర్శనం చేయించడం ప్రత్యేకత. తిరుమలలో భక్తులకు క్యూలైన్లలో సకల సౌకర్యాలు కల్పిస్తున్నారు. తాగునీటిని ప్రత్యేకంగా క్యాన్లను తీసుకువచ్చి భక్తులకు ఎక్కడ అడిగితే అక్కడ తాగునీరు అందించడం ఈ ఏడాది ప్రత్యేకత. కాగా ఏవతో తొలిసారిగా తిరుమలలో శుక్రవారం ఉదయం 9గంటలవరకు 805వాహనాలు చేరుకోగా,తిరుపతికి 399 వాహనాలు వెళ్ళాయి. మొత్తం 30,976మంది భక్తులు చేరుకోగా 10వేల మంది భక్తులు దర్శనం చేసుకున్నారు.ఈ వివరాలను అదనపు ఇఒ వెంకయ్యచౌదరి వెల్లడించారు.



ఆలయం ముందు భక్తులకు తాగునీరు అందిస్తున్న సేవకులు

# బెలూచిస్థాన్‌లో చైనా మిలిటరీ మోహరింపు

## సిపిఇసి కారిడార్‌కోసం పాక్ చైనాతో కుట్రలు

### భారత్ విదేశాంగమంత్రికి బలూచ్‌నేత లేఖ

**క్వెట్టా, జనవరి 2:** దక్షిణాసియాలో వ్యూహాత్మక సమీకరణలు వేగంగా మారుతున్నాయి. పాకిస్థాన్‌లోని అస్థిర ప్రాంతమైన బలూచిస్థాన్‌లో చైనా తన సైనిక బలగాలను మోహరించబోతోందన్న వార్తలు ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా కలకలం రేపుతున్నాయి. ప్రముఖ బలూచ్ నేత మీర్ యార్ బలూచ్ ఈ మేరకు భారత విదేశాంగమంత్రికి లేఖరాసారు. చైనాపాకిస్థాన్ మధ్య పెరుగుతున్న సైనిక అనుసంధానం కేవలం బలూచిస్థాన్‌కే కాకుండా భారతదేశ భద్రతకు కూడా పెను ముప్పుగా పరిణమించబోతోందని ఆయన హెచ్చరించారు. భారత విదేశాంగ మంత్రికి రాసిన బహిరంగ లేఖలో పలు సంచలన విషయాలను వెల్లడించారు. చైనాపాకిస్థాన్ ఎకనామిక్ కారిడార్ (సిపిఇసి) ప్రాజెక్టు ఇప్పుడు తుది దశకు చేరుకుందని ఈ క్రమంలో తన పెట్టుబడులను కాపాడుకోవడానికి చైనా నేరుగా తన సైన్యాన్ని బలూచిస్థాన్ గడ్డపై దింపేందుకు సిద్ధమవుతోందని ఆయన పేర్కొన్నారు. మరో కొన్ని నెలల్లోనే బలూచిస్థాన్‌లో చైనా సైనికుల బూట్ల చప్పుడు వినిపించవచ్చని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. బలూచిస్థాన్‌లో చైనా సైనిక ఉనికి కేవలం స్థానిక సమస్య కాదని ఇది భారత భవిష్యత్తుకు కూడా సవాలుగా మారుతుందని మీర్ యార్ బలూచ్ విశ్లేషించారు. చైనా, పాకిస్థాన్ కూటమి అంతకంతకూ బలపడుతోందని దీనిని అడ్డుకోవడానికి బలూచ్ స్వాతంత్ర్య పోరాట శక్తులకు అంతర్జాతీయ మద్దతు అవసరమని ఆయన కోరారు. ముఖ్యంగా గత ఏడాది భారత ప్రభుత్వం నిర్వహించిన ఆపరేషన్ సిందూర్ వంటి ధైర్య సాహసోపేతమైన చర్యలను ఆయన ప్రశంసించారు. ఉగ్రవాద స్థావరాలపై భారత్ జరిపిన మెరుపు దాడులు ప్రాంతీయ భద్రతకు ఎంతో కీలకమని ఆయన అభిప్రాయపడ్డారు. గత ఏడు దశాబ్దాలుగా పాకిస్థాన్ సైన్యం బలూచిస్థాన్‌లో సాగిస్తున్న అరాచకాలు, అపహరణలు, ఊచకోతలను ఆయన తన లేఖలో ప్రస్తావించారు. పాకిస్థాన్ తన స్వార్థం కోసం బలూచిస్థాన్ వనరులను చైనాకు తాకట్టు పెడుతోందని 6 కోట్ల మంది బలూచ్ ప్రజల అనుమతి లేకుండా చైనా సైన్యం అక్కడ అడుగు పెడితే అది చట్టవిరుద్ధమైన ఆక్రమణే అవుతుందని ఆయన స్పష్టం చేశారు. ప్రస్తుతం పాకిస్థాన్ ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోవడం, మరోవైపు చైనా తన ప్రాజెక్టుల రక్షణ కోసం పాక్ సైన్యంపై నమ్మకం కోల్పోవడం వంటి పరిణామాలు ఈ సైనిక మోహరింపు వార్తలకు బలాన్ని చేకూరుస్తున్నాయి. ఈ ఉదంతంపై అటు చైనా గానీ, ఇటు పాకిస్థాన్ గానీ ఇప్పటి వరకు అధికారికంగా స్పందించలేదు. అయితే బలూచ్ నేత చేసిన ఈ హెచ్చరికలు ఇప్పుడు అంతర్జాతీయ దౌత్య వర్గాల్లో తీవ్రస్థాయి చర్చనీయాంశంగా మారాయి.

# ఖతార్‌జైలులో ఉన్న నాసోదరుడిని విడిపించండి

## నేవీ మాజీ అధికారి సోదరి ప్రధాని మోడీకి విజ్ఞప్తి

**న్యూఢిల్లీ, జనవరి 2:** ఖతార్‌లో గూఢచర్యం ఆరోపణలతో అరెస్టయి, ఆ దేశ పాలకుడి క్షమాభిక్షతో విడుదలైన 8 మంది భారత మాజీ నేవీ అధికారుల కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఏడుగురు అధికారులు భారత్‌కు తిరిగి రాగా, మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్‌కు చెందిన రిటైర్డ్ కమాండర్ పుర్నేందు తివారీ (65) మాత్రం ఓ కొత్త కేసులో చిక్కుకుని దోహా జైల్లోనే మగ్గుతున్నారు. తన సోదరుడిని వెంటనే విడిపించాలని కోరుతూ ఆయన సోదరి డాక్టర్ మీతూ భార్గవ ప్రధాని నరేంద్ర మోదీ, విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్‌లకు విజ్ఞప్తి చేశారు. 2022 ఆగస్టులో గూఢచర్యం ఆరోపణలపై తివారీ సహా 8 మందిని ఖతార్ అధికారులు అరెస్ట్ చేశారు. మొదట మరణశిక్ష విధించినా, భారత ప్రభుత్వం చేసిన దౌత్య ప్రయత్నాల ఫలితంగా శిక్షను జైలు శిక్షగా మార్చారు. 2024 ఫిబ్రవరిలో ఖతార్ అమీర్ క్షమాభిక్ష ప్రసాదించడంతో ఏడుగురు అధికారులు స్వదేశానికి తిరిగి వచ్చారు. అయితే, తివారీ పనిచేస్తున్న దహ్రా గ్లోబల్ టెక్నాలజీస్ కంపెనీకి సంబంధించిన ఆర్థిక అవకతవకల కేసులో ఆయనపై ట్రావెల్ బ్యాన్ ఉండటంతో ఆయన అక్కడే చిక్కుకుపోయారు. తాజాగా పాత కేసు ఆధారంగానే కుట్రపూరితంగా మరో కేసును సృష్టించారని, అందులో క్రిమినల్ కుట్ర, మనీ లాండరింగ్ ఆరోపణలతో తన సోదరుడికి ఆరేళ్ల జైలు శిక్ష విధించారని మీతూ భార్గవ ఎక్స్ వేదికగా ఆవేదన వ్యక్తం చేశారు. గత నెల రోజులుగా ఆయన జైల్లో తీవ్ర అవమానాన్ని ఎదుర్కొంటున్నారని తెలిపారు.

# నీటి తగవుపై ప్రత్యేక కమిటీ

>> చాప్టర్9, సెక్షన్ 84 ప్రకారం.. కృష్ణా, గోదావరి నదీ జలాల వినియోగానికి సంబంధించిన విషయంలో సమస్యల పరిష్కారం కోసం అపెక్స్ కౌన్సిల్ ఏర్పాటైంది. 16, జూలై 2025 నాడు ఢిల్లీలో కేంద్ర జలవనరుల శాఖ (జల్‌శక్తి) మంత్రి సీఆర్ పాటిల్ నేతృత్వంలో జరిగిన అపెక్స్ కౌన్సిల్ సమావేశంలో.. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల ముఖ్యమంత్రులు పాల్గొన్న విషయం తెలిసిందే. ఈ సమావేశంలో ఇరు రాష్ట్రాల మధ్య ఉన్న జల వివాదాలను ఇద్దరు ముఖ్యమంత్రులు ప్రస్తావించగా.. వాటిని చర్చించి, సాంకేతికతంగా పరిశీలించేందుకు కేంద్ర ప్రభుత్వం, ఇరు రాష్ట్రాల ప్రతినిధులతో కూడిన కమిటీ ఏర్పాటు చేయాలని అపెక్స్ కౌన్సిల్ నిర్ణయించింది. ఇందుకోసం ఇరు తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు తమ ప్రతినిధులను నామినేట్ చేయాలని సూచించింది. డిసెంబర్ 23, 2025 నాడు తెలంగాణ ప్రభుత్వం నామినేట్ చేయడంతో శుక్రవారంనాడు కేంద్ర జలవనరుల సంఘం కొత్త కమిటీని నోటిఫై చేసింది. ఈ కమిటీకి కేంద్ర జల వనరుల సంఘం ఛైర్మన్ నేతృత్వం వహించనున్నారు. ఈ కమిటీలో తెలంగాణ నుంచి జలవనరుల శాఖ సలహాదారు, ఇరిగేషన్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, తెలంగాణ ప్రభుత్వ స్పెషల్ సెక్రటరీ, ఇంజనీర్ ఇన్ చీఫ్ సభ్యులుగా ఉండగా.. ఆంధ్రప్రదేశ్ నుంచి.. జలవనరుల శాఖ స్పెషల్ సెక్రటరీ, జలవనరుల శాఖ సలహాదారు, ఇంజనీర్ ఇన్ చీఫ్ (ఇరిగేషన్), చీఫ్ ఇంజనీర్ సభ్యులుగా ఉండనున్నారు. వీరితోపాటుగా.. కృష్ణానది యాజమాన్య బోర్డు ఛైర్మన్, గోదావరి నది యాజమాన్య బోర్డు ఛైర్మన్, నేషనల్ వాటర్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ (ఎన్‌డబ్ల్యుడిఏ) చీఫ్ ఇంజనీర్, సిడబ్ల్యుసి చీఫ్ ఇంజనీర్ కూడా సభ్యులుగా ఉండనున్నారు.

# పెట్టుబడుల సాధనలో రాష్ట్రం నం.1

>> గా ప్రతిపాదిత పెట్టుబడుల్లో రాష్ట్రం అగ్రగామిగా ఉందని విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ వెల్లడించారు. ఒడిశా (13.1 శాతం), మహారాష్ట్ర (12.8 శాతం) రాష్ట్రాలను వెనక్కునెట్టి ముందంజలో నిలిచిందని పేర్కొన్నారు. నిరంతరం సంస్కరణలు, వేగవంతమైన నిర్ణయాలు, పెట్టుబడిదారుల పట్ల స్పష్టమైన నిబద్ధతకు ఇదే ఫలితమని తెలిపారు. దీని ద్వారా దేశంలోని పారిశ్రామిక, పెట్టుబడి దిశ తూర్పు నుంచి దక్షి ణ రాష్ట్రాల వైపు మళ్లుతున్నట్లు స్పష్టమవుతోందని పేర్కొన్నారు. నివేదిక ప్రకారం దేశవ్యాప్తంగా ప్రకటించిన మొత్తం మూలధన పెట్టుబడుల్లో 51.2 శాతం కేవలం మూడు రాష్ట్రాల్లోనే కేంద్రీకృతమై ఉందని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా ప్రతిపాదిత పెట్టుబడి ప్రకటనలు రూ.26.6 లక్షల కోట్లకు చేరాయన్నారు. రాష్ట్రంలో పెట్టుబడిదారులకు అనుకూల పాలన, అనుమతుల మంజూరులో వేగం, రంగాలవారీ విధానాలు, పోర్టులు, పారిశ్రామిక కారిడార్లు, లాజిస్టిక్స్, ఇంధనం, డిజిటల్ మౌలిక వసతులపై భారీ పెట్టుబడులు ఈ విజయానికి ప్రధాన కారణాలుగా పేర్కొన్నారు.

## నేటి నుంచి గుంటూరులో ప్రపంచ తెలుగు మహాసభలు

>> అయ్యన్న పాత్రుడు, విశిష్ట అతిథిగా,కేంద్రమంత్రులు పెమ్మసాని చంద్రశేఖర్, కింజరపు రామ్మోహన్ నాయుడు, కిషన్‌రెడ్డి, బండి సంజయ్, భూపతిరాజు శ్రీనివాసవర్మ పాల్గొంటారు. సభలో తెలుగుభాష అభ్యున్నతి, పరిరక్షణకు విశేష కృషి చేసిన సంస్థలు, ప్రతిభావంతులకు 80 పూర్ణకుంభ పురస్కారాలు, 40 విశిష్ట పురస్కారాలతో పాటు జీవన సాఫల్య పురస్కారాలనూ ప్రదానం చేయనున్నారు. వెయ్యిమంది కవులతో అమరావతికి సహస్ర కవితా నీరాజనం సమర్పించనున్నారు. దీనికితోడు పండితులతో సైతం అవధానం సాగనుంది జనవరి 4వ తేదీన మారిషస్ అధ్యక్షుడు ధరమ్ గోకుల్ ఈ కార్యక్రమానికి హాజరై మంచి సందేశం ఇస్తారని గజల్ శ్రీనివాస్ తెలిపారు. మారిషస్‌లో ఎక్కువమంది తెలుగువారు ఉండడంతో ఆహ్వానించామని గజల్ శ్రీనివాస్ చెప్పారు. అంతేకాకుండా మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, పూర్వపు సీజేఐ జస్టిస్ ఎన్.వి. రమణతో పాటు సుప్రీంకోర్టు న్యాయమూర్తి, హైకోర్టు న్యాయమూర్తులు, తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు చంద్రబాబు, రేవంత్‌రెడ్డి నలుగురు గవర్నర్లు, మంత్రులు, ఎమ్మెల్యేలు, వివిధ రాష్ట్రాల ఎంపీలు సైతం హాజరవుతారని గజల్ వివరించారు. 5వ తేది సీఎం చంద్రబాబునాయుడు ఈ సభలో పాల్గొంటారు. వీవీఐపీల కోసం ప్రత్యేకంగా సభావేదికల వద్ద మూడు క్యాప్సూల్ హోమ్స్ ను ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో ఇంటిని తలపించేలా షవర్లు, బెడ్‌రూమ్, బాల్కనీ వంటి వసతులన్నీ ఉన్నాయి. అతిథుల కోసం గుంటూరు పరిసరాల్లో 3,000 గదులను నిర్వాహకులు ఇప్పటికే సిద్ధం చేశారు. మొత్తం మూడు రోజుల పాటు దాదాపు 25,000 మంది యువతీ యువకులతో తెలుగు భాషపై వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తారు.

## కొత్త కరెన్సీని విడుదలచేసిన సిరియా అధ్యక్షుడు

**డమాస్కస్, జనవరి 2:** సిరియాలో అంతర్యుద్ధం ముగిసిన తర్వాత నెలకొన్నఆర్థిక సంక్షోభం చక్కదిద్దేందుకు ఆదేశ తాత్కాలిక అధ్యక్షుడు అహ్మద్ అల్‌షరా సిరియా ఆర్థిక వ్యవస్థలో సంస్కరణలు తెస్తున్నారు. కొత్త కరెన్సీ నోట్లను ప్రవేశపెట్టారు. అయితే, కేవలం కరెన్సీ మార్పిడి మాత్రమే కాదని, సిరియా జాతీయ అస్తిత్వానికి ప్రతీక అని అల్ షారా పేర్కొన్నారు. అసద్ పాలన నాటి నోట్లను మార్చి, కొత్త డిజైన్లతో కూడిన కరెన్సీని కొత్త సంవత్సరం మొదటి తేదీనే విడుదల చేశారు. అధ్యక్షుడు అహ్మద్ అల్‌షారా, సిరియా సెంట్రల్ బ్యాంక్ గవర్నర్ అబ్దుల్ ఖాదర్ హుస్రేహ్ ఈ కొత్త నోట్లను రాజధాని డమాస్కస్‌లో ఆవిష్కరించారు. పాత నోట్లలో అసద్ కుటుంబ సభ్యుల చిత్రాలు ఉండేవి. ఇప్పుడు వాటి స్థానంలో చారిత్రక కట్టడాలు, గులాబీలు, గోధుమలు, ఆలివ్‌లు, నారింజలు, మల్బరీల వంటి వ్యవసాయ, ప్రకృతికి సంబంధించిన చిహ్నాలను ఉంచారు.

# నేడు కొండగట్టుకు డిసిఎం పవన్

>> పర్యటించనున్నారు. గతంలో ఎన్నికల్లో విజయం సాధించిన తర్వాత కొండగట్టు ఆంజనేయ స్వామిని దర్శించుకున్న పవన్ మొక్కులు చెల్లించుకున్నారు. ఆ సమయంలో అక్కడ నిర్మాణాలకు సంబంధించిన అంశాలను అర్చకులు పవన్ కు వివరించారు. కొండగట్టు క్షేత్రంలో నిర్మాణాలపై సీఎం చంద్రబాబుతో పవన్ సమావేశమయ్యారు. టీటీడీ సహకారంతో కొండగట్టు క్షేత్రంలో నిర్మాణాలు చేయాలని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సీఎం చంద్రబాబును కోరారు. చంద్రబాబు ఆదేశాలతో టీటీడీ ఛైర్మన్ తో పవన్ చర్చించారు. అనంతరం రూ.35.19 కోట్లు మంజూరుకు టీటీడీ బోర్డు అంగీకారం తెలిపింది. ఈనిధులతో కొండగట్టు ఆలయంలో దీక్ష విరమణ మండపం, 96 గదుల సత్రం నిర్మాణాలు చేపట్టనున్నారు. ఒకేసారి 2 వేల మంది భక్తులు దీక్షలు విరమించేలా మండపాన్ని నిర్మించనున్నారు. శనివారం పవన్‌తో కలిసి టీటీడీ ఛైర్మన్ బి ఆర్‌నాయుడు, ఎమ్మెల్సీ హరిప్రసాద్, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం , టీటీడీ బోర్డు మెంబర్లు బి.ఆనందసాయి, ఇతర నేతలు పాల్గొనున్నారు. ఆలయం అభివృద్ధి పనుల శంకుస్థాపన అనంతరం జనసేన పార్టీ తెలంగాణ రాష్ట్ర నాయకులు, శ్రేణులతో పవన్ కళ్యాణ్ సమావేశం కానున్నారు. ఆతర్వాత ఇటీవలి తెలంగాణ పంచాయతీ ఎన్నికల్లో జనసేన మద్దతుతో గెలిచిన వారితో భేటీ అవనున్నారు. ఈ భేటీలు, సమావేశాలు కొడిమ్యాల సమీపంలోని బృందావనం రిసార్టులో జరగనున్నాయి.

# సకాలంలో సాగునీటి పథకాలు

>> నిర్మాణ పనులూ ప్రారంభమయ్యాయి. తీగలేరు కాలువకు హెడ్ రెగ్యులేటర్ల నిర్మాణమూ సాగుతోంది. పునరావాసం కూడా పూర్తిచేయాలి. నల్లమలసాగర్‌లో ఉన్న గ్రామాలను ఖాళీచేయించాలి. ప్రస్తుతం ఈ పనులు జరుగుతున్నా రూ.500 కోట్ల వరకు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. సీఎం ఈ పనులు పరిశీలించి, మార్గదర్శనం చేస్తారు. పోలవరం, వెలిగొండ ప్రాజెక్టులతో పాటు ఉత్తరాంధ్ర ప్రాజెక్టులనూ క్షేత్రస్థాయిలో సందర్శించనున్నారు.అంతేకాకుండా గడువులోగా ప్రాజెక్టుల నిర్మాణం పూర్తి చేయడంపై సమీక్షిస్తారు. ఈ మేరకు సీఎంఓ నుంచి జలవనరులశాఖ ఉన్నతాధికారులకు గురువారం సమాచారం అందింది. ఈజనవరి తొలివారంలోనే పోలవరంప్రాజెక్టును సందర్శిస్తారు. గోదావరి పుష్కరాలు 2027జూన్ చివరి వారంలో మొదలవుతాయి.సరిగ్గా అప్పుడే ఖరీఫ్ సీజన్ ప్రారంభమవుతుంది. అప్పటికి పోలవరం ప్రాజెక్టు పూర్తిచేస్తే బాగుంటుందని కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ సూచించారు.ఈ నెల 17న ఉత్తరాంధ్ర ప్రాజెక్టులపై సీఎం చంద్రబాబు దృష్టిసారిస్తారు. ఆయన ఏ ప్రాజెక్టును సందర్శిస్తారో ఇంకా ఖరారుకావాలి.ఈ జిల్లాల్లో రూ.2,087 కోట్లు ఖర్చుచేస్తే 9 ప్రాజెక్టులు పూర్తవుతాయని జలవనరులశాఖ ప్రణాళిక రూపొందించింది. కొత్త ఆయకట్టు 1.24 లక్షల ఎకరాలు సాగులోకి రావడంతోపాటు 2.48లక్షల ఎకరాల స్థిరీకరణకు ఉపకరిస్తుంది. నేరడి బ్యారేజి నిర్మాణం చేపట్టాలనే భావనతో రాష్ట్ర ప్రభుత్వం ఉంది. ఇందుకు వీలుగా వంశధార ట్రైబ్యునల్ తుది నోటిఫికేషన్ వెలువరించాలని పట్టుబడుతోంది.

## బళ్లారిలో టెన్షన్..టెన్షన్..

>> ఈ ఘర్షణల్లో ఒకరు మృతి చెందగా పలువురు గాయపడ్డారు. ఎమ్మెల్యే గాలి జనార్ధన్‌రెడ్డిపై తుపాకీతో కాల్పులు జరిపి హత్యాయత్నానికి పాల్పడ్డారు. ప్రస్తుతం 144 సెక్షన్ అమల్లో ఉంది. గాలి జనార్ధన్‌రెడ్డి ఇంటి వద్ద బ్యానర్లు ఏర్పాటు చేసేవిషయంలో ఎమ్మెల్యే భరత్‌రెడ్డి, ఎమ్మెల్యే గాలి జనార్ధన్‌రెడ్డి మద్దతుదారులమధ్య గురువారంరాత్రి ఘర్షణ జరిగింది. ఒకరిపై ఒకరు రాళ్లు రువ్వు కోవడంతోపాటు తుపాకులతో కాల్చే వరకు సంఘటన చోటు చేసుకుంది. ఆ సంఘటనలో ఒక యువకుడు చనిపోయినట్లు పోలీసులతో సహా పలువురు గాయపడటంతో ఆసుపత్రికి తరలించినట్లు సమాచారం. ఈ ఘర్షణలో కాంగ్రెస్ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి సన్నిహితుడు సతీష్‌రెడ్డి కూడా గాయపడి బెంగళూరులో ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చేరినట్లు తెలిసింది. తుపాకి కాల్పులకు గురై చనిపోయిన కాంగ్రెస్ కార్యకర్త రాజశేఖర్‌రెడ్డి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం బళ్లారి లోని కిమ్స్ ఆసుపత్రిలో ఉంచారు. **బళ్లారి ఘర్షణలో జనార్ధన్‌రెడ్డితో సహా 11 మందిపై కేసు :** గంగావతి ఎమ్మెల్యే గాలి జనార్ధన్‌రెడ్డి, మాజీ మంత్రి శ్రీరాములు, మాజీఎమ్మెల్యే సోమశేఖర్‌రెడ్డితో సహా 11 మందిపై కేసు నమోదు చేశారు. బళ్లారి సిటీ ఎమ్మెల్యే నారా భరత్ రెడ్డి సన్నిహితుడు శేఖర్ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా గాలి జనార్ధన్‌రెడ్డిపై ఎ1గా,ఆయన సోదరుడు సోమశేఖర్‌రెడ్డిని ఎ2గా, మాజీమంత్రి శ్రీరాములును ఎ3గా బళ్లారి మున్సిపల్ కార్పోరేషన్ ప్రతిపక్షనాయుడు శ్రీనివాసులును ఎ4గా చేర్చారు.ఇదిలా ఉండగా కాంగ్రెస్ కార్యకర్త రాజశేఖర్‌రెడ్డి శరీరంలోకి దూసుకెళ్లిన బుల్లెట్ పోలీసు బుల్లెట్ కాదని బళ్లారి ఎస్పీ పవన్ నెంజూర్ చెబుతున్నారు. ఆ బుల్లెట్ ప్రైవేట్ వ్యక్తులదై ఉంటుందని ఈ విషయాన్ని సిసి ఫుటేజీ ద్వారా తనిఖీ చేస్తున్నట్లు ఎస్పీ చెబుతున్నారు.




శుక్రవారం విజయవాడలో జరిగిన పుస్తక మహోత్సవంలో జస్టిస్ పమిడిఘంటం నరసింహకు పుస్తక జ్ఞాపికను అందిస్తున్న నిర్వాహకులు

# మాతృభాషను రక్షించుకుందాం

>> చూస్తే ఒళ్ళుపులకిస్తుంది. స్వేచ్ఛ,సమానత్వం,బంధుత్వం అని ఉంటాయి. తెలుగు భాషతో మనకు బాంధవ్యం ఏర్పడుతుందన్నారు.ఒక్కో పుస్తకం నుంచి ఒక్కో ఆలోచన వస్తుందన్నారు.సభలో జస్టిస్ పమిడిఘంటం నరసింహకు నిర్వహకులు పురాణ గ్రంధాలను జ్ఞాపికలుగా అందించారుజ.ఇక విజయవాడలో 36వ పుస్తక పండగ సందడి చేయనుంది. ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో ఈ నెల 12 వరకు ఈ వేడుక జరగబోతోంది. గతేడాదితో పోలిస్తే ఈసారి స్టాళ్ల సంఖ్య బాగా పెరిగింది. దేశంలో ప్రముఖ ప్రచురణ సంస్థలు అన్నీ తరలి వచ్చాయి. ఈసారి తెలుగుతో పాటు ఆంగ్ల పుస్తకాల ప్రచురణ సంస్థలు భారీగా వచ్చాయని విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ అధ్యక్షుడు టి. మనోహర్‌నాయుడు తెలిపారు. ప్రతిరోజు మధ్యాహ్నం 2 గంటల నుంచి రాత్రి 9 వరకు కూడా ప్రదర్శన కొనసాగుతుంది. దేశంలోని ప్రముఖ ప్రచురణ సంస్థలవి 262 స్టాళ్లు కాగా, 47 స్టాళ్లు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థలవి. గత ఏడాది 240 స్టాళ్లే ఏర్పాటు అయ్యాయి. గతసారి పుస్తక మైదానానికి వేదిక వెతుకులాటతోనే ఆఖరు నిమిషం వరకూ ఉత్కంఠ నెలకొంది. చివరిలో ఇందిరాగాంధీ మైదానం కుదిరింది. ఈసారి ముందే వేదికపై స్పష్టత వచ్చింది. దీంతో స్టాళ్ల సంఖ్య కూడా గణనీయంగా పెరిగింది. 1989 అక్టోబరులో నేషనల్ బుక్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మొట్టమొదటి పుస్తక మహోత్సవం విజయవాడలో నిర్వహించారు.తర్వాత ప్రతి సంవత్సరం పుస్తక మహోత్సవం నిర్వహించాలని ప్రచురణకర్తలు నిర్ణయించారు. విజయవాడలో ప్రచురణకర్తలు, సాహితీవేత్తలు, కవులు, రచయితలు అంతా కలిసి విజయవాడ పుస్తకమహోత్సవ సంఘం (జుతీసీలీ)గా ఏర్పడ్డారు. తొలి ఏడాది 1989లో 84 స్టాళ్లతో నిర్వహించారు.1991లో ఈ సంఖ్యం 90కు పెరిగింది. 2015లో అత్యధికంగా 389 స్టాళ్లు ఏర్పాటుతో రికార్డుసృష్టించారు.క్రమంగా స్టాళ్లు తగ్గుతూ వస్తున్నాయి. ఈసారి స్టాళ్లు 309కి పెరిగాయి.

**పాదయాత్రకు రానున్న సీఎం చంద్రబాబు:**

కోల్‌కతా పుస్తక ప్రదర్శన స్ఫూర్తితో 'ఏటా పుస్తక ప్రియుల పాదయాత్ర' బెజవాడలోను కూడా నిర్వహిస్తున్నారు. జనవరి 6న సాయంత్రం 4 గంటలకు మొగల్రా జపురం సిద్ధార్థ కళాశాల నుంచి పుస్తక మహోత్సవ ప్రాంగణం వరకు కూడా ఈ పాదయాత్రను నిర్వహించనున్నారు. ఈసారి సీఎం చంద్రబాబు రానున్నారు.

# ఇవిఎంలపై కాంగ్రెస్ పోరాటం చేస్తే కర్ణాటకలో సర్వే మాత్రం వాటికే ఓటు

**బెంగళూరు,జనవరి 2:** ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్లపై ఓటర్లలో విశ్వాసం అన్న అంశంపై కర్నాటకలో ఇటీవల సర్వే నిర్వహించారు. ప్లానింగ్ అండ్ స్టాటిస్టిక్స్ శాఖ ఆధ్వర్యంలో నడిచే కర్నాటక మానిటరింగ్ అండ్ ఎవాల్యువేషన్ అథారిటీ ఆ సర్వే చేపట్టింది. సుమారు 5100 మంది ఓటర్ల నుంచి అభిప్రాయాలను సేకరించారు. అయితే 85 శాతం మంది ఓటర్లు ఈవీఎంలపై తమ విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. 2024 లోక్‌సభ ఎన్నికలను స్వేచ్ఛగా నిర్వహించినట్లు తెలిపారు. ఆ సర్వే రిపోర్టు ఇప్పుడు కాంగ్రెస్, బీజేపీ మధ్య ఘర్షణకు దారి తీసింది.

ప్లానింగ్ అండ్ స్టాటిస్టిక్స్ శాఖ నిర్వహించిన సర్వేతో తమకు సంబంధం లేదని కర్నాటక ప్రభుత్వం చెబుతోంది. కాంగ్రెస్ ద్వంద్వ వైఖరి అవలంబిస్తున్నట్లు బీజేపీ ఆరోపించింది. ఓటు చోరీ జరుగుతున్నట్లు కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ చేస్తున్న ఆరోపణలు నిజం కాదు అని బీజేపీ నేత బీవై విజయేంద్ర తన ఎక్స్ అకౌంట్‌లో పోస్టు చేశారు. సర్వే నివేదిక ద్వారా ఆ విషయం స్పష్టం అవుతోందన్నారు. కానీ ఆ సర్వేకు అనుమతి ఇవ్వలేదని కర్నాటక ఐటీశాఖ మంత్రి ప్రియాంక్ ఖర్గే అన్నారు. పీఎంవో ఆఫీసుతో లింకున్న ఓ వ్యక్తికి చెందిన ఎన్జీవో సంస్థ ఆ సర్వే చేపట్టినట్లు ఖర్గే తెలిపారు.

# ఆస్తుల జప్తు!

>> వ్యక్తులు పరారీలో ఉండగా, వారి ఆచూకీ కోసం సీఐడీ బృందాలు ఇతర రాష్ట్రాల్లోనూ సోదాలు నిర్వహిస్తుంది. తక్కువ సమయంలో పెట్టిన పెట్టుబడికి అధిక వడ్డీలు ఇస్తామని, రియల్ ఎస్టేట్ ప్లాట్లు కేటాయిస్తామని మాయ మాటలు చెప్పి వేల మంది అమయాకులను ఈ సంస్థ డిపాజిట్లు సేకరించింది. గడువు ముగిసినా డిపాజిటర్లకు డబ్బులు తిరిగి ఇవ్వకపోవడంతో బాధితులు పోలీసులను ఆశ్రయించారు. ఈ కుంభకోణంలో కీలక వ్యక్తులు ఉండటంతో కేసును సీఐడీకి అప్పగించారు.

# జోగి బ్రదర్స్

>>బ్రదర్స్‌ను సిట్ అధికారులు ఒకసారి ప్రశ్నించిన విషయం తెలిసిందే. అయితే అప్పటి విచారణలో వెలుగులోకిరాని కీలక అంశాలు, మరికొందరు వ్యక్తులతో ఉన్న సంబంధాలు, నిధుల లావాదేవీలపై స్పష్టత కోసం రెండోసారి కస్టడీ అవసరమని అధికారులు భావించినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం జోగి రమేశ్, రాములు ఇద్దరూ రిమాండ్ ఖైదీలుగా ఉన్నారు.ఈ కేసుకు సంబంధించి మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. జోగి కుటుంబ సభ్యులకు పోలీసులు నోటీసులు జారీ చేశారు. జోగి రమేశ్ అరెస్టు సమయంలో విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తీసుకువెళ్లిన సందర్భంలో అక్కడ జరిగిన ఘటనలపై నమోదు చేసిన కేసులో భాగంగా, ఆయన భార్యతో పాటు కుమారుడికి సీఆర్‌పీసీ 41ఏకింద నోటీసులు అందజేశారు. ఆసుపత్రిలో అద్దాలు ధ్వంసం చేయడం, పోలీసుల విధులకు ఆటంకం కలిగించారనే ఆరోపణలతో ఈ కేసు నమోదు అయింది. **నిందితులకు రిమాండ్ పొడిగింపు:** నకిలీ మద్యం కుంభకోణం కేసులో నిందితుల రిమాండ్ వ్యవధి కూడా పొడిగించారు. ఈరోజు రిమాండ్ గడువు ముగియడంతో నిందితులను విజయవాడ జిల్లా జైలు నుంచి కోర్టుకుతరలించారు. వాదనలు విన్న న్యాయస్థానం ఈ నెల 16వ తేదీ వరకు రిమాండ్‌ను పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అనంతరం నిందితులను తిరిగి జిల్లా జైలుకు తరలించారు.

## 20యేళ్ల జైలు

>> డిఎస్పీజి.భవ్యరెడ్డి, బొబ్బిలి రూరల్ సి.ఐ. కె.నారాయణరావు,బాడంగి ఎస్ఐ జె.తారకేశ్వంరావు,సి.ఎం.ఎస్. హెచ్.సి.సిహెచ్. రామకృష్ణ, కోర్టు హెడ్ కానిస్టేబులు బి.మహేష్, స్పెషల్ పిపి ఎం.ఖజానారావులను జిల్లా ఎస్పీ ఎ.ఆర్. దామోదర్ ప్రత్యేకంగా అభినందించారు.

## వారం - వర్జ్యం

03-01-2026, శనివారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
పుష్యమాసం, దక్షిణాయణం
హేమంత ఋతువు, కృష్ణపక్షం, పూర్వాషాఢ కార్తె
○ పౌర్ణమి మ.3.35,
ఆరుద్ర సా.5.30,
వర్జ్యం : తె.4.23-తె.5.50,
దు.ఉ.6.37-ఉ.8.10
శుభసమయం : ఉ.8.20-8.50,సా.5.50-6.30
రాహుకాలం - ఉ.9.00-10.30

## వార్తాఫలం

**మేషం :** ఇంటి యందు శుభకార్యాల గురించి సన్నిహితులతో చర్చిస్తారు. స్త్రీ మూలంగా ధనలాభం పొందుతారు.

**వృషభం :** జీవిత భాగస్వామి సలహాతో నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. ఆస్తి వివాదాలు తీరి లబ్ధి పొందుతారు.

**మిథునం:** పనులు నిదానంగా పూర్తి చేస్తారు. ఆర్థిక పరిస్థితి కొంత వరకు మెరుగు పడుతుంది. నూతన ఒప్పందాలు చేసుకుంటారు.

**కర్కాటకం:** బంధువులను కలిసి ఆనందంగా గడుపుతారు. వివాదాలకు దూరంగా వుండండి. ఉద్యోగులకు స్థాన చలనం.

**సింహం:** దూర ప్రాంతాల నుండి ముఖ్య సమాచారం తెలుసుకొంటారు. చర్చా గోష్ఠులలో పాల్గొంటారు. దీర్ఘకాలిక సమస్యలు తీరుతాయి.

**కన్య :** సాంకేతిక, పరిశోధన విషయాలపై ఆసక్తి చూపుతారు. వ్యాపారాలలో స్వల్ప మార్పులు ఉంటాయి. ఆహార నియమాలు పాటిస్తారు.

**తుల :** పారిశ్రామిక, రాజకీయ రంగాలలోని వారికి కొంతవరకు అనుకూలం. శుభవార్తలు ఆనందం కలిగిస్తాయి.

**వృశ్చికం:** దురభ్యాసాల వైపు మనస్సు మళ్ళకుండా జాగ్రతలు వహించండి. ఆదాయాన్ని మించి ఖర్చులు పెరుగుతాయి.

**ధనుస్సు:** స్నేక్యులేషన్కు దూరంగా ఉండటమే పరోక్షంగా లాభంగా పరిణమిస్తుంది. ఇంటాబయటా అనుకూలం.

**మకరం:** వృత్తి, ఉద్యోగాల పరంగా ఉపయుక్తం లేని బాధ్యతలు పెరుగుతాయి. ఆరోగ్య నియమాలను పాటించండి.

**కుంభం:** మానసిక వత్తిడి అధికమవుతుంది. సెంటిమెంటు వస్తు భద్రతపట్ల జాగ్రత్తలు అవసరం.

**మీనం:** స్త్రీలతో విభేదాలు ఏర్పడనంతవరకు చెప్పుకోదగిన ఇబ్బందు లేవీ చోటు చేసుకోవు. వాహన సౌఖ్యం.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

## అమరావతిలో వరద సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా ప్రభుత్వం చర్యలు

**విజయవాడ,జనవరి2,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో వరద సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. రాజధాని ప్రాంతంలో భారీ వర్షాలు కురిసినప్పుడు, నీరు నిల్వలు ఏర్పడకుండా ఉండేందుకు చేపడుతున్న వరద నియంత్రణ చర్యల్లో భాగంగా, ఉండవల్లి గ్రామం వద్ద పంపింగ్ స్టేషన్-2 నిర్మాణానికి టెండర్లను ప్రభుత్వం ఖరారు చేసింది అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ ఆధ్వర్యంలో చేపట్టనున్న ఈ ప్రాజెక్టును జోన్-8 పరిధిలో నిర్మించనున్నారు. ఈ పంపింగ్ స్టేషన్ ద్వారా వరదల సమయంలో సుమారు 8,400 క్యూసెక్కుల నీటిని కృష్ణా నదిలోకి పంపించేలా డిజైన్ చేశారు. వర్షాకాలంలో రాజధాని ప్రాంతంలో నీటి ముంపు ఏర్పడకుండా ముందస్తు రక్షణ కల్పించడమే ఈ ప్రాజెక్టు ప్రధాన లక్ష్యం. ఈ పనులకు సంబంధించిన టెండర్లలో మేఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రా సంస్థ ఎల్1 బిడ్‌గా నిలవడంతో, ఆ సంస్థకే ప్రాజెక్టు బాధ్యతలను అప్పగిస్తూ తిదీదిలి నిర్ణయం తీసుకుంది. ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం కూడా అధికారికంగా ఆమోదం తెలిపింది.

# రైతుల మేలుకోసమే రీ సర్వే




### అంపోలులో 4 వ విడత రీసర్వే ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు

**శ్రీకాకుళం, జనవరి 2 ప్రభాతవార్త:** కుటుంబంతో ఎలాంటి రక్త సంబంధాలు కొనసాగిస్తామో అలాంటి బంధమే భూములతో కూడా ఉంటుందని.. ఆ బంధాన్ని బలపరిచే భాద్యత కూటమి సర్కారు తీసుకుందని కేంద్ర పౌర విమానయాన శాఖామంత్రి కింజరాపు రామ్మోహన్ అన్నారు. గార మండలం అంపోలు గ్రామంలో జరిగిన రీ సర్వే ప్రారంభోత్సవ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే గొండు శంకర్, జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్‌తో కలసి పాల్గొన్నారు. సభా కార్యక్రమం అనంతరం ఏర్పాటు చేసిన ర్యాలీలో కేంద్ర మంత్రి పాల్గొన్నారు. సభలో మాట్లాడిన రామ్మోహన్ నాయుడు 2026 సంవత్సరంలో కేంద్ర మంత్రి హోదాలో తాను పాల్గొంటున్న తొలి అధికారిక కార్యక్రమం ఇది అని, జిల్లాలో కీలకంగా ఉండే అంపోలులో ఇది జరగడం ఆనందంగా ఉందని చెబుతూ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. కేంద్ర మంత్రిగా గడచిన 18 నెలలు దేశమంతా క్షణం తీరిక లేని పర్యటనలు చేస్తూ అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్నామని స్పష్టం చేశారు. ఎంతమంది ప్రజా ప్రతినిధులు ఎన్నో ఏళ్లుగా పోరాటం చేస్తున్నా అనేక భూ సమస్యలు ఇంకా ఉండనే ఉన్నాయని, సమయం, ఖర్చులు, ప్రయాసలు పెరుగుతున్నా సమస్యలు మాత్రం పరిష్కారం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ రీ భూ సర్వే ద్వారా అన్ని సమస్యలు పరిష్కారం అవ్వాలని ఆకాంక్షించారు. గతంలో మాదిరిగా భూ సమస్యల పరిష్కారానికి ప్రజలు ప్రభుత్వం వద్దకు వెళ్ళే విధంగా కాకుండా ఈ సారి భిన్నంగా ప్రజల వద్దకే ప్రభుత్వం వచ్చే ఏర్పాటు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేశారని ఈ గొప్ప ఆలోచనతో శతశాతం సమస్యలు పరిష్కారం అవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇందులో ఎలాంటి రాజకీయాలకు ఆస్కారం లేదని తెలిపారు. జిల్లాను అభివృద్ధి చెయ్యాలని అధికార యంత్రాంగం శ్రమిస్తున్నా వారికి అపరిష్కృతంగా ఉన్న భూ సమస్యలు సవాల్ విసురుతున్నాయని స్పష్టం చేశారు. వాటిని త్వరితగతిన పరిష్కరించేలా స్థానిక ప్రజలు సైతం సహకారం అందించాలని తెలిపారు. గత వైఎస్సార్సీపి ప్రభుత్వ హయాంలో భూ సర్వే పేరుతో అనేక తప్పులు జరిగాయని ఆరోపించారు. గతంలో ఆరు వందల గ్రామాల్లో రీసర్వే జరిగితే ఎవరికీ సంబంధం లేదా.

# తిరుమల సమాచారం

## టిటిడి ట్రస్ట్‌లకు రూ.20లక్షలు విరాళం



**తిరుమల,జనవరి 2ప్రభాతవార్తప్రతినిధి:** టిటిడి నిర్వహిస్తున్న పలు పథకాలు, ట్రస్ట్‌లకు దాతలు తమవంతుగా విరాళాలందిస్తున్నారు. శుక్రవారం ఉదయం హైదరాబాద్‌కు చెందిన రైడాన్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ సిఇఒ వంగల హర్షవర్ధన్ 10లక్షలు రూపాయలు ఎస్వీ ప్రాణ దానట్రస్ట్‌కు, గ్లోబల్ మ్యాను ఫాక్చరింగ్ ప్రైవేట్ లిమిటెడ్ జాయింట్ డైరెక్టర్ నేలబొట్ల శుభ సౌజన్య బాలాజీ ఆరోగ్యవరప్రసాదినికి 10లక్షలు రూపాయలు డిడిలను టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడుకు అందజేశారు. ఆ సంస్థల తరపున ప్రతినిధులు కుప్పాల గిరిధర్‌కుమార్ విరాళాలిచ్చారు.

## 'వైకుంఠవాకిలి' దర్శనం ముక్తికి సోపానం : ప్రముఖులు



**తిరుమల,జనవరి 2ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలోపల పవిత్రమైన వైకుంఠవాకిలిద్వారా శ్రీవారిని దర్శించుకోవడం ఆనందకరమని పలువురు ప్రముఖులు తెలిపారు. భక్తుల్లో ఆధ్యాత్మిక ఉత్సాహాన్ని నింపాలని ఆకాంక్షించారు. శుక్రవారం ఉదయం సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శరత్‌ఛంద్రచందూర్కర్, తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ గడి ప్రవీణ్‌కుమార్,సింగర్‌మన్యచంద్రన్, ఐఎఎస్ కార్తికేయమిశ్ర కుటుంబసభ్యులతో కలసి ఆలయంలోనికి చేరుకున్నారు. వైకుంఠద్వార దర్శనంద్వారా శ్రీవారిని దర్శించుకుని కానుకలు సమర్పించారు. టిటిడి ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## దేశం అభివృద్ధిలో ప్రపంచంలోనే మూడవస్థానం: నటుడు సుమన్



**తిరుమల,జనవరి 2ప్రభాతవార్తప్రతినిధి:** భారతదేశ ఖ్యాతిని, అన్ని రంగాల్లో అభివృద్ధిని కాంక్షిస్తూ ప్రపంచంలోనే ఒక గుర్తింపు తీసుకువచ్చిన ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వం ప్రజల్లో విశ్వాసం చూరగొందని సినీనటుడు సుమన్ తెలిపారు. రాజకీయంగా తాను మాట్లాడటం లేదని, అభివృద్ధి చేసే నాయకుల వైపే నిజాలు మాట్లాడుతున్నానన్నారు. దేశం అభివృద్ధిలో మూడవస్థానంలో ఉండటం దేశ ప్రజలు కూడా మద్దతు తెలపాల్సిన అవసరం ఉందన్నారు. నాయకులు కాదని, మంచిచేసే వారిని ప్రజలు గుర్తించుకుంటారన్నారు. ప్రజలు జరుగుతున్న మంచి ,అభివృద్ధికి గర్వపడాలన్నారు. అన్నమయ్యచిత్రంలో శ్రీవారి పాత్ర పోషించడం తన జన్మధన్యత అని, ప్రస్తుతం చేస్తున్న పాత్రలన్నీ టైంపాస్‌మాత్రమేనని అన్నారు. ప్రస్తుతం 11చిత్రాల్లో నటిస్తున్నా అది నామామాత్రంగా అన్నారు. వైకుంఠద్వారంలో ఏడుకొండలస్వామిని దర్శించుకోవడం ఆనందంగా ఉందని సుమన్ తెలిపారు. శుక్రవారం ఉదయం సినీదర్శకులు గోపీచంద్, బాబి,కోన వెంకట్, మ్యూజిక్ దర్శకుడు థమన్, గాయకుడు చిన్నికృష్ణ శ్రీవారిని దర్శించుకున్నారు.

## రాష్ట్రంలో గణనీయంగా పెరిగిన జిఎస్టీ వసూళ్లు

### - జిఎస్టీ వృద్ధిలో ఆంధ్రప్రదేశ్ రెండో స్థానం

**విజయవాడ,జనవరి2,ప్రభాతవార్తప్రతినిధి:** జీఎస్టీ వసూళ్లు గణనీయంగా పెరుగుతున్నాయి. గత ఏడాది డిసెంబరు(2025) నెలలో ఆంధ్రప్రదేశ్ అత్యధిక నికర వసూళ్లను సాధించింది. జీఎస్టీ విధానం ప్రారంభమైన తర్వాత గత నెలలో రూ.2,652 కోట్ల వసూళ్లతో రికార్డు సృష్టించింది. అంతే కాదు గత ఏడాది ఏప్రిల్ నుంచి డిసెంబరు వరకు ప్రతి నెలా అంతకుముందు ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే అధిక వసూళ్లు సాధించింది. రాష్ట్రంలో ఆర్థిక కార్యకలాపాలు, వస్తు వినియోగం పెరిగిందనేందుకు ఇది సంకేతమని రాష్ట్ర వాణిజ్య పన్నులశాఖ ప్రధాన కమిషనర్ ఎ.బాబు పేర్కొన్నారు. దక్షిణాది రాష్ట్రాల్లో జీఎస్టీ వృద్ధిలో ఆంధ్రప్రదేశ్ రెండో స్థానంలో నిలిచింది. తమిళనాడు 7.85 వృద్ధితో తొలిస్థానంలో ఉంది. కర్ణాటక (5.12 ), కేరళ (3.69 ), తెలంగాణ (2.45 )లను దాటి ఆంధ్రప్రదేశ్ వృద్ధి సాధించడం విశేషం. ఆటోమొబైల్, సిమెంట్, ఎలక్ట్రానిక్స్ రంగాల్లో 23.69 వృద్ధి కనిపించింది. గత ఏడాది డిసెంబరులో ఎస్‌జీఎస్టీ వసూళ్లు రూ.1,102 కోట్లకు చేరుకున్నాయి. 2024 డిసెంబరుతో పోలిస్తే 2.46 వృద్ధి నమోదైంది. ఐజీఎస్టీ సర్దుబాట్లు కూడా రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని మెరుగుపరిచాయి. ఐజీఎస్టీ సర్దుబాట్ల రూపేణా రాష్ట్రం రూ.1,549 కోట్ల ఆదాయం రాబట్టింది. 2024 డిసెంబరు నెలతో పోలిస్తే ఇందులో 8.29 వృద్ధి ఉంది. పెట్రోలియం ఉత్పత్తుల ద్వారా రూ.1,448 కోట్ల ఆదాయం వచ్చింది. అంతకుముందు ఏడాది డిసెంబరుతో నెలతో పోలిస్తే 3.89 వృద్ధి ఉంది. వృత్తి పన్ను వసూళ్లలోనూ 2025 డిసెంబరు చక్కని ఫలితాలు కనబరిచింది. అంతకుముందు ఏడాది డిసెంబరుతో పోలిస్తే 38.32 వృద్ధి నమోదైంది. జీఎస్టీ నికర, స్థూల వసూళ్లలో తొలి త్రైమాసికంలో తగ్గుదల కనిపించగా ఆ పరిస్థితులను తారుమారు చేసి వృద్ధిలోకి తీసుకురావడానికి ప్రభుత్వం తీసుకున్న చర్యలు కారణమయ్యాయని అధికారులు పేర్కొంటున్నారు. దిగుమతులను మినహాయించి పరిశీలిస్తే దేశంలో సగటున 5.61 వృద్ధి రేటు నమోదు కాగా ఆంధ్రప్రదేశ్‌లో అదికంగా 5.78 ఉన్నాయి. జాతీయ వృద్ధి రేటును దాటి రాష్ట్రంలో జీఎస్టీ నికర వసూళ్లు ఉన్నాయి. గత ఏడాది డిసెంబరు నెలాఖరు వరకు 9 నెలల కాలంలో మొత్తం రూ.39,517 కోట్ల జీఎస్టీ వసూళ్లు రాష్ట్రంలో సాధ్యమయ్యాయి. అందులో కేంద్రానికి, ఇతరత్రా వెళ్లే వాటిని మినహాయిస్తే రూ.25,926 కోట్ల నికర జీఎస్టీ ఖజానాకు చేరింది.

## 15 భారీ వృక్షాలను తిరిగి నాటే ప్రయత్నం

### వందల సంవత్సరాల నుండి ఉన్న చెట్లను పరిరక్షిస్తూ మిషన్ పునర్వ వనం కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ విజయకృష్ణన్, ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్..



**ఎలమంచిలి, జనవరి 02, ప్రభాతవార్త:** నియోజకవర్గంలో రోడ్డు విస్తరణలో తొలగిస్తున్న వందల సంవత్సరాల వయసు కలిగిన చెట్లకు పునర్ జీవం కలిగించే మిషన్ పునర్వ వనం కార్యక్రమాలను భావితరాలకు తెలియజేయవలసిన అవసరం ఉందని జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ తెలిపారు. అచ్యుతాపురం నుండి అనకాపల్లి రోడ్డు విస్తరణలో తొలగిస్తున్న పురాతన చెట్లను వేరొక చోటకి తరలించి సంరక్షించే మిషన్ పునర్వ వనం కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తూ రోడ్డు విస్తరణలో తొలగించాలని ఆలోచన వచ్చినప్పుడు చెట్లకు జీవం పోయాలని ఆలోచనతోనే రూపొందించిన మిషన్ పునర్వ వనం మంచి ఆలోచన అని కొనియాడారు. ఈ కార్యక్రమానికి రూపకల్పన, ఆలోచన చేసిన శాసనసభ్యులు సుందర విజయకుమార్ను ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ ప్రాజెక్టు రాష్ట్రానికి ఆదర్శంగా నిలుస్తుంది అన్నారు. వందల సంవత్సరాల వయసు కలిగి, ప్రజలతో ఎంతో అనుబంధం కలిగిన చెట్లను కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమం గూర్చి విద్యార్థులకు తెలియజేయవలసిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా విజయ్ కుమార్ మాట్లాడుతూ మానవ మనుగడకు సరైన జీవన విధానానికి ముఖ్యమైనవి గాలి నీరు ఆహారం చెబుతున్నామని కోటమే ప్రభుత్వంలో అభివృద్ధితో పాటుగా పకృతిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడాన్ని మనం చూస్తూనే ఉంటున్నామన్నారు. జిల్లా కలెక్టర్ సహాయ సహకారాలతో ఇప్పటికే ఎమ్మెల్యేగా తన అధికారం చేపట్టినప్పుడు నుండి 30000 పైచిలుకు మొక్కలు నాటామన్నారు.

## ఎస్‌పిడిసిఎల్‌లో 46 మందికి పదోన్నతులు

### - చీఫ్ ఇంజనీర్లుగా కృష్ణారెడ్డి, సంపత్ కుమార్



**తిరుపతి, జనవరి 2 ప్రభాతవార్త:** ఎస్‌పిడిసిఎల్‌లో 46 మంది ఉద్యోగులకు పదోన్నతి కల్పిస్తూ సంస్థ సిఎండి శివశంకర్ లోతేటి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎస్పీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో సూపరింటెండింగ్ ఇంజనీరుగా విధులు నిర్వహిస్తున్న ఎం. కృష్ణారెడ్డికి చీఫ్ జనరల్ మేనేజర్ (ఆపరేషన్స్) గానూ, శ్రీసత్యసాయి సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజనీర్ గా విధులు నిర్వహిస్తున్న కే. సంపత్ కుమార్ కు చీఫ్ జనరల్ మేనేజర్ (క్వాలిటీ కంట్రోల్ !! ప్లానింగ్) గానూ పదోన్నతి కల్పించారు. అదేవిధంగా తిరుపతి సర్కిల్ ఎంఆర్ టి విభాగపు ఎగ్జిక్యూటివ్ ఇంజనీరుగా విధులు నిర్వహిస్తున్న పి. రవికుమార్ కు సూపరింటెండింగ్ ఇంజనీర్ (ఎంక్వైరీ !! అసెస్మెంట్) గా పదోన్నతి కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే నెల్లూరు సర్కిల్లో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ గా విధులు నిర్వహిస్తున్న కె. వెంకట పవన్ కుమార్ కు తిరుపతి ఎంఆర్ టి విభాగపు ఎగ్జిక్యూటివ్ ఇంజనీరుగా పదోన్నతి కల్పించారు. వీరితోపాటు అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లుగా విధులు నిర్వహిస్తున్న సి. హరి ప్రసాద్, సి. విజయ వెంకటేష్ లకు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు గానూ, జూనియర్ ఇంజనీర్ స్థాయి నుంచి అసిస్టెంట్ ఇంజనీర్లుగా 28 మందికి, గ్రాడ్యుయేట్ జూనియర్ ఇంజనీర్ నుంచి అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లుగా 6 మందికి, జూనియర్ పర్సనల్ ఆఫీసర్ నుంచి పర్సనల్ ఆఫీసర్లుగా నలుగురికి, జూనియర్ అసిస్టెంట్ నుంచి సీనియర్ అసిస్టెంట్లుగా ఇద్దరికి పదోన్నతి కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.


## పాయకరావుపేట మాజీ ఎమ్మెల్యే గంటెల సుమన కన్నుమూత



**విశాఖపట్నం, జనవరి 2 ప్రభాతవార్త:** పాయకరావుపేట మాజీ ఎమ్మెల్యే, తెలుగుదేశం పార్టీ నేత గంటెల సుమన (68) కన్నుమూశారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె, విశాఖపట్నంలోని కేర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం తుదిశ్వాస విడిచారు. ఆమె మృతితో పాయకరావుపేట నియోజకవర్గంలో విషాదఛాయలు అలుముకున్నాయి. విశాఖ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి1983లో టీడీపీ తరఫున తొలిసారి ఎమ్మెల్యేగా విజయం ఆమె మృతి పట్ల పలువురు నేతలు, కార్యకర్తలు సంతాపం గంటెల సుమన 1983లో తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం తర్వాత జరిగిన ఎన్నికల్లో పాయకరావుపేట (ఎస్సీ రిజర్వ్‌డ్) నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. తన పదవీకాలంలో 1984లో నక్కపల్లిలో బాలికల కోసం గురుకుల పాఠశాల ఏర్పాటు చేయడంలో కీలకపాత్ర పోషించారు. సుమన అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించేవారు. ఆ తర్వాత కాంగ్రెస్ పార్టీలో చేరి అదే స్థానం నుంచి రెండుసార్లు పోటీ చేసి ఓటమి చెందారు. అనంతరం రాజకీయాలకు దూరంగా ఉన్న ఆమె, ప్రస్తుతం టిడిపిలోనే కొనసాగుతున్నారు. సుమన మరణ వార్త తెలియగానే పలువురు రాజకీయ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రజల సందర్శనార్థం ఆమె భౌతికకాయాన్ని విశాఖ అక్కయ్యపాలెంలోని ప్రియదర్శిని వృద్ధాశ్రమంలో ఉంచారు. ఆమె స్వగ్రామంలో శనివారం అంత్యక్రియలు నిర్వహించేందుకు కుటుంబ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు.

## పరకామణికేసు కోర్టు పరిధిలో ఉన్నందున పూర్తి సమాచారం చెప్పలేం

### ఏసీబీ డీజీ అతుల్ సింగ్



**విజయవాడ, [illegible]:** తిరుమల పరకామణికేసు కోర్టు పరిధిలో ఉన్నందున పూర్తి సమాచారం చెప్పలేమని ఏసీబీ డీజీ అతుల్ సింగ్ స్పష్టం చేసారు. ఈ కేసుపై ఆయన పలు కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ తెలిపారు. కానీ.. కోర్టు డైరెక్షన్ ప్రకారమే కేసు విచారణ కొనసాగుతోందని స్పష్టం చేశారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. కేసు బుక్ చేసిన తర్వాత విచారణ మొత్తం పూర్తి చేయడానికి 15 రోజులు పడుతుందని.. సిబ్బంది తక్కువగా ఉన్నందున అన్ని కేసులను దర్యాప్తు చేయడం సాధ్యం కావడం లేదని తెలిపారు. చిన్న ఎమోంట్ ఉన్న కేసులు ఉంటే.. ఆయా శాఖలకే చర్యలు తీసుకోవాలని రాస్తున్నామ్నారు. పెద్ద మొత్తం డిమాండ్ చేసే వారిపైనే తాము ఇప్పుడు దృష్టి పెట్టామని చెప్పారు. గత నాలుగైదు నెలలుగా ఈ విధానాన్ని అమలు చేస్తున్నామని తెలిపారు. ఇండియాలో క్రికెట్‌కు బాగా క్రేజ్ ఉందని.. టెండూల్కర్, విరాట్ వంటి వారు త్వరగా అవుట్ అయితే జోక్స్ చేస్తామని.. అదే విధంగా అవినీతి నిర్మూలనపై కూడా ఎవరిష్టం వచ్చినట్లు వారు అటువైపు నుంచి మాట్లాడతారని చెప్పారు. ఇటువైపు కూడా వచ్చి చూస్తే కన్విన్షన్ వరకు కేసు విచారణ ఎలా ఉంటుందో అందరికీ తెలుస్తుందని తెలిపారు. వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా ఏసీబీకి ఏ విధంగా ఫిర్యాదు చేయాలనే దానిపై ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు. గ్రామ, వార్డు సచివాలయాలకు వెళ్లే ప్రజల నుంచి చిన్న మొత్తంలో లంచాలు తీసుకుంటున్నట్లు తమ దృష్టికి వచ్చిందని అన్నారు. ప్రజలు దీనిపై తమకు ఫిర్యాదులు చేస్తే.. ప్రణాళిక ప్రకారం చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందని ఏసీబీ డీజీ తెలిపారు. ఏసీబీ దృష్టికి వచ్చే ఫిర్యాదుల్లో తమ ప్రధాన కార్యాలయంలో చర్చించి.. ఆ తర్వాత ప్రాధాన్యతను బట్టి దాడులు చేస్తామని వివరించారు. ఏసీబీ టీం నుంచి సమాచారం ముందుగా లీక్ అవుతుందనేది వాస్తవం కాదన్నారు. ఏసీబీ కార్యాలయంలో ఎప్పుడూ ఇంటర్నల్ విజిలెన్స్ ఉంటుందని చెప్పారు. తాము అన్నీ ముందుగానే చర్చించలేమని.. దర్యాప్తులో అనేక అంశాలను తీసుకుని ముందుకు సాగుతామని ఏసీబీ డీజీ అతుల్ సింగ్ పేర్కొన్నారు.

## వల్లభనేని వంశీకి హైకోర్టులో తాత్కాలిక ఊరట

**విజయవాడ,జనవరి 2,ప్రభాతవార్తప్రతినిధి:** వైసీపీ కీలక నేత, గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీకి ఏపీ హైకోర్టులో తాత్కాలిక ఊరట లభించింది. బెజవాడ మాచవరం పోలీసులు నమోదు చేసిన హత్యాయత్నం కేసులో తనను అరెస్టు చేయకుండా ముందస్తు బెయిల్ ఇవ్వాలని వంశీ దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టు విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా వంశీని అరెస్టు చేయవద్దంటూ కోర్టు మధ్యంతర ఆదేశాలు జారీ చేసింది. తదుపరి విచారణను వెకేషన్ బెంచ్‌కు వాయిదా వేస్తూ నిర్ణయం తీసుకుంది. నూతక్కి సునీల్ అనే వ్యక్తి ఈ నెల 17న మాచవరం పోలీస్ స్టేషన్‌లో వంశీపై ఫిర్యాదు చేశాడు. వల్లభనేని వంశీ అనుచరులు తనపై దాడికి పాల్పడ్డారని, తనను హత్య చేయడానికి ప్రయత్నించారని ఆరోపించాడు. ఈ ఫిర్యాదు ఆధారంగా పోలీసులు వంశీతో పాటు మరో ఎనిమిది మందిపై హత్యాయత్నం సహా పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. కేసు నమోదైన విషయం బయటకు రావడంతో వంశీ ఒక్కసారిగా అందుబాటులో లేకుండా పోయారు. ఆయన అజ్ఞాతంలోకి వెళ్లినట్టు పోలీసు వర్గాలు తెలిపాయి. వంశీతో పాటు ఈ కేసులో నిందితులుగా ఉన్న ఇతరులు కూడా కనిపించకపోవడంతో, వారిని పట్టుకునేందుకు పోలీసులు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. కొన్ని బృందాలు హైదరాబాద్ కేంద్రంగా గాలింపు చర్యలు చేపట్టినట్టు సమాచారం. ఈ నేపథ్యంలో వంశీ హైకోర్టును ఆశ్రయించి ముందస్తు బెయిల్ కోసం పిటిషన్ దాఖలు చేశారు. తనపై పెట్టిన కేసు రాజకీయ ప్రేరణతో కూడినదని, తప్పుడు ఆరోపణల ఆధారంగా కేసు నమోదు చేశారని వంశీ తన వాదనలో పేర్కొన్నారు. ఇరు పక్షాల వాదనలు విన్న హైకోర్టు, ప్రస్తుతం వంశీని అరెస్టు చేయవద్దంటూ పోలీసులకు ఆదేశాలు జారీ చేసింది.

## టోల్‌ప్లాజాలో వసూళ్లను నిలిపివేయండి

### - కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి టిడిపి ఎంపి సనా సతీష్ వినతి

**విజయవాడ,జనవరి 2,ప్రభాతవార్తప్రతినిధి:** సంక్రాంతి సందర్భంగా టోల్‌ప్లాజాలో టోల్ వసూళ్లను నిలిపివేయాలంటూ కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని టీడీపీ ఎంపీ సనా సతీష్ కోరారు. సంక్రాంతికి హైదరాబాద్, ఇతర ప్రాంతాల నుంచి లక్షలాది మంది ఏపీలోని సొంత గ్రామాలకు వస్తారని.. ఫలితంగా హైదరాబాద్‌విజయవాడ రహదారిపై విపరీతమైన రద్దీ ఉంటుందన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని టోల్ వసూళ్లు నిలిపివేయాలని కేంద్రాన్ని కోరారు. సంక్రాంతి పండుగ కారణంగా హైదరాబాద్‌లో ఉంటున్న ఏపీ వాసులు పెద్ద ఎత్తున తమ తమ స్వస్థలాలకు వెళ్తుంటారని.. ఫలితంగా హైదరాబాద్‌విజయవాడ రహదారిపై తీవ్రమైన ట్రాఫిక్ రద్దీ ఏర్పడుతుందన్నారు ఎంపీ సనా సతీష్. ఈ మేరకు ఎక్స్‌లో పోస్ట్ చేశారు. పంతంగి, కొర్లపహడ్, చిల్లకల్లు, కీసర టోల్ ప్లాజాల వద్ద విపరీతమైన రద్దీ ఏర్పడి గంటల తరబడి ట్రాఫిక్ స్తంభించిపోతుందన్నారు. ఈ కారణంగా తెలుగు ప్రజలకు సమయం ఆదా అవ్వడం, ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు టోల్‌ప్లాజాల వద్ద టోల్ వసూళ్లను మాఫీ చేయాలని కేంద్ర మంత్రికి విజ్ఞప్తి చేశారు ఎంపీ సనా సతీష్.

దీని వలన ప్రయాణం సాఫీగా జరిగి ఇళ్లకు క్షేమంగా చేరుకుంటారని అన్నారు. సంక్రాంతి పండుగను అందరూ సాంప్రదాయ బద్దంగా జరుపుకునేందుకు అవకాశం కలుగుతుందని.. తమ విజ్ఞప్తిని పరిశీలించాలంటూ కేంద్ర మంత్రిని కోరారు .

## రాష్ట్రంలో దట్టంగా అలుముకుంటున్న పొగమంచు

### పెరుగుతున్న చలి తీవ్రత

**విజయవాడ,జనవరి 2,ప్రభాత వార్తప్రతినిధి:** రాష్ట్రవ్యాప్తంగా చలి తీవ్రత పెరుగుతోంది. ప్రజలు ఇళ్ల నుంచి బయటికి రావాలంటే వణికిపోతున్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాలనే వ్యత్యాసం లేకుండా కనిష్ఠ ఉష్ణోగ్రతలు గణనీయంగా తగ్గిపోతున్నాయి. ఇక ఏజెన్సీ ప్రాంతాల్లోనైతే ఉష్ణోగ్రతలు మరీ దారుణంగా పడిపోతున్నాయి. రాష్ట్ర ప్రజలను చలి గజగజలాడిస్తోంది.

పొగ మంచు కమ్మేసి వాతావరణమంతా శ్వేతమయంగా మారింది. పొగ మంచు దట్టంగా ఆవరించటంతో ఎదురుగా వచ్చే వాహనానికి హెడ్ లైట్లు ఏమాత్రం కనిపించడం లేదు. దగ్గరగా వచ్చే వరకు ద్విచక్ర వాహనాలు కనపడకపోవటంతో భారీ వాహన చోదకులు ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రకాశం జిల్లా అద్దంకి పట్టణంలో ఉదయం 7 గంటల సమయంలోనూ మంచుపొరలు తొలగలేదు. అద్దంకి పట్టణం, గుండా నామ్ రహదారిపై విపరీతమైన పొగ మంచు ఉండటంతో వాహనదారుల అవస్థలు అన్నీ ఇన్నీ కాదు. ఈ రహదారిపై నిత్యం భారీ వాహనాల రాకపోకలు సాగిస్తుంటాయి. పొగ మంచు దట్టంగా ఆవరించటంతో ఎదురుగా వచ్చే వాహనానికి హెడ్ లైట్లు ఏమాత్రం కనిపించడం లేదు. దగ్గరగా వచ్చే వరకు ద్విచక్ర వాహనాలు కనపడకపోవటంతో భారీ వాహన చోదకులు ఇబ్బందులకు గురవుతున్నారు. శీతల పదార్థాలకు దూరంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. వేడిగా ఉండే ఆహారాన్ని మాత్రమే తీసుకోవాలి. గోరు వెచ్చటి నీరు తాగితే మంచిది. మంచులో ఉదయం, రాత్రులు తిరగటం తగ్గించాలి. అవసరమైనపుడు ఉన్ని దుస్తులు, స్వెట్టర్లు, మాస్కులు ధరించాలి. చలికాలంలో తక్కువ మోతాదులో నీరు తీసుకోవడం మంచిది కాదు. దీని వల్ల పలు అనార్యోగ సమస్యలు వస్తాయి. ఎక్కువ నీరు తీసుకోవడం వల్ల లోపల పేరుకుపోయిన కఫం బయటకు వస్తుంది. న్యూమోనియా రాకుండా ఉండేందుకు చిన్నారులు, పెద్దలు టీకాలు వేయించుకోవాలి. శ్వాస సమస్యలు ఉన్నవారు ఉదయం సమయంలో చల్లటి గాలికి వాకింగ్ చేయడం కొద్ది రోజులు తగ్గించాలి అని వైద్యులు చెబుతున్నారు. రాష్ట్రంలో చలి బాగా పెరిగింది. ఈ పరిస్థితుల్లో చిన్నారులు, వృద్ధులు మరింత అప్రమత్తంగా ఉండాలి. న్యూమోనియా వచ్చే ప్రమాదం ఉంది. దీనివల్ల జలుబు, దగ్గు, జ్వరం, శ్వాస తీసుకోవటంలో ఇబ్బందులు ఎదురవుతాయి. శీతాకాలంలో జాగ్రత్తలు పాటించకుంటే రక్తనాళాలు గడ్డ కట్టే ప్రమాదం పొంచి ఉంది. తద్వారా గుండె, బ్రెయిన్ స్ట్రోక్‌లు వంటివి వచ్చే అవకాశం ఉంది. అనారోగ్యానికి గురైతే వెంటనే ఆసుపత్రిలో వెళ్లాలి. సరైన చికిత్స చేయించుకోవాలి. ఎల్లప్పుడూ పోషకాహారాన్నే తీసుకోవాలని, ఈ సీజన్లో లభించే పండ్లు తినాలని వైద్యులు సూచిస్తున్నారు. మంచు ఎక్కువగా కురుస్తుండడంతో వాహనదారుల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. రహదారులను మంచు దుప్పటి కప్పేసింది. ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చలి తీవ్రత అధికంగా ఉండడం వల్ల వృద్ధులు, చిన్నారులు, దీర్ఘకాల వ్యాధిగ్రస్థులు ఇబ్బందులు పడుతున్నారు. కొందరూ చలి మంటలు వేసుకుని ఉపశమనం పొందుతున్నారు. దట్టమైన పొగ మంచు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

**BEFORE THE DEBTS RECOVERY TRIBUNAL - II: HYDERABAD**

I.A. No.3259 of 2025
in
O.A. No. 25 of 2020

Between :
State Bank of India,
SAM Branch, Secundrabad Division,
Gunfoundry, Hyderabad - 500001
rep. by It's Assistant General Manager
....Petr/ Applt
Vs.
M/s. Sri Kalyana Chakaravarthi Rice Mills & others .....Respts/ Defts

Notice by Paper Publication for showing cause as to why the Relief prayed for should not be granted

To R-4) Mr. Kadiyapu Murali Gopal
S/o. K. Venkateswar Rao,
H. No. 2-250, Main Road, Ravulapalem,
East Godavari Dist, AP-533238.
R-7) Mrs. Kadiyapu Mrudula
W/o. Mr. K. Murali Gopal
H. No. 2-250, Main Road, Ravulapalem,
East Godavari Dist, AP-533238.

Take notice that the Petitioner/applicant has filed I.A. No.3259of 2025 in O.A.No.25 of 2020 in the Debts Recovery Tribunal-II, 1st Floor, Palace Heights Hotel Building, Abids, Hyderabad - 500001, seeking for Amendment of Schedule Portion in the O.A., so also for Amendment of Schedule Portion in the RC. The notices sent have been returned un-served with Endorsement left. Now the Hon'ble Tribunal doth order you both to appear before it on 10-02-2026 and show cause as to why the relief prayed should not be granted.
Take notice that in case of default the application will be heard and determined in your absence.

"BY ORDER"
V. RAGHU, Advocate
Office No.208 & 209, 2nd Floor,
'A' Block, M.No.5-9-1114,
Suryalok Complex, Gunfoundry,
Hyderabad-500001

**VIJAYAWADA MUNICIPAL CORPORATION**
**'E' Procurement Notice No.41/VMC/CDB/2025-26, Dt.02-01-2026**

Roads, Drain, Culvert, Water supply, repairs, maintenance works & Disposal of the Red Cloths(Box Tender) (Total 63 works)-Est. Amount Rs.1580.53 Lakhs.

All rights are reserved to the Commissioner to Cancel or Reject the tenders without assigning any reasons there of

Further details and any corrigendum can be seen@www.tender.apeprocurement.gov.in.

S/d-
For COMMISSIONER

వార్త

జీవితంలో విజయం సాధించడానికి మనిషికి తెలివి తేటలు ఉండీ అవకాశాలు వచ్చినంత మాత్రాన చాలదు. ఏకాగ్రత, లక్ష్యశుద్ధి అవసరం.

-సి.డబ్ల్యు. వెండైట్

# 'సజీవహత్యలు' భావ్యమేనా?


ఇక ముందు రాబోయే రోజుల్లో మానవ సంబంధాలు ఎలా ఉంటాయో చెప్పలేని పరిస్థితుల్లో కన్నవారి, ప్రేమాభిమానాల నేపథ్యంలో కలిగిన ఆందోళనలు ఎంతటి కాఠిన్యానికి దారి తీస్తాయో తాజా సంఘటనలు గుర్తుచేస్తున్నాయి. కడుపు తీపి చంపుకొని కన్న బిడ్డలను కాటికెలా పంపిస్తాయో జరిగిన, జరుగుతున్న సంఘటనలు వింటేనే, తెలుసుకుంటేనే మనసును కలచివేస్తాయి. తన పిల్లల ఆలనా పాలనా చూసేవారు లేక ఎవరి సాయం అందక ఒక తండ్రి తన ముగ్గురు బిడ్డలనూ పాలల్లో విషమిచ్చి చంపేశాడు. తనూ ఆత్మహత్య చేసుకున్నాడు. మరో తల్లి తన భర్త లేని జీవితాన్ని ఊహించుకోలేక తన ఇద్దరుపిల్లలనూ చంపి ఆత్మహత్య చేసుకొంది. ఈ రెండు సంఘటనలు తెలుగు రాష్ట్రాల్లో ఎంతో మంది హృదయాలను కదిలిస్తున్నాయి. ఇక్కడా అక్కడా అనికాదు. తాము చనిపోయాక తమ పిల్లల భవిష్యత్ ఏమిటి? వారినెవరు సాకుతారు?వారి భవిష్యత్‌ను తానుతీర్చిదిద్దగలనా అనే సందేహాలతో ఒక చీటిరాసో, రాయకో తాము ఆత్మహత్యలు చేసుకోవడం గతంలో చూశాము. ఏమీ ఆలోచించకుండానే ఆవేశంతో ఇలాంటి అకృత్య దుష్కృత్యాలకు పాల్పడిన సంఘటనలు లెక్కకు మించి లెక్కల్లోకెక్కాయి. తదుపరి కాలంలో ఆర్థిక సమస్యలతో పరువు మర్యాదలు మంట కలసిపోతాయనే భయంతో తను తనతోపాటు తన బిడ్డలు, జీవిత భాగస్వామితో కలిసి విషాహారంతో చనిపోయిన సందర్భాలూ విన్నాం. తాజాగా మన తర్వాత మన బిడ్డల బతుకేమిటని ఆలోచించే పరిస్థితిలో వారిని కూడా 'హత్య' చేస్తున్నారు. 'ప్రేమతో చంపేస్తున్నారు' అనే మాట చిన్న మాట. మానవ సంబంధాల్లో ఇదొక కొత్త పరిణామంలా భావించాలి. భర్త మృతితో తీవ్ర ఆవేదనలో ఉన్న మహిళ ఇద్దరు పిల్లలనూ చంపి తాను ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించింది. పురుగులమందు కలిపిన అన్నాని పిల్లలకు తినిపించి తానూ తింది. నాగర్‌కర్నూలు జిల్లా కల్వకుర్తిలో నూతన సంవత్సరం రోజున ఆ ఇల్లాలికిలాంటి దుర్బుద్ధి పుట్టింది. తానూ చనిపోవాలన్నదే నిర్ణయం కనుక ఆమె మనసు లోతుల్లోకి తొంగి చూడాలి. సాధారణంగా భర్త చనిపోయినా భార్య ఆ బాధను భరిస్తూనే భర్త జ్ఞాపకాలతో ఆలోచనలతో పిల్లల భవిష్యత్తే బంగారం కావాలని ఎలాగోలా బతికేస్తుంది. అదే భార్య చనిపోయిన ఏ మగాడైనా ఆమెతో గడిపిన మధుర క్షణాలను తలపుకొస్తే గుండెనిబ్బరాన్ని కోల్పోతాడు. మానసికంగా తోడు పోయిందని బలహీనుడౌతాడు. చెప్పాలంటే పిల్లల భవిష్యత్ చక్కగా తీర్చిదిద్దలేనేమో అనేటంత బీరువవుతాడు. కానీ మానసిక దుర్బలత్వం ఎవరికైనా ఒకటే అనుకున్నా సృష్టిలో ఇద్దరి మధ్యా ఈ తేడా ఉంది. కానీ ఇక్కడలా కాదు ఆమె తట్టుకోలేకపోయింది. వనపర్తి జిల్లా శ్రీరంగాపురానికి వాసి భీంశెట్టి ప్రకాశ్‌కు ప్రసన్న దంపతులకు కూతురు, కొడుకు. వారి ఆలనాపాలనా చదువులను చక్కగా చూసుకునేవారు. ఆర్థిక స్తోమత అంతమాత్రంగా ఉండే ఇంట్లో ప్రకాశ్ మరణించేసరికి ఇతరుల మీద బతకాల్సి వస్తుందన్న అభిమానంతో తాను ఆత్మహత్య చేసుకుంటే పిల్లలు అనాధలౌతారని బతికినా వారిని సాకగల ఆర్థిక శక్తిలేదని తలచింది. రోజులు మారాయి. కొన్నిసందర్భాల్లో భార్యలు కూడాభర్తలపై విసిగెత్తి, అకృత్యాలకు పాల్పడుతున్నారు. భర్తలని పరిమార్చాలని పన్నాగాలు పన్నుతున్నారు. వెనుకఎవరున్నా ఎవరి ప్రోద్బలమున్నా జరుగరాని ఘోరాలు జరిగిపోతున్నాయి. ఇటువంటి రోజుల్లో కూడా భర్త చనిపోయాడని, ఇక బతుకు బాటలో కష్టాలు భరించలేమని వగచి కుటుంబానికి మరణశాసనం రాసింది. తానూ ఈ భూమ్మీదనుంచి నిష్క్రమించింది. మరో సంఘటనలోనంద్యాల జిల్లా ఉయ్యాలవాడ మండలం తడుమలదిన్నె గ్రామవాసి వేములపాటి నరేంద్ర ముందు సంఘటనకు భిన్నంగా ప్రవర్తించాడు. భార్య మృతితో ముగ్గురు పిల్లలను పెంచలేక దుర్దశను భవించాడు. బంధువుల ఆదరణ లభించలేదని బెంబేలు పడ్డాడు. తన దారి తాను చూసుకోలేక పిల్లలు ముగ్గురికి పాలల్లో విషమిచ్చి తను ఉరిపోసుకుని తనువు చాలించాడు. ఉదంతాలు ఏవైనా, సంఘటనలెలా ఉన్నా జీవిత భాగస్వామి మాటతో తాము బతుకలేమని భావించడం మానసిక బలహీనత. ఇలాంటి వారి వారి సొంత మానసిక దౌర్బల్యానికి ఎవరూ కారణం కాదు. కానీ బిడ్డల జన్మకు కారకులయ్యే హక్కేకానీ మన ఆలోచనలకు వారిని బలిచేసే హక్కు ఏతండ్రికైనా, ఏ తల్లికైనా లేదు. ఓ శుభముహూర్తాన దంపతులై నూరేళ్ల జీవించాల్సిన జీవితాలు అర్థ మధ్యంతరంగా అంతమైపోవడం సమాజం క్షమించదు. ఇవన్నీ ఆ తండ్రి తీర్పో, ఆ తల్లి మానసిక ప్రవర్తనలో కలిగినమార్పో అని సరిపెట్టుకోవాలా? వారి అనాలోచిత నిర్ణయాలకు పిల్లలు బలయ్యే పరిస్థితి ఎవరికీ రానీయద్దు. తిన తిండి లేని బిచ్చగాళ్లు కూడా తమ బిడ్డలని భిక్షాటన చేసి మరీ పెంచి సమాజంలో ఉద్దండులుగా తీర్చిదిద్దిన వాళ్ల జీవితాలు ఇలాంటి వారికి ఆదర్శం కాకూడదా? పాచిపనులు చేసి జీవితం వెళ్లబుచ్చుతున్న మహిళల జీవితాలు మరొకరికి మార్గదర్శకాలు కావా! ఇలాంటి వాటిపై సమాజంలో ఉన్న వారందరికీ మార్గదర్శనం కావాలి. ఇతరులు సహకరించడం లేదనో, అసహ్యించు కుంటున్నారనో, లేనిపోని అపోహ లకు పోకమానవత్వంతో ప్రవర్తించే ఆలోచన భరోసా ఈనాటి తల్లిదండ్రులకురావాలి. అందుకోసం ప్రభుత్వానికీ బాధ్యత ఉంది. ప్రజలకు మంచి జీవన విధానం అలవాట్లు నేర్పడమేకాదు. వారిలో మనో వైకల్యాన్ని పోగొట్టి దుష్ప్రభావాలపై అవగాహన కల్పించే పాఠాలు చెప్పించడమూ చేయాలి. అప్పుడో మానసిక దౌర్బల్యపు కాఠిన్యాలు దరిచేరవు.

నిముషాన్ని సంపూర్ణత్వంతో నింపడమే సంతోషం. పశ్చాత్తాపానికి, ఆజులకూ అతీతమైనదే అసలైన సంతోషం.



ఎమర్సన్

కొంత మంది గొప్పవారుగా పుడతారు. కొంతమంది గొప్పతనాన్ని సాధిస్తారు.



షేక్స్పియర్

# ప్రజావాక్కు



### నైతిక బాధ్యత

ప్రజాస్వామ్య సమాజంలోప్రజాదరణ ఒకవరమే కాకుండా గొప్ప సామాజిక బాధ్యత కూడా. ముఖ్యంగా సినిమా రంగంలోని అగ్రనటులకు ప్రజలను ప్రభావితం చేసే అపార శక్తి ఉంటుంది. వారి ఒక హాజరు కోసం వేలాది మంది ప్రాణాలకుతెగించి తరలివస్తారు. అయితే సరైన ప్రణాళిక, క్రమశిక్షణ, నియంత్రణ లేకపోతే ఈప్రజాదరణ వినోదాన్ని విషాదంగా మారుస్తుంది. హైదరాబాద్‌లోని సంధ్యా థియేటర్‌వద్ద పుష్ప-2ప్రీమియర్ సందర్భంగా జరిగిన తొక్కిసలాటదీనికి తాజానిదర్శనం. థియేటర్ యాజమాన్యం నిర్లక్ష్యం, నిర్వాహకుల అంచనాల లోపం, భద్రతా సిబ్బంది అప్రమత్తతం, పోలీసు సమన్వయం లేకపోవడం కలిసి ప్రాణనష్టానికి కారణమయ్యాయి. భారీ సినిమా విడుదల సమయంలోజనసందోహాన్నినియంత్రించేభద్రతా ఏర్పాట్లు తప్పనిసరి అయినప్పటికీ అవి పాటించబడలేదు. వేలాది మందిని ఆకర్షించే వ్యక్తిగా, జనసందోహం అదుపు తప్పే పరిస్థితుల్లో అప్రమత్తం చేయడం ఒక నైతిక బాధ్యత.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### మనిషిలో మార్పు రావాలి

జనవరి1వ తేదీ అనేది కేవలం క్యాలెండర్‌లోని తేదీ మార్పు మాత్రమేకాదు. అదికాలానికి మనిషి ఇచ్చేఒక శుభావందనం. ఆధునిక సమాజంలో ఈ తాత్వికత వక్రీకృతమైపోతోంది. ప్రతి మతంలోనూ దేవుడు, మనిషి మధ్య ఒక మధ్యవర్తి పూజారి, పాస్టర్ లేదా పండితుడు నిలబడి మతాన్ని వ్యాపారంగా మార్చేశాడు. భక్తిని లావాదేవీగా, ఆధ్యాత్మికతను ప్రదర్శనగా మార్చేశాడు. ఫలితంగా మనిషి తనలోని దైవత్వాన్ని మరచిపోయాడు. నిజమైన నూతన సంవత్సరం అంటే పటాకులులేదా ఉత్సవాలుకాదు మెలుకువ. మనిషి అర్థం చేసుకుంటూ, పంచుకుంటూ, ఎదుగుతూ ఉంటే అదే కాలానికి నిజమైన వేడుక.

- వీరగంట భాస్కర్ రావు, బొబ్బిలి

### చర్యలు తీసుకోవాలి

చాలాస్కూళ్లలో విద్యార్థులు లేకపోయినా, తక్కువ సంఖ్యలో ఉన్నా , ఉపాధ్యాయులు మాత్రం అధిక సంఖ్యలో పనిచేస్తున్నారని, కేంద్రవిద్యాశాఖ ఇటీవల పార్లమెంటుకు సమర్పించిన ఓ నివేదికలో పేర్కొంది. వెంటనే ప్రభుత్వం సరిగ్గా సర్దుబాటు చేయాలి. విద్యార్థుల సంఖ్య పెరిగేలా చర్యలు తీసుకోవాలి .

-మా. శ్రీ. రాజు, పాల్వంచ

### వృద్ధికి రహదారి

దేశఆర్థికాభివృద్ధికి మౌలికసదుపాయాలే మూలస్తంభమని మరోసారి ప్రధానమంత్రి నరేంద్రమోడీ వ్యాఖ్యలు స్పష్టం చేస్తున్నాయి. వృద్ధికి దోహదపడే తదుపరి తరం మౌలిక సదుపాయాల నిర్మాణం లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు దేశవ్యాప్తంగా అభివృద్ధికి బాటలువేస్తున్నాయి. ఈ నేపథ్యంలో తెలంగాణ రాష్ట్రానికి ఈ విధానాల ద్వారా కలిగే ప్రయోజనాలను గమనించడం అవసరం. తెలంగాణరాష్ట్రం భౌగోళికంగా దేశమధ్యభాగంలో ఉండటంవల్ల రహదారి, రైల్వే, లాజిస్టిక్స్ రంగాల్లో కీలక స్థానం దక్కించుకునే అవకాశం ఉంది. ఇప్పటికే హైదరాబాద్ఒక అంతర్జాతీయ ఐటీ, ఫార్మాకేంద్రంగా ఎదిగింది. అయితే ఈ వృద్ధి ఫలాలు రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు చేరాలంటే సమర్థవంతమైన రహదారి అనుసంధానం అత్యవసరం. జాతీయ రహదారుల విస్తరణ, కొత్త కారిడార్‌ల నిర్మాణం తెలంగాణలోని వెనుకబడిన ప్రాంతాలను ప్రధాన మార్కెట్లతో కలుపుతాయి. ప్రత్యేకించి ఉత్తర తెలంగాణ జిల్లాలకు ఈ మౌలిక సదుపాయాల అభివృద్ధి ఎంతో దోహదపడుతుంది.

-తిప్పర్తి శ్రీనివాస్, చొప్పదండి

### పాలకుల వైఫల్యం

తెలంగాణ ఉద్యమంలో ఒక ప్రధాన అంశంగా ఉన్న విషయం మనందరికీ తెలుసు. 300 కిలోమీటర్ల మేర కృష్ణానది ఆ జిల్లాలో పారినపాలమూరు కరువు చాలా హృదయ విదారకమైనది. పిల్లలను అమ్ముకునేంత కరవు ఆ జిల్లాలో ఉండేది. అయితే కృష్ణానది మీద వేసిన వివిధ కమిషన్ల అలాగే వాళ్ళు ఇచ్చిన ఆర్డర్లు అమలు చేయడంలో వచ్చిన ఇబ్బందితోనే పాలమూరు వలసల జిల్లాగా మారింది అనడంలో సందేహం లేదు. ముఖ్యమంత్రులు దత్తత తీసుకున్న ఇసుమంత అయిన వారి కరవు పోలేదు సరికదా ఇప్పుడు కృష్ణానది నీళ్ల విషయం ఒక రాజకీయ అస్త్రంగా మారింది.

-భారత అవినాష్, జనగామ

### గురుకులాల్లో ఆర్ట్స్ గ్రూప్స్

రాష్ట్రంలో ఉన్న గురుకులాలలో సైన్సు గ్రూపులతోపాటుగా ఆర్ట్స్ గ్రూపులు కూడా పెట్టాలి. 2026-2027 విద్యా సంవత్సరం నుండి ఆర్ట్స్‌గ్రూపులో ప్రవేశపెట్టడానికి గాను గురుకుల ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ కార్యదర్శులకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయాలి. పోటీ పరీక్షలకు సిద్ధం కావడానికి ఆర్ట్స్ గ్రూపులో అయినా సామాజిక శాస్త్రాలను ప్రవేశపెట్టాలి..

-రాపాక రవీందర్, జనగాం

మనవి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# శుభాకాంక్షలన్నీ శుభప్రదంగా ఉండాలి

**మమ్మీ, డాడీ చదువులు ఉంటే ఉండనివ్వండి కానీ వాటితోపాటు మన సంస్కృతి సంప్రదాయాలు తెలిపే పాఠ్యాంశాలను కూడా ప్రాథమిక స్థాయి నుంచి పిల్లలు తెలుసుకునే విధంగా విద్యావిధానం రూపొందించాలి. అలాగే ఈ క్లబ్‌లు, పబ్‌లు, సైబర్ కేఫ్‌లలో నీలిచిత్రాలు, అంగాంగ ప్రదర్శనలపై ఉక్కుపాదం మోపాలి. శుభాకాంక్షలన్నీ శుభప్రదంగా ఉండాలి. ఈ విషయంలో ప్రభుత్వంతోపాటు ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు, మేధావులు కల్పించుకోవాలి. మన సంస్కృతి సంప్రదాయాలను రక్షించేందుకు సంసిద్ధులు కావాలి. ప్రజల భాగస్వామ్యమే మన సంస్కృతి పరిరక్షణకు ఏకైక మార్గం.**

దామెర్ల సాయిబాబ

చదువు సంధ్యలు పెరిగే కొద్దీ మనుషుల ప్రవర్తనలో మార్పులు రావాలి. ఏది మంచో, ఏది చెడో గ్రహించాలి. విచక్షణ పెంపొందాలి. సాంకేతికంగా ఎంతో అభివృద్ధి చెందాం. అత్యంత ప్రతిభావంతులైన యువతీ యువకులు ఆహర్నిశలు కష్టపడి దేశ విదేశాల్లో గుర్తింపు తెస్తున్నారు. మరోవైపు దైవం పట్ల భక్తి శ్రద్ధలు పెరుగుతున్నాయి. దేవాలయాలు కిటకిట లాడి పోతున్నాయి. ఇంకో వైపు కొందరు పాశ్చాత్య మోజులో పడి మన సంస్కృతి, సంప్రదాయాలకు మంగళం పాడుతున్నారేమో ననిపిస్తున్నది. రానురాను భారతీయ సంస్కృతి అదృశ్యమైపోతుందేమోననే కలవరం కలుగకతప్పదు. మొన్న బుధవారం రాత్రి నూతన సంవత్సర ఆరంభం పేరుతో దేశవ్యాప్తంగా అనేక నగరాల్లో వెర్రిగంతులు వేయడం, కొన్ని పబ్బుల్లో, క్లబ్బుల్లో నృత్యాల పేరుతో చేసే వెకిలి చేష్టలు వెర్రితలలు వేస్తున్న విష సంస్కృతికి పరాకాష్ఠగా చెప్పొచ్చు. కొందరు యువతీ యువకులు కేరింతలు కొడుతూ నూతన సంవత్సరానికి స్వాగతం పేరుతో నానా హంగామా చేశారు. 'హ్యాపీ న్యూ ఇయర్' అంటూ అర్ధరాత్రి పన్నెండు గంటల తర్వాత నినాదాలు చేస్తూ రోడ్లపై వీరంగం సృష్టించారు. అసలు వారు ఎవరికి స్వాగతం చెప్తున్నారో వారికే తెలియకుండాపోయింది. అయితే ఈసారి హైదరాబాద్‌లో మాత్రం పోలీసులు తీసుకున్న జాగ్రత్తలు, హెచ్చరికలు, అన్నింటికంటే మించి పటిష్టమైన తనిఖీల కారణంగా చాలా వరకు ప్రమాదాలు, ఘర్షణలు తగ్గాయి. కానీ పొరుగునున్న కర్ణాటక రాజధాని బెంగళూరులో ఈ వికృత చేష్టలు పరాకాష్ఠకు చేరాయనే చెప్పొచ్చు. రోడ్లపైనే మద్యంసేవిస్తూ, వారు వేస్తున్న చిందులు, వెర్రికేకలు, అరుపులను అడ్డుకోవడం పోలీసులకు తలకుమించిన భారంగా మారింది. ఎంతో మంది గాయపడ్డారు. ఒకదశలో బెంగళూరు పోలీసులు లాఠీ ఛార్జ్ చేయాల్సి వచ్చింది. ఇక పబ్‌లు, క్లబ్బుల్లో ఈఆనంద కేళిలో అదుపు తప్పి ఎంతమంది గాయపడ్డారో తెలియదు. అర్ధరాత్రితో ముగించాలని పోలీసులు ఆరాటపడినా, ఆదేశాలు ఇచ్చినా, కొన్ని పబ్‌లు, హోటళ్లు, తెలవార్లూ పాశ్చాత్య సంగీతహోరు, అశ్లీల నృత్యాల పేరుతో మునిగిపోయాయి. ఇది హైదరాబాద్, బెంగళూరు, ముంబాయి లాంటి నగరాలకే పరిమితం కాలేదు. గ్రామాలకు కూడా విస్తరించింది. తెలుగు రాష్ట్రాల్లో అనేక పట్టణాల్లో, నగరాల్లో చివరకు కొన్నిగ్రామాల్లో కూడా విషసంస్కృతి వికృతరూపందాల్చింది. కొన్ని యూట్యూబ్‌లు, టీవీల్లో జుగుప్సాకరమైన నృత్యాల ప్రచారం జరిగింది. తండ్రి ముందు కొడుకు, తల్లి ముందు కూతురు ఇలా కుటుంబం అంతా కలిసి కూర్చొని టీవీ చూడలేని విధంగా కొన్ని కార్యక్రమాలు సాగాయి. ఇటువంటి కార్యక్రమాలు యువతీయువకులకు ఒకింత ఆనందం కలిగించినప్పటికీ ఆ క్షణానికే పరిమతం అవుతాయి. పాశ్చాత్య సంస్కృతి ప్రభావం క్రమేణా నగరాలు దాటి కుగ్రామాలకు సైతం పాకిపోతున్నది. గ్రామీణ జనజీవన స్రవంతిలో లీనమై భాసిల్లుతున్నది. మన సంస్కృతి, సంప్రదాయాలకు అద్దంపట్టే కూచిపూడి, భరతనాట్యం, జానపద కళలు, పాశ్చాత్య నాగరికత వెల్లువ ఆధునిక ముసుగులో కనుమరుగైపోతున్నాయి. అనేక మతాలు, కులాల, అంతరాల దొంతర్లపై నిర్మితమైన మన కళాసంస్కృతిని భవిష్యత్‌లో కాపాడుకోలేమేమోననిపిస్తున్నది. గతంలో జాతరులు, తిరునాళ్లలో జరిగినా ఆయా ప్రాంతాలకు, ఆచారవ్యవహారాలకు అద్దంపట్టే జానపదకళలు, పురాణాలకు చెందిన హరికథలు, బుర్రకథలు, ఒగ్గుకథలు, నాటకాలు, పగటివేషాలతో ఎంతో ఆహ్లాదకరంగా ప్రదర్శించేవారు. పండుగ దినాల్లో ఇలాంటి కళలతో

ఒక్క మాట

పాటు కోలాటాలు, భజనలు చేస్తుండేవారు. ప్రతికళారూపం మన సంస్కృతికి అద్దంపట్టడమే కాక, ధర్మాధర్మ వివేచన ఆలోచనల్లో ఉజ్జీవనం పెంపొందించేందుకు ఉపయుక్తంగా ఉండేవి. మనం వేసే ప్రతి అడుగులోనూ మన సంస్కృతి, నాగరికతల విశిష్టిత పరిమళాలు, గుబాళిస్తుండేవి. వేషభాషల్లోనూ సభ్యతాసంస్కారం తొణికిసలాడుతుండేవి. దసరా, దీపావళి, సంక్రాంతి, ఉగాది, శ్రీరామనవమి లాంటి ఏపండుగలు తీసుకున్నా వాటికి ఒక విశిష్టత ఉండేది. ఇప్పుడు ఆ పండుగల జాబితాలో 'జనవరి ఫస్ట్' కూడా చేరిపోయింది. దాంతోపాటు కళారూపాల స్థానంలో డిస్కో, రికార్డుడాన్సులు ప్రత్యక్షమయ్యాయి. డిజేలు గ్రామగ్రామానికి చేరుకున్నాయి. వేలాది మంది ప్రజల ముందు అంగాంగ ప్రదర్శనలు చేస్తున్నారు. మద్యం మత్తు, సెక్స్ కేంద్రాలుగా గ్రామసీమలు మారిపోతున్నాయి. కొందరు బాధ్యత కల్గిన ప్రజాప్రతినిధులు ఈ రికార్డు డాన్సుల్లో పాల్గొంటున్నారు. అదే మన సంస్కృతి అన్నట్టుగా వ్యవరిస్తున్నారు. ఇక మద్యం గూర్చి ఎంత తక్కువ చర్చిస్తే అంతమంచిదేమో. మద్యం సేవించండి ప్రభుత్వానికి ఆదాయం పెంచండి అంటూ పాలకులే మద్యపానాన్ని ప్రోత్సహించేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నారు. ఏ సందర్భంలోనైనా పండుగ, పబ్బాలకే కాదు చావులాంటి విషాద సందర్భాల్లో కూడా మద్యం వాడకం విపరీతంగా పెరిగిపోతున్నది. ఒక్క తెలంగాణలోనే మొన్న డిసెంబరు నెలలో రికార్డుస్థాయిలో ఐదువేల కోట్లకు పైగా మద్యం అమ్మకాలు జరిగాయి. జనవరి ఫస్టన హైద రాబాద్ నగరంలో మూడువందల పద్నాలుగు కోట్లకు పైగా మద్యం అమ్ముడుపోయింది. దీనికితోడు డ్రగ్స్ కూడా పెద్ద ఎత్తున దేశవ్యాప్తంగా వినియోగం అవుతున్నది. దేశవ్యాప్తంగా జనవరి ఫస్టన కనీసం ఏడెనిమిది వేలకోట్ల రూపాయల విలువైన మాదక ద్రవ్యాలు అమ్మకాలు జరిగి ఉండవచ్చు నని అనధికార అంచనా. అయితే ఈ మద్యం మత్తులో వాహనాలు నడుపుతూ గతంలో ప్రమాదాలు జరిగి ఎందరో యువకులు ప్రాణాలు కోల్పోయారు. కానీ ఈసారి అలాంటి వాటికి అవకాశాలు లేకుండా తెలంగాణ పోలీసులు పటిష్టమైన చర్యలు తీసుకున్నారని చెప్పొచ్చు. డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో భారీఎత్తునే పట్టుబడారు. మూడు కమిషనరేట్ పరిధి. లో రెండువేల ఏడువందల ముప్పైఒక కేసులు నమోదు అయ్యాయి. మరొకచోట జనవరి ఫస్ట్ పండుగ చేసుకొంటూ మద్యం సేవించి, బిర్యాని తిన్న వారిలో పదమూడు మంది అస్వస్థతకు గురికాగా, ఒకరు మరణించారు. ఆంధ్రప్రదేశ్ తూర్పు గోదావరి జిల్లా అంతర్వేది వద్ద అర్ధరాత్రి నేరుగా జీపునే సముద్రంలోకి నడిపి ఒక యువకుడు ప్రాణాలు పోగొట్టుకొన్నాడు. మన సంస్కృతిని కాపాడేందుకు ప్రభుత్వపరంగా కూడా పెద్దఎత్తున చర్యలు తీసుకున్నట్లు కనపడడం లేదు. ఈ విషసంస్కృతి గతంలో మగవారికే పరిమితమై ఉండేది. కానీ అది క్రమేణా యువతులు కూడా అందులో భాగస్వామ్యం కావడం ఆందోళన కలిగించే అంశం. మధ్యతరగతికి చెందిన యువతీ యువకులు ఏదో విధంగా ఈ క్లబ్బులో ప్రవేశానికి ఆరాటపడుతున్నారు. ఇది ఒక స్టేటస్ సింబల్‌గా మారిపోయింది. కొందరు యువతీయువకులు కేవలం తమ విలాస జీవితాల కోసం డ్రగ్స్ సరఫరాతోపాటు దొంగతనాలకు పాల్పడుతున్నారు. ఇటీవల డ్రగ్స్ సరఫరా చేస్తూ పట్టుబడిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ తాను చేసిన అప్పులు తీర్చేందుకు ఈ డ్రగ్స్ రవాణా చేస్తున్నట్లు పోలీసుల ముందు అంగీకరించాడు. మరొకపక్క మిగిలిన నేరాలు తగ్గుతున్నా ఈ విషసంస్కృతి కారణంగా లైంగిక నేరాలు పెరిగిపోతున్నాయి. మన సంస్కృతీ, సంప్రదాయాలు తెలిపే పురాణ కాలక్షేపాలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు అతికొద్ది ప్రాంతాలకు మాత్రమే పరిమితమవుతున్నాయి. ముఖ్యంగా గ్రామాల పరిస్థితి ఆందోళనకరంగా తయారవుతున్నది. మఠాధిపతులు చేసే ఆసక్తికరమైన ఆధ్యాత్మిక ప్రసంగాలు, ఇతిహాస పురాణ గాథలు, నిరుపేద, మధ్యతరగతి, గ్రామీణులకు అందాల్సిన అవసరం ఉంది. సమాజంలో విపరీత ధోరణులు చూపుతున్న ఈ విషసంస్కృతిని రూపుమాపేందుకు అవసరమైన చర్యలు చేపట్టేందుకు ప్రభుత్వం నడుం కట్టాలి. మమ్మీ, డాడీ చదువులు ఉంటే ఉండనివ్వండి కానీ వాటితోపాటు మన సంస్కృతీ సంప్రదాయాలు తెలిపే పాఠ్యాంశాలను కూడా ప్రాథమికస్థాయి నుంచి పిల్లలు తెలుసుకునే విధంగా విద్యావిధానం రూపొందించాలి. అలాగే ఈ క్లబ్‌లు, పబ్‌లు, సైబర్ కేఫ్‌లలో నీలిచిత్రాలు, అంగాంగ ప్రదర్శనలపై ఉక్కుపాదం మోపాలి. శుభాకాంక్షలన్నీ శుభప్రదంగా ఉండాలి. ఈ విషయంలో ప్రభుత్వంతోపాటు ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు, మేధావులు కల్పించుకోవాలి. మన సంస్కృతి సంప్రదాయాలను రక్షించేందుకు సంసిద్ధులుకావాలి. ప్రజల భాగస్వామ్యమే మన సంస్కృతి పరిరక్షణకు ఏకైక మార్గం. ●

# భారత్ స్నేహాన్ని వదులుకోలేని బంగ్లాదేశ్

కనుమ ఎల్లారెడ్డి

బంగ్లాదేశ్ రాజకీయాలు శరవేగంగా మారిపోతున్నాయి. బంగ్లా మాజీ ప్రధాని ఖలీదా మరణంతో, ఇప్పుడుప్రజలలో ఆమె పార్టీ బంగ్లా నేషనలిస్ట్ పార్టీ (బిఎన్పి) వైపు ప్రజలు చూస్తున్నారు. బంగ్లాకు దిక్కు ఆ పార్టీయే కనపడుతోంది. ఖలీదా కుమారుడు పదిహేడేళ్ల ప్రవాసం తరువాత స్వదేశానికి వచ్చారు. దురదృష్టం ఆయన బంగ్లాకు వచ్చిన కొద్ది రోజులలోనే తల్లి మరణించడం తీరనిలోటు. ఆమె మరణం బంగ్లా ప్రజలకు కూడా గట్టి దెబ్బే. ఫిబ్రవరిలో జరిగే ఎన్నికలలో అవామీ లీగ్ అధినేత హాసీనా పార్టీ పోటీ చేయకుండా నిషేదానికి గురి అయింది. ఇప్పుడు ప్రజలలో ఒక బలమైన నాయకుడిగా తారీక్ కనపడుతున్నాడు. ఆయన మాటలలోనే స్పష్టంగా బంగ్లా అందరిది అని, బంగ్లాలో నివసిస్తున్న హిందువులు, ముస్లిమ్స్, క్రిస్టియన్స్, బౌద్ధులు ఒకటే అని తన ప్రసంగంలో చెప్పడం విశ్వంలోని ప్రజల దృష్టిని ఆకర్షించారు. భారత్, బంగ్లాదేశ్‌ల మధ్య కొన్ని పొరపొచ్చాలు ఉన్నా, భారత్ స్నేహాన్ని వదులుకోలేదు. ఒకవేళ తారీక్ ఎన్నికలలో నెగ్గితే ప్రధాని కావడం ఖాయం. ఆయన హయాంలోనైనా రెండు దేశాల మధ్య సంబంధాలు మెరుగు అవుతాయని విశ్లేషకుల అభిప్రాయం. భారత్‌నుంచి అత్యధికంగా లాభపడిన బంగ్లాదేశ్ వైఖరిలో మార్పు రావొచ్చు. అయితే అక్కడ హిందువులపై దాడి చేయడం హేయం. ఇటీవల బజేంద్ర బిశ్వస్ హత్యకు గురి కావడం సహించరానిది. ఇది తారీక్‌ను కలచి వేసి ఉండవచ్చు. అందుకే తన ప్రసంగంలో బంగ్లా సమైక్యత కోరుకుంటుంది అని చెప్పడం గమనార్హం. బీ.ఎన్.పి పార్టీ రెండు పర్యా



యాలు మాత్రమే గద్దె నెక్కింది. అప్పుడు ఖలీదా ప్రధానిగా బాధ్యతలు చేపట్టి భారత్‌తో కొంత ఘర్షణాత్మక వైఖరి అవలంభించారు. హాసీనా కూడా భారత్‌తో సయోధ్య ఉన్న నదీ జలాల వివాదంతో ఇద్దరు చేయి కలిపారు. భారత్ నుంచి ప్రవహిస్తున్న గంగానది అక్కడ పద్మానది అని పిలుస్తారు. నదీ జలాలు వినియోగంలో ఎక్కువ భాగం భారత్ పంచుకుంటుందని బంగ్లా ఆరోపణ. ఈ నదీ జలాల వివాదం బంగ్లాను పాలించిన జియా ఉర్ రెహమాన్ (ఖలీదా భర్త) కలం నుంచి ఉంది. ఆది నుంచి భారత్‌కు వ్యతిరేకంగా జమాతే ఇస్లామి పాక్‌కు అనుకూలంగా వ్యవహరించింది. తన తల్లి, తండ్రి భారత్‌కు వ్యతిరేకం అయినా తారీక్ మాత్రం ఆ బాటలో పయనించడం లేదు. భారత్‌తో ఏ సమస్య అయినా చర్చలద్వారా పరిష్కరించు కుంటామని ఆయన మాటలలో ధ్వనించింది. ఎన్నికలలో ఆయన ప్రత్యర్థులు ఎవరూ బలంగా కనపడటం లేదు. హాసీనా పోటీలో ఉండి ఉంటే ఒకింత పోటీ ఉండేది. కాని హాసీనా పార్టీలో అవినీతి పెరిగిపోవడం, హాసీనా తీసుకున్న నిర్ణయాలు బంగ్లా ప్రజలలో తీవ్ర అసంతృప్తి కలిగించింది. ఫలితంగా ఆమె భారత్‌లో తల దాచుకుని బంగ్లా రాజకీయాలను గమనిస్తోంది. ఏతావాతా ఇప్పుడు బంగ్లా రాజకీయాలలో తారీక్ ఒక ధ్రువతారగా కనపడుతున్నారు. ఏది ఏమైనా నూతన సంవత్సరం బంగ్లాదేశ్‌లో కొత్త ప్రభుత్వం ఏర్పాటులో, భారత్‌తో సంబంధాలు ఏ మేరకు వుంటాయో తేలిపోతుంది. మొత్తానికి తారీక్ అధికారంలోకి వస్తే మాత్రం లౌకికత్వం బలంగా ఉంటుంది. అదే ఆయన పార్టీకి, ఆయనకు శ్రీరామ రక్ష. ●

# గ్రామసభల బాధ్యతలు పెరగాలి

మేకిరి దామోదర్

తెలంగాణ రాష్ట్రంలోని గ్రామాలలో గ్రామపంచాయతీ ఎన్నికలు ముగిసి, నూతన పాలకవర్గాలు బాధ్యతలు స్వీకరించాయి. పల్లె భవిష్యత్తు తమ చేతుల్లో ఉందనే ఆశతో గ్రామవాసులు వీరిని ఆశగా చూస్తున్నారు. గత రెండేళ్లుగా పాలకవర్గాలు లేక, ప్రత్యేక పాలనలో అభివృద్ధి కుంటుపడి గ్రామాలు కునారిల్లిన పరిస్థితిఅందరికీ తెలిసిందే. రహదారులు, పారిశుద్ధం, మౌలిక సదుపాయాలు నిర్లక్ష్యానికి గురయ్యాయి. ఇలాంటి నేపథ్యంలో, కొత్తగా ఎన్నికైన సర్పంచులు-పాలకవర్గ సభ్యులు గ్రామాభివృద్ధి బాట పట్టిస్తారనే విశ్వాసం ప్రజల్లో నెలకొంది. ఈ సందర్భంగా తెలంగాణ పంచాయతీ రాజ్ చట్టం-2018 ఆధారంగా, పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ రూపొందించిన కరదీపిక సర్పంచులు, ఉపసర్పంచులు, పౌరుల విధులు- బాధ్యతలను స్పష్టంగా గుర్తుచేస్తోంది. ఈ కరదీపికను అధికారులు ప్రజాప్రతినిధులకు అందజేసి, చైతన్యపరచాల్సిన అవసరం ఎంతైనా ఉంది. సర్పంచి తాను ప్రాతినిధ్యం వహిస్తున్న గ్రామంలోనే నివసించాలి. అప్పుడే గ్రామపంచాయతీ కార్యకలాపాలు సమర్థంగా పర్యవేక్షించగలుగుతాడు. గ్రామపంచాయతీ తీర్మానాలకు లోబడి విధులు నిర్వహించాలి. గ్రామాభివృద్ధి ప్రణాళికలు రూపొందించి, వాటికి అనుగుణంగా పనులు అమలు చేయాలి. నిర్దేశిత కాలవ్యవధిలో గ్రామసభలు నిర్వహించడం, పారిశుద్ధం సక్రమంగా ఉండేలా చూడటం, పంచాయతీ కార్యదర్శి విధులను పర్యవేక్షించడం సర్పంచి ముఖ్య బాధ్యతలు. ప్రభుత్వం నిర్దేశించిన పరిమితిలో సంచిత కాంటిజెన్సీ నిధుల నుంచి ఖర్చులకు అనుమతులు ఇవ్వాలి. ప్రతి ఏటా నాటిన మొక్కల్లో కనీసం 85 శాతం జీవించి ఉండేలా చర్యలు తీసుకోవాలి. చట్టాన్ని అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవు. గ్రామపంచాయతీ నిధుల దుర్వినియోగం, ప్రభుత్వ ఆదేశాల ఉల్లంఘన, గ్రామసభలు నిర్వహించకపోవడం, ఖాతాల ఆడిట్ చేయించడంలోవిఫలం కావడం, అసమర్థతతో గ్రామాభివృద్ధిని అడ్డుకోవడం వంటి సందర్భాల్లో సర్పంచిని తొలగించే అధికారం జిల్లా కలెక్టర్‌కు ఉంటుంది. తొలగించే ముందు నోటీసు ఇవ్వబడుతుంది. తొలగింపునకు గురైన సర్పంచి ఆరేళ్లపాటు ఎన్నికల్లో పోటీ చేయడానికి అనర్హుడు. నెలరోజుల్లో గ్రామపంచాయతీ ట్రిబ్యునల్‌లో అప్పీల్ చేసుకునే అవకాశం ఉంటుంది. గ్రామ పంచాయతీ విధులు సర్పంచి 15 రోజులకుపైగా గ్రామపంచాయతీ పరిధి దాటి వెళ్లినప్పుడు లేదా సస్పెన్షన్‌లో ఉన్నప్పుడు, ఉపసర్పంచ్ బాధ్యతలు నిర్వర్తిస్తారు. సర్పంచ్‌పదవి ఖాళీ అయినప్పుడు, మళ్లీ ఎన్నికలు జరిగే వరకు తాత్కాలిక సర్పంచిగా వ్యవహరిస్తారు. పంచాయతీ నిధుల వినియోగానికి సంబంధించిన చెక్కులపై సర్పంచితో కలిసి ఉపసర్పంచ్ ఉమ్మడిగా సంతకం చేస్తారు. వార్డు సభ్యులకు



పంచాయతీ సమావేశాల్లో తీర్మానాలు ప్రవేశపెట్టే అధికారం ఉంది. పంచాయతీ రికార్డులను పరిశీలించే హక్కు వారికి ఉంటుంది. ప్రభుత్వ ఆదేశాలను ఉల్లంఘిస్తే లేదా హోదాను దుర్వినియోగం చేస్తే, కలెక్టర్ వార్డు సభ్యులను ఆరు నెలల పాటు సస్పెండ్ చేయవచ్చు. అవసరమైతే కమిషనర్ మరో ఆరు నెలలు పొడిగించవచ్చు. సర్పంచ్, ఉపసర్పంచ్ఇద్దరూ 15 రోజులకుపైగా అందుబాటులో లేని పరిస్థితుల్లో, ఒక వార్డు సభ్యుడికి సర్పంచి అధికారాలను జిల్లా కలెక్టర్ అప్పగించవచ్చు. పంచాయతీ కార్యదర్శులు గ్రామసభల నిర్వహణ, పారిశుద్ధం, మొక్కల పెంపకం, రికార్డుల నిర్వహణ, ఖాతాల నిర్వహణ, తీర్మానాల అమలు వంటి బాధ్యతలు నిర్వర్తించాలి. చట్టంలోని సెక్షన్ 52(1) ప్రకారం, 100 శాతం మరుగుదొడ్ల నిర్మాణం, మురుగునీటి కాలువలు, చెత్త నిర్వహణ, ప్రతి ఇంటి ప్రాంగణంలో కనీసం ఆరు మొక్కల నాటడం, వీధిదీపాల నిర్వహణ, విద్యుత్ బిల్లుల చెల్లింపు, ఆస్తిపన్నుల వసూలు, జనన-మరణ-వివాహాల నమోదు వంటి విధులు పంచాయతీల ప్రధాన బాధ్యతలు. గ్రామ లేఅవుట్లు, నిర్మాణ అనుమతులు, సామూహిక మరుగుదొడ్లు, విద్యుత్ సరఫరా, పునరుత్పాదక ఇంధన వ్యవస్థలు, వ్యాధుల నివారణ, బాల్యవివాహాలు, వరకట్నం వంటి సామాజిక దురాచారాల నివారణ, వృద్ధులు, దివ్యాంగులు, అనాథల సంక్షేమం కూడా పంచాయతీల పరిధిలోనే ఉన్నాయి. పదవీ విరమణ చేసిన ఉద్యోగులు, వయోవృద్ధులు, దాతలు, గ్రామ సంఘాల అధ్యక్షు లు కోఆప్షన్ సభ్యులుగా ఉండవచ్చు. గ్రామసభలు స్థాయి సంఘాలు గ్రామంలో ఓటుహక్కు గల ప్రతిఒక్కరూ గ్రామ సభ సభ్యులే. రెండు నెలలకు ఒకసారి చొప్పున ఏడాదిలో ఆరుసార్లు గ్రామసభలు నిర్వహించాలి. వార్షిక ఆడిట్ నివేదికలు, గ్రామ నిర్వహణ నివేదికలు గ్రామసభకు సమర్పించాలి. గ్రామపంచాయతీలో నాలుగు స్థాయి సంఘాలు (స్టాండింగ్ కమిటీలు) ఉంటాయి. పారిశుద్ధం, వీధిదీపాలు, మొక్కల పెంపకం తదితర అంశాలను ఇవి సమీక్షిస్తాయి. అవసరమైతే ఆయా రంగాల నిపుణులను సభ్యులుగా చేర్చుకోవచ్చు. ఆశల్ని అభివృద్ధిగా మలచే పరీక్ష రెండేళ్లుగా పాలకవర్గాలు లేకపోవడం వల్ల గ్రామపంచాయతీ పాలనలో జవాబుదారీతనం కొరవడింది. అభివృద్ధికుంటుపడి, గ్రామాలు అస్తవ్యస్తంగా మారాయి. ప్రత్యేక అధికారులు ప్రజాసమస్యలను పట్టించుకోని పరిస్థితి కూడా ఎదురైంది. ఇలాంటి పరిస్థితుల నుంచి గ్రామాలను బయటకు తీసుకురావడం నూతన సర్పంచు లు-పాలకవర్గ సభ్యుల ముందున్న అసలైన సవాల్. శత కోటి ఆశలతో గెలిపించిన ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవడం వారి ప్రధాన బాధ్యత. పరిపాలనా సామర్థ్యాన్ని, ప్రజాప్రతినిధుల ఐక్యతను చూపుతూ పల్లెల అభివృద్ధిని గాడిలో పెట్టగలిగితేనే సర్పంచి పదవికి అర్థం ఉంటుంది. ప్రతి పల్లె ప్రగతి పథంలో పయనించేలా నిజాయితీతో, పారదర్శకతతో, ప్రజాస్వామ్య విలువలతో పాలన అందించిన ప్పుడే గ్రామపంచాయతీలు ఆదర్శంగా నిలుస్తాయి. అదే నిజమైన ప్రజాసేవ, అదే సర్పంచుల విజయానికి కొలమానం. ●

# ఢిల్లీని కమ్మేసిన పొగమంచు



అటు చలిగాలులు తీవ్రతరం.. ఇటు ప్రమాదస్థాయిలో వాయు కాలుష్యం

హర్యానా, పంజాబ్, రాజస్థాన్, ఉత్తర్‌ప్రదేశ్‌లోనూ అదే పరిస్థితి

పలు విమానాలు, రైళ్లు రద్దు, రోడ్డు రవాణాకు అంతరాయం

6 వరకు ఇదే పరిస్థితి: ఐఎండి హెచ్చరిక

**న్యూఢిల్లీ, జనవరి 2:** దేశ రాజధాని ఢిల్లీలో శుక్రవారం దట్టమైన పొగమంచు కమ్మేసింది. అటు చలిగాలుల తీవ్రత పెరిగింది. దీనికి తోడు ప్రమాదకర స్థాయిలో వాయు కాలుష్యం. హర్యానా, పంజాబ్, రాజస్థాన్, ఉత్తర్‌ప్రదేశ్‌లలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. భారత వాతావరణ శాఖ (ఐఎండి) అధికారుల సమాచారం మేరకు రాబోయే రోజుల్లో చలిగాలుల తీవ్రత మరింత పెరిగే అవకాశముంది. అలాగే దట్టమైన పొంగమంచు ఉంటుందని అంచనా వేసింది. కాలుష్యం కూడా బాగా పెరిగి పోయిందని ఆందోళన వ్యక్తం చేసింది. హిమాలయ ప్రాంతాలలో హిమపాతం, చల్లని గాలుల తీవ్రత 6వ తేదీ వరకు ఎక్కువగా ఉంటుందని ఐఎండి హెచ్చరిక జారీ చేంది. కాలుష్య నియంత్రణ అధికారుల ప్రకారం, శుక్రవారం ఉదయం నగరంలో ఏక్యూఐ లెవెల్స్ 386గా నమోదైంది. 26 ఎయిర్ మానిటరింగ్ స్టేషన్లలో గాలి నాణ్యత వెరీ పూర్ కేటగిరీలో నమోదైనట్లు పేర్కొంది. అత్యధికంగా ఆనంద్ విహార్‌లో ఏక్యూఐ 423గా నమోదైంది. అయితే దట్టమైన పొగమంచు రాజధానిలో అనేక ప్రాంతాల్లో దృశ్యమానత గణనీయంగా పడిపోయింది. సఫ్దర్‌జంగ్, పాలం వద్ద దృశ్యమానత 50 మీటర్లకు పడిపోయింది. మధ్యాహ్నా సమయానికి 60 మీటర్లకు స్వల్పంగా మెరుగుపడింది. దీనికి తోడు తీవ్రమైన చలిగాలులతో ఢిల్లీ వాసుల సాధారణ జీవనానికి తీవ్ర ఇబ్బందులు కలిగించింది. రైళ్లు, విమానాల రాకపోకలకు అంతరాయం కలిగించింది. డజన్ల కొద్దీ విమానాలు రద్దు కాగా, 80కి పైగా రైళ్లు ఆలస్యంగా నడుస్తున్నాయి. ఇంకొన్నింటిని అధికారులు దారి మళ్లించారు. పొగమంచు విపరీతంగా కురుస్తున్నందున విజిబిలిటీ తగ్గిపోవడంతో పలు విమానాలను రద్దు చేస్తున్నట్లు ఇండిగో, ఎయిర్ ఇండియా సంస్థలు ప్రకటించాయి. విమానాల రద్దుతో ప్రభావితమైన ప్రయాణికులు ఆన్‌లైన్‌లో రీబుక్ చేసుకోవచ్చని, లేదంటే డబ్బు వాపసు పొందవచ్చని తెలిపాయి.

**హైదరాబాద్‌లోనూ దట్టమైన పొగమంచు..**

**స్తంభించిన ట్రాఫిక్**

హైదరాబాద్ శివారు ప్రాంతాలను శుక్రవారం తెల్లవారుజామున దట్టమైన పొగమంచు కమ్మేసింది. మంచు తీవ్రత ఎక్కువగా ఉండటంతో రోడ్లు, భవనాలు కనిపించని పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా నగర శివార్లలోని ఇబ్రహీంపట్నం, నాగార్జునసాగర్ హైవే, మేడ్చల్, తూంకుంట, శామీర్‌పేట, గండిపేట, మోకిల, పటాన్‌చెరు, వికారాబాద్, రాజేంద్రనగర్, ఆదిబట్ల తదితర ప్రాంతాల్లో జీరో విజిబిలిటీ నమోదైంది. దీంతో ఉదయాన్నే రోడ్లెక్కిన వాహనదారులు, ఆఫీసులకు వెళ్లే ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పొగమంచు కారణంగా శంషాబాద్ ఎయిర్‌పోర్టు మార్గంతో పాటు బెంగళూరు జాతీయ రహదారిపై వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక పోవడంతో డ్రైవర్లు తమ వాహనాలను రోడ్డు పక్కనే నిలిపివేశారు. ఫలితంగా శంషాబాద్ నుంచి పాలమాకుల వరకు సుమారు 10 కిలోమీటర్ల మేర భారీగా ట్రాఫిక్ జామ్ అయ్యింది. అటు ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్)పై కూడా మంచు ప్రభావం ఎక్కువగా ఉండటంతో ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. మరోవైపు హైదరాబాద్- విజయవాడ జాతీయ రహదారిపై కూడా ఇదే పరిస్థితి. విజిబిలిటీ పూర్తిగా తగ్గిపోవడంతో వాహనదారులు హెడ్ లైట్లు, ఇండికేటర్లు వేసుకుని నెమ్మదిగా వెళ్లాల్సి వచ్చింది. రానున్న రోజుల్లో ఉష్ణోగ్రతలు మరింత తగ్గే అవకాశం ఉండటంతో వాహనదారులు ప్రయాణాల్లో జాగ్రత్తలు పాటించాలన్నారు.



## ఇరాన్‌లో ఖమైనీకి వ్యతిరేకంగా భారీ నిరసన ప్రదర్శనలు,

### ఏడుగురు మృతి, వందలాది మందికి గాయాలు

**టెహ్రాన్, జనవరి 2:** ఇరాన్ సర్వోన్నత నాయకుడు అయతొల్లా అలీ ఖమేనీకి వ్యతిరేకంగా సాగుతున్న నిరసనలు 2026 నూతన సంవత్సరం వేళ హింసాత్మకంగా మారాయి. పెరుగుతున్న నిత్యావసర ధరలు, ద్రవ్యోల్బణం పెరుగుదలపై సామాన్యులు మొదలుపెట్టిన ఈ పోరాటం ఇప్పుడు ఇరాన్ వ్యాప్తంగా ఉన్న పల్లెలకు కూడా పాకింది. ఒకవిధంగా చెప్పాలంటే ఇరాన్‌లోకూడా జెన్‌జడ్ ఉద్యమం తీవ్రస్థాయికి చేరుతున్నట్లు స్పష్టం అవుతోంది. ఆందోళనల్లో యువత ఎక్కువగా పాల్గొంటుండటమే ఇందుకు నిదర్శనం. వారం రోజులుగా జరుగుతున్న ఘర్షణల్లో ఇప్పటివరకు ఏడుగురు మరణించగా, వందలాది మంది గాయపడినట్లు తేలింది. టెహ్రాన్ యూనివర్సిటీ విద్యార్థులు రోడ్లపైకి వచ్చి సర్వాధికారికి మరణం అంటూ నినాదాలు చేశారు. 1979 ఇస్లామిక్ విప్లవం కంటే ముందు ఇరాన్‌ను పాలించిన షా మహమ్మద్ రెజా పహ్లవీ కుమారుడు రెజా పహ్లవీకి నిరసనకారులు మద్దతు పలకడం విశేషం. ప్రస్తుతం అమెరికాలో ప్రవాసంలో ఉన్న రెజా పహ్లవీ సోషల్ మీడియా వేదికగా స్పందిస్తూ విజయం మనదే ఎందుకంటే మన పోరాటం న్యాయమైనది అంటూ నిరసనకారులకు సంఘీభావం ప్రకటించారు. 1979 ఇస్లామిక్ విప్లవం సందర్భంగా పదవీచ్యుతుడైన అమెరికా మద్దతుదారు షా మొహమ్మద్ రేజా పహ్లవీ కుమారుడు రేజా పహ్లవీకి అనుకూలంగా విద్యార్థులు నినాదాలు చేశారు. టెహ్రాన్ వ్యాప్తంగా షాకు కీర్తిస్తూ నినాదాలు మార్మోగిన దరిమిలా అమెరికాలో ప్రవాస జీవితాన్ని గడుపుతున్న రేజా పహ్లవీ ఎక్స్ వేదికగా స్పందించారు. తాను మీతోనే ఉన్నానని, తమ పోరాటం న్యాయమైనది కాబట్టి విజయం తమదేనని ఆయన నిరసనకారులను ఉద్దేశించి ప్రకటించారు. ఇరాన్ రియాల్ విలువ డాలర్‌తో పోలిస్తే సగానికి పడిపోవడం, ద్రవ్యోల్బణం 42.5 శాతానికి చేరడంతో ప్రజల్లో ఆగ్రహం కట్టలు తెంచుకుంది. లోర్డెగాన్, కుహదాష్త్, ఇస్ఫహాన్ వంటి నగరాల్లో భద్రతా బలగాలకు, నిరసనకారులకు మధ్య తీవ్రస్థాయిలో ఘర్షణ జరుగుతోంది. కుహదాష్త్‌లో జరిగిన ఘర్షణలో బాసిజ్ పారామిలిటరీ దళానికి చెందిన అమీర్ హుస్సామ్ ఖోదయారీ ఫర్ద్ అనే వ్యక్తి మరణించగా, మరో 13 మంది గాయపడ్డారు. పరిస్థితి విషమిస్తుండటంతో ఇరాన్ ప్రభుత్వం అప్రమత్తమైంది. ఒకవైపు భద్రతా చర్యలు చేపడుతూనే, మరోవైపు చర్చలకు సిద్ధమని ప్రకటించింది. వర్తక సంఘాల ప్రతినిధులతో నేరుగా మాట్లాడతామని ప్రభుత్వ అధికార ప్రతినిధి ఫాతిమా మొహజెరానీ తెలిపారు. కాగా, నిరసనకారులను అణచివేయడానికి ఇరాన్ ఇంటర్నెట్ సేవలను కూడా కొన్ని ప్రాంతాల్లో నిలిపివేసింది.



## నీరు కాదు విషాన్ని పంచారు..

### ఇండోర్ మరణాలపై రాహుల్‌గాంధీ ఆందోళన

**న్యూఢిల్లీ, జనవరి 2:** కలుషిత నీరు తాగి మధ్యప్రదేశ్‌లోని ఇండోర్ నగరంలో పలువురు ప్రాణాలు కోల్పోవడం ఆందోళన రేకెత్తిస్తోంది. ఈ ఘటనపై తాజాగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ స్పందించారు. అక్కడి ప్రభుత్వం నీరు కాకుండా విషాన్ని పంపిణీ చేస్తోందని మండి పడ్డారు. ఈ మేరకు ఆయన ఎక్స్‌లో పోస్టు పెట్టారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ఆరోగ్యం పట్టించుకోకుండా కుంభ కర్ణుడిలా నిద్రపోతోందని రాహుల్ విమర్శించారు. కలుషిత నీరు తాగడం వల్ల చాలా మంది ఇళ్లలో విషాదం నెలకొందని పేదలు నిస్సహాయ స్థితిలో ఉన్నారన్నారు. దీనికి తోడు అధికార బిజెపి నేతలు నిర్లక్ష్యపు ప్రకటనలు చేయడాన్ని తప్పుబట్టారు. బాధిత కుటుంబాలకు ఓదార్పు ఇవ్వకుండా అహంకారంతో వ్యవహరిస్తున్నారని మండి పడ్డారు. మురికిగా, దుర్వాసన వస్తోన్న నీటి గురించి గతంలో ప్రజలు పదే పదే ఫిర్యాదు చేసినా ప్రభుత్వం ఎందుకు పట్టించుకోలేదు? తాగే నీటిలో మురుగునీరు ఎలా కలిసింది? వెంటనే నీటి సరఫరా ఎందుకు ఆపలేదు? బాధ్యులైన అధికారులపై ఎప్పుడు చర్యలు తీసుకుంటారు? అని రాహుల్ ప్రశ్నించారు. పరిశుభ్రమైన నీరు పొందడం ప్రజల హక్కు అని అన్నారు. ఈ హక్కును కాలరాసిన బిజెపి ప్రభుత్వమే ఇందుకు పూర్తి బాధ్యత వహించాలన్నారు. దుష్పరిపాలనకు మధ్యప్రదేశ్ కేంద్రంగా మారిందని విమర్శించారు. మొన్నటి వరకు దగ్గు మందు కారణంగా, ఆ తర్వాత ప్రభుత్వాసుపత్రుల్లో ఎలుకల వల్ల పిల్లలు ప్రాణాలు కోల్పోయారన్నారు. ఇప్పుడు కలుషిత నీరు కారణంగా మృతి చెందుతున్నారన్నారు. ఇలా ఎప్పుడు పేదలు మరణించినా మోడీజీ మాత్రం మౌనంగా ఉంటారన్నారని విమర్శించారు. ఇక ఓ మరుగుదొడ్డి వద్ద మంచినీటి పైపులైన్ లీకేజ్ వల్లే ఈ మరణాలు చోటుచేసుకుంటున్నాయని నగర మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు తాజాగా తెలిపారు.

## గిగ్‌వర్కర్లకు మేలుచేసే నాలుగు కొత్త లేబర్‌కోడ్‌లు



**న్యూఢిల్లీ, జనవరి 2:** గిగ్ వర్కర్లకు సైతం మేలుచేసేవిధంగా కేంద్రం నాలుగు కొత్త కార్మిక చట్టాలకు (లేబర్ కోడ్స్) సంబంధించిన ముసాయిదా నిబంధనలను కార్మిక, ఉపాధి మంత్రిత్వ శాఖ విడుదల చేసింది. ఈ కొత్త విధానం ద్వారా తొలిసారిగా గిగ్, ప్లాట్‌ఫామ్ వర్కర్లు అంటే ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీ, క్యాబ్ డ్రైవర్లు వంటివారినికూడా సామాజిక భద్రత పరిధిలోకి తీసుకువస్తున్నారు. వారికి కనీస వేతనం, ఆరోగ్యం, వృత్తి భద్రత వంటి ప్రయోజనాలు అందనున్నాయి. ఏప్రిల్ 1 నుంచి ఈ కొత్త చట్టాలను దేశవ్యాప్తంగా అమలు చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ముసాయిదా నిబంధనల ప్రకారం ఈ ప్రయోజనాలు పొందాలంటే గిగ్ వర్కర్లు కొన్ని షరతులను పాటించాల్సి ఉంటుంది. ఒక ఆర్థిక సంవత్సరంలో ఒకే సంస్థ (అగ్రిగేటర్)తో కనీసం 90 రోజులు పనిచేసిన వారు సామాజిక భద్రత పథకాలకు అర్హులవుతారు. ఒకటి కంటే ఎక్కువ సంస్థలతో పనిచేసే వారికి ఈ పరిమితిని 120 రోజులుగా నిర్ణయించారు. ఒకే రోజులో ఒక వర్కర్ వేర్వేరు సంస్థల కోసం పనిచేస్తే, ఆ పనిదినాలను వేర్వేరుగా లెక్కిస్తారు. ఉదాహరణకు ఒకే రోజు ముగ్గురు అగ్రిగేటర్లతో పనిచేస్తే, దానిని మూడు పని దినాలుగా పరిగణిస్తారు. ఈ కొత్త చట్టాల ద్వారా మరికొన్ని ముఖ్యమైన మార్పులు కూడా రానున్నాయి. ఇకపై అన్ని రంగాల ఉద్యోగులకు యాజమాన్యాలు తప్పనిసరిగా నియామక పత్రాలు (అపాయింట్‌మెంట్ లెటర్లు) ఇవ్వాల్సి ఉంటుంది. దీనివల్ల ఉద్యోగ భద్రత, పారదర్శకత పెరుగుతాయి. అలాగే ఇప్పటివరకు కొన్ని నిర్దిష్ట పరిశ్రమలకే పరిమితమైన కనీస వేతనం, ఇకపై అన్ని రంగాల కార్మికులకు చట్టబద్ధంగా వర్తిస్తుంది. అధిక వేతనాలు, మెరుగైన పని పరిస్థితులు కోరుతూ గిగ్ వర్కర్లు సమ్మెకు దిగడానికి ఒక రోజు ముందు, అంటే గత ఏడాది డిసెంబరు30న ఈ ముసాయిదా నోటిఫికేషన్ విడుదల కావడం గమనార్హం. ప్రస్తుతం ఈ ముసాయిదాపై భాగస్వామ్య పక్షాల నుంచి కేంద్ర ప్రభుత్వం అభిప్రాయాలను స్వీకరిస్తోంది.

## ప్రతి ఒక్కరూ ఇంట్లో మాతృభాషనే మాట్లాడాలి!

### ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భగవత్

**ముంబయి, జనవరి 2:** దేశంలో భాషా వివాదం ముదురుతున్న తరుణంలో రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ చీఫ్ మోహన్ భగవత్ కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రతి భారతీయుడు తన సొంత భాషను గౌరవించాలని ముఖ్యంగా కుటుంబ సభ్యులతో మాతృ భాషలోనే సంభాషించాలని ఆయన కోరారు. భాషా వైవిధ్యం దేశానికి బలం కావాలి తప్ప బలహీనత కాకూడదని ఆయన అభిప్రాయపడ్డారు. ఇంగ్లీష్‌తో అన్నీ సాధ్యం కాదని ఆయన అన్నారు. ఒక పుస్తకావిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న భగవత్ మాట్లాడుతూ భారతీయ సంస్కృతిలోని లోతైన అర్థాలను వివరించడానికి ఇంగ్లీష్ భాషలో తగిన పదజాలం లేదని అన్నారు. ఉదాహరణకు కల్పవృక్షం అనే పదాన్ని ఇంగ్లీష్‌లోకి అనువదిస్తే దాని అసలు అర్థం, ఆధ్యాత్మికత దెబ్బతింటుందని ఆయన పేర్కొన్నారు. కేవలం ఇంగ్లీష్ మీడియం చదువుల వల్ల భాషలు అంతరించిపోవని ఇంట్లో మాతృభాషలో మాట్లాడటం మానేయడం వల్లనే ప్రాంతీయ భాషలకు ముప్పు వాటిల్లుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలను కులం, మతం, సంపద లేదా భాష ఆధారంగా అంచనా వేయకూడదని భగవత్ సూచించారు.

"భారతదేశం అందరిదీ ఇక్కడ పుట్టి, ఈ దేశాన్ని ప్రేమించే ప్రతి ఒక్కరూ భారతీయులే" అని ఆయన స్పష్టం చేశారు. ఆధ్యాత్మిక వేత్తలు కూడా ఇప్పుడు ఇంగ్లీష్‌ను ఆశ్రయించాల్సి రావడం మన భాషల పట్ల పెరుగుతున్న నిర్లక్ష్యానికి అద్దం పడుతోందని అన్నారు. నైతిక విలువలు, సంప్రదాయాలు తదుపరి తరాలకు అందాలంటే మాతృభాషను కాపాడుకోవడం ఒక్కటే మార్గమని ఆయన ఉద్ఘాటించారు. ఈ వ్యాఖ్యలు ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చనీయాంశం అయ్యాయి. మాతృభాషపై భగవత్ చేసిన సూచనలను పలువురు ఆహ్వానిస్తుండగా మరికొందరు మాత్రం తీవ్రంగా విమర్శిస్తున్నారు. ఇంగ్లీషు భాష మాట్లాడడం బాగా అలవాటు అవ్వాలంటే ఇంట్లో కూడా ఆ భాషలోనే మాట్లాడాలంటూ పలువురు సూచిస్తున్నారు. అభిప్రాయపడ్డారు. ఇంగ్లీష్‌తో అన్నీ సాధ్యం కాదని ఆయన అన్నారు. ఒక పుస్తకావిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న భగవత్ మాట్లాడుతూ భారతీయ సంస్కృతిలోని లోతైన అర్థాలను వివరించడానికి ఇంగ్లీష్ భాషలో తగిన పదజాలం లేదని అన్నారు. ఉదాహరణకు కల్పవృక్షం అనే పదాన్ని ఇంగ్లీష్‌లోకి అనువదిస్తే దాని అసలు అర్థం, ఆధ్యాత్మికత దెబ్బతింటుందని ఆయన పేర్కొన్నారు. కేవలం ఇంగ్లీష్ మీడియం చదువుల వల్ల భాషలు అంతరించిపోవని ఇంట్లో మాతృభాషలో మాట్లాడటం మానేయడం వల్లనే ప్రాంతీయ భాషలకు ముప్పు వాటిల్లుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలను కులం, మతం, సంపద లేదా భాష ఆధారంగా అంచనా వేయకూడదని భగవత్ సూచించారు. "భారతదేశం అందరిదీ ఇక్కడ పుట్టి, ఈ దేశాన్ని ప్రేమించే ప్రతి ఒక్కరూ భారతీయులే" అని ఆయన స్పష్టం చేశారు. ఆధ్యాత్మిక వేత్తలు కూడా ఇప్పుడు ఇంగ్లీష్‌ను ఆశ్రయించాల్సి రావడం మన భాషల పట్ల పెరుగుతున్న నిర్లక్ష్యానికి అద్దం పడుతోందని అన్నారు. నైతిక విలువలు, సంప్రదాయాలు తదుపరి తరాలకు అందాలంటే మాతృభాషను కాపాడుకోవడం ఒక్కటే మార్గమని ఆయన ఉద్ఘాటించారు. ఈ వ్యాఖ్యలు ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చనీయాంశం అయ్యాయి. మాతృభాషపై భగవత్ చేసిన సూచనలను పలువురు ఆహ్వానిస్తున్నారు.

## మోడీతో ట్రంప్‌నకు వ్యక్తిగత విభేదాలు.. అందుకే భారత్‌కు దూరం!

**వాషింగ్టన్, జనవరి 2:** రెండోసారి అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన డొనాల్డ్ ట్రంప్.. భారత్‌తో అనుసరిస్తున్న విధానాలను అమెరికా కాంగ్రెస్ సభ్యుడు సుహాస్ సుబ్రమణ్యం తప్పుబట్టారు. ట్రంప్ తన చర్యలతో భారత్-అమెరికాల మధ్య సంబంధాలను పూర్తిగా దెబ్బతీశారని ఆరోపించారు. ఇది ఇరు దేశాల ఆర్థిక, వ్యూహాత్మక ప్రయోజనాలకు ప్రమాదకరమని హెచ్చరించారు. డెమొక్రటిక్ నేత సుబ్రమణ్యం ఓ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ వ్యాఖ్యలు చేశారు. 'ట్రంప్ తన తొలివిడత పాలనలో తీసుకున్న చర్యలకు పూర్తి వ్యతిరేకంగా ఇప్పుడు వ్యవహరిస్తున్నారు. తొలిసారి అధ్యక్షుడిగా ఉన్నప్పుడు భారత ప్రధాని మోడీతో సంబంధాలను బలోపేతం చేశారు. ఇప్పుడు మోడీతో ఆయనకు వ్యక్తిగత విభేదాలు ఉన్నట్లుగా కన్పిస్తోంది. దానివల్ల చాలా యేళ్లుగా బలంగా ఉన్న ఇరు దేశాల సంబంధాలను ఆయన చెడగొట్టుకుంటున్నారు. ఇది ఇరు దేశాలకు మంచిది కాదు' అని ఆయన అన్నారు. భారత్‌తో సంబంధాలను బలోపేతం చేసుకోవడం అమెరికాకు చాలా ముఖ్యమని, ముఖ్యంగా చైనా ఆధిపత్యాన్ని ఎదుర్కోవడానికి ఇది సాయపడుతోందన్నారు. ట్రంప్ విధించిన సుంకాలు ఇరుదేశాల మధ్య ఆర్థిక సంబంధాలను తీవ్రంగా దెబ్బతీశాయని సుబ్రమణ్యం అభిప్రాయపడ్డారు. అమెరికా కాంగ్రెస్‌లో ఉభయపక్షాలు భారత్‌తో సంబంధాలకు కట్టుబడి ఉన్నాయన్నారు.



## కుమార్తెతో కలిసి కొత్త సంవత్సరవేడుకల్లో కిమ్!

**ప్యాంగ్యాంగ్, జనవరి 2:** ఉత్తర కొరియా పాలకుడు కిమ్ జోంగ్ ఉన్ తన కుమార్తె జుయేను మరోసారి ప్రపంచానికి ప్రత్యేకంగా పరిచయం చేశారు. 2026 నూతన సంవత్సర వేడుకల సందర్భంగా, కిమ్ తన తండ్రి కిమ్ జోంగ్ ఇల్, తాత కిమ్ ఇల్ సంగ్ భౌతిక కాయాలను భద్రపరిచిన పవిత్రమైన కుమ్సుసాన్ ప్యాలెస్ ఆఫ్ ది సన్ ను కుమార్తెతో కలిసి సందర్శించారు. జుయే ఈ ప్యాలెస్‌ను సందర్శించడం ఇదే తొలిసారి కావడం గమనార్హం. ఉత్తర కొరియా ప్రభుత్వ మీడియా కేసీఎన్ఏ విడుదల చేసిన చిత్రాలలో కిమ్ కుటుంబం ప్రధాన వరుసలో నిలబడి నివాళులర్పించింది. ఇందులో కిమ్ జోంగ్ ఉన్, ఆయన భార్య రి సోల్ జు మధ్యలో కుమార్తె జుయే నిలబడి ఉన్నారు. సాధారణంగా అత్యంత ప్రాధాన్యం కలిగిన వారు ఉండే మధ్య స్థానాన్ని తన కుమార్తెకు కేటాయించడం ద్వారా కిమ్ ఆమెను తన వారసురాలిగా సూచనప్రాయంగా ప్రకటిస్తున్నారని అంతర్జాతీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ప్యాంగ్‌యాంగ్‌లో జరిగిన నూతన సంవత్సర ప్రదర్శనలో కూడా జుయే సందడి చేశారు. తన తండ్రి ధరించిన శైలిలోనే నల్లటి లెదర్ కోటు ధరించి ఆయన పక్కనే కూర్చున్నారు. కౌంట్‌డౌన్ ముగిసిన తర్వాత కిమ్ బుగ్గపై ముద్దుపెట్టుకుని శుభాకాంక్షలు తెలుపుతూ కనిపించారు. ఈ వేడుకల్లో ఆమె పిల్లలను హత్తుకోవడం, ప్రజలకు అభివాదం చేయడం వంటి దృశ్యాలు ఆమెకు పెరుగుతున్న ప్రాధాన్యం చాటుతున్నాయి.

## ఆస్తి కోసం తండ్రిని చంపేశారు

### - ఉత్తర్‌ప్రదేశ్‌లోని ఘజియాబాద్‌లో ఘోరం



**లక్నో, జనవరి 2:** ఆయనో రిటైర్డ్ ఆర్మీ అధికారి. ఆయనకు ఇద్దరు కుమారులు. వారి మధ్య ఆస్తి వివాదం. ఇల్లు విడిచి వెళ్లాలని కొడుకులకు తండ్రి అల్టిమేటం జారీ చేశాడు. కొంతకాలంగా కుమారులపై ఒత్తిడి చేస్తున్నారు. ఆస్తిపై ఆశతోపాటు, ఇల్లు ఖాళీ చేయడం ఇష్టంలేని కుమారులిద్దరూ తండ్రిని హతమార్చాలని కుట్ర పన్నారు. తండ్రిని హత్య చేయాలని తెలిసిన వ్యక్తికి సుపారీ ఇచ్చారు. సుపారీ తీసుకున్న ముఠాలో ఓ కానిస్టేబుల్ కూడా ఉన్నాడు. అంతా అనుకున్నట్లుగా ఇంటికొస్తున్న తండ్రిని సుపారీ గ్యాంగ్ డిసెంబర్ 26న తుపాకీతో కాల్చి చంపారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేయగా ఆసక్తికర విషయాలు వెలుగుచూశాయి. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఉత్తరప్రదేశ్‌లోని ఘజియాబాద్‌కు చెందిన రిటైర్డ్ ఐఏఎఫ్ అధికారి యోగేష్ (58) తన ఇంట్లో ఉంటున్న కుమారులను ఆ ఇల్లు ఖాళీ చేయాలని కొంతకాలంగా ఒత్తిడి తెస్తున్నారు. ఆస్తిపై ఆశతో పాటు, ఇల్లు ఖాళీ చేయడం ఇష్టం లేని కుమారులు తండ్రిని వదిలించుకోవాలని పథకం వేశారు. ఇందుకోసం తమ పొరుగున ఉండే అరవింద్ (32) అనే వ్యక్తికి సుపారీ ఇచ్చారు. అరవింద్ తన బావమరిది, కౌశాంబి జిల్లాలో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న నవీన్‌తో కలిసి ఈ కాల్పులకు పాల్పడ్డాడు. బుధవారం సాయంత్రం నిందితుడు అరవింద్‌ను అరెస్ట్ చేసిన పోలీసులు అతడి నుంచి పిస్టల్, బుల్లెట్లను స్వాధీనం చేసుకున్నారు. విచారణలో యోగేష్‌పై తానే కాల్పులు జరిపినట్లు అరవింద్ అంగీకరించాడు. ఘజియాబాద్ కోర్టు అతడికి 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీ విధించింది. యోగేష్ ఇద్దరు కుమారులు, కానిస్టేబుల్ నవీన్ ప్రస్తుతం పరారీలో ఉన్నారు. వారి కోసం పోలీసులు గాలిస్తున్నారు.

## అంగారక గ్రహంపై నీటి గుహలు!



**న్యూయార్కు, జనవరి 2:** అంగారక గ్రహంపై నీటి గుహలను చైనా శాస్త్రవేత్తలు గుర్తించారు. హిబ్రుస్ వాలీస్ ప్రాంతంలో ఆ గుహలు ఉన్నట్లు తేల్చారు. నీటి వల్ల గుహలు ఏర్పడినట్లు అంచనా వేస్తున్నారు. భూమి కాకుండా మరో గ్రహంపై నీటి గుహలను గుర్తించడం ఇదే మొదటిసారి. మార్స్ గ్రహంపై అగ్నిపర్వతాల ద్వారా ఏర్పడిన గుహలను గతంలో గుర్తించారు. కానీ రాళ్లలోని రసాయనాల వల్ల నీటి గుహలు ఏర్పడినట్లు తాజా రిపోర్టులో తేల్చారు. 'ద ఆస్ట్రోఫిజికల్ జనరల్ లెటర్స్'లో ఈ స్టడీకి చెందిన నివేదిక ఇచ్చారు. నీటి గుహల ఆవిష్కరణ మార్స్ గ్రహంపై జీవం ఉందన్న ఆధారాలను స్టడీ చేసేందుకు ఊతం ఇచ్చేలా ఉన్నది. ఎన్నో ఏళ్ల క్రితమే ఈ గుహలు ఏర్పడినట్లు తేల్చారు. భవిష్యత్తు అన్వేషణలకు ఈ గుహలను స్టడీ చేయనున్నారు. 2025 అక్టోబర్ 30న ఆ అధ్యయనానికి చెందిన డేటాను పబ్లిష్ చేశారు. నాసా శాటిలైట్ల నుంచి సేకరించిన డేటా ఆధారంగా చైనా శాస్త్రవేత్తలు రిపోర్టు ఇచ్చారు.

## సంక్షిప్తంగా..

### తమిళనాట మల్లెపూలు కిలో రూ.3 వేలు!



**చెన్నై, జనవరి 2:** తమిళనాడులో ఆధ్యాత్మిక మాసం మార్గళి పూజలకు తోడు, ఆంగ్ల నూతన సంవత్సర వేడుకలు తోడవడంతో పూల ధరలు భారీగా పెరిగాయి. ముఖ్యంగా మల్లెపూల ధరలు సామాన్యులకు అందనంత స్థాయికి చేరాయి. మధురై మార్కెట్‌లో కిలో మల్లెలు రూ. 2,500 పలకగా, తేని జిల్లా ఆండిపట్టి మార్కెట్‌లో ఏకంగా రూ. 3,000 మార్కును తాకాయి. రాష్ట్రంలో వర్షాలు తగ్గి మంచు కురుస్తుండటంతో పూల దిగుబడి గణనీయంగా పడిపోయింది. ఇదే సమయంలో వైకుంఠ ఏకాదశి, నూతన సంవత్సరం కూడా కావడంతో పూలకు విపరీతమైన గిరాకీ ఏర్పడింది. మల్లెపూలతో పాటు ఇతర పూల ధరలు కూడా పెరిగాయి. కిలో కనకాంబరం రూ. 2,500, ముల్లై పూలు రూ. 1,200, పన్నీటి గులాబీలు రూ. 200 చొప్పున విక్రయించారు. సంక్రాంతి పండుగ సమీపిస్తుండటంతో పూల ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని వ్యాపారులు అంచనా వేస్తున్నారు.

### పుతిన్ ఇంటిపై దాడి నిజమే: యుఎస్‌కు ఆధారాలిచ్చిన రష్యా



**మాస్కో, జనవరి 2:** యుద్ధం ముగించేందుకు ప్రయత్నాలు జరుగుతుండగా.. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఇల్లే లక్ష్యంగా డ్రోన్ దాడులు జరగడం తీవ్రం చర్చనీయాంశమైంది. ఉక్రెయిన్ దళాలు ఈ దాడికి పాల్పడ్డాయంటూ రష్యా ఆరోపించిన సంగతి తెలిసిందే. వీటిని పలు దేశాలు ఖండిస్తున్న నేపథ్యంలో.. దాడి నిజమేనని రష్యా నిజరూపించుకునే పనిలో పడింది. ఇందులో భాగంగా దాడికి సంబంధించి లభ్యమైన కొన్ని ఆధారాలను అమెరికాకు అందజేసింది. ఈ మేరకు ఆ దేశ రక్షణ మంత్రిత్వ శాఖ ఓ విడియో విడుదల చేసింది. రష్యా సైనిక నిఘా సంస్థ అధిపతి అడ్మిరల్ ఇగోర్ కోస్త్యుకోవ్ మాస్కోలోని యుఎస్ మిలిటరీ అటాచ్ అధికారులతో భేటీ అయ్యారు.

### తైవాన్ సమీపంలో యుద్ధ విన్యాసాలు ఆపండి : చైనాను కోరిన అమెరికా



**వాషింగ్టన్, జనవరి 2:** తైవాన్ విషయంలో చైనా అనుసరిస్తున్న విధానాలపై అమెరికా ఆందోళన వ్యక్తం చేసింది. బీజింగ సంయమనం పాటించాలని విజ్ఞప్తి చేసింది. ఇటీవల తైవాన్ జలసంధి చుట్టూ చైనా భారీగా యుద్ధ విన్యాసాలు చేయడం తీవ్ర ఆందోళన కలిగించిన సంగతి తెలిసిందే. ఈ పరిణామాలపైనే తాజాగా అమెరికా విదేశాంగ శాఖ స్పందించింది. 'తైవాన్ చుట్టూ చైనా సైనిక విన్యాసాలు, బెదరింపులకు పాల్పడటం ఈ ప్రాంతంలో తీవ్ర ఉద్రిక్తలు పెంచుతాయి. బీజింగ్ సంయమనం పాటించాలని, తైవాన్‌పై సైనిక ఒత్తిడిని ఆపాలని కోరుతున్నాం. దౌత్యమార్గాలతో ఈ సమస్య పరిష్కరించుకుంటారని ఆశిస్తున్నాం.' అని విదేశాంగ శాఖ ప్రతినిధి టామీ పిగోట్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. తైవాన్ జలసంధి చుట్టూ శాంతి, స్థిరత్వానికి యుఎస్ మద్దతుస్తోందన్నారు.

### ఫుడ్‌పాయిజనింగ్‌తో 200 చిలుకల మృతి

**భోపాల్, జనవరి 2:** కలుషిత ఆహారం వల్ల సుమారు 200 చిలుకలు మరణించాయి. ఇది చూసి స్థానికులు భయాందోళన చెందారు. బర్డ్ ఫ్లూ కారణంగా చిలుకలు చనిపోయినట్లు అనుమానం వ్యక్తం చేశారు. అయితే చిలుకల మృతికి ఫుడ్ పాయిజనింగ్ కారణమని పశు వైద్యులు నిర్ధారించారు. మధ్యప్రదేశ్‌లోని ఖర్గోన్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. బద్వా ప్రాంతంలోని నర్మదా నది ఒడ్డున ఉన్న అక్విడక్ట్ వంతెన సమీపంలో గత నాలుగు రోజుల్లో సుమారు 200 చిలుకలు మరణించాయి. ఇది చూసి స్థానికులు ఆందోళన చెందారు. బర్డ్ ఫ్లూ సోకడం వల్ల చిలుకలు చనిపోయినట్లు అనుమానం వ్యక్తం చేశారు.

వందలాది చిలుకలు మరణించిన సమాచారం తెలుసుకుని పశువైద్యులు, వన్యప్రాణుల సంరక్షణ శాఖతో పాటు అటవీశాఖ అధికారులు ఆ ప్రాంతానికి చేరుకున్నారు.

చిలుకల కళేబరాలకు పోస్ట్‌మార్టం నిర్వహించారు. వాటి మృతికి ఫుడ్ పాయిజనింగ్ కారణమని పశువైద్యులు నిర్ధారించారు.



సత్యాన్వేషణ వ్యాసాల సంపుటిని ఆవిష్కరిస్తున్న మండలి బుద్ధప్రసాద్

## అక్షరాలు సమాజంపై సంధించే అస్త్రాలు

### సత్యాన్వేషణ వ్యాసాల సంపుటిని ఆవిష్కరించిన బుద్ధప్రసాద్

విజయవాడ, జనవరి 2 ప్రభాతవార్త ప్రతినిధి: అక్షరాలు సమాజంపై సంధించిన అస్త్రాలని అధికార భాషా సంఘం పూర్వాధ్యక్షులు డాక్టర్ మండలి బుద్ధప్రసాద్ అన్నారు. కృష్ణా జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో బందరురోడ్డులోని సర్వోత్తమ భవన్‌లో శుక్రవారం బండారు రాధాకృష్ణ రచించిన సత్యాన్వేషణ వ్యాసాల సంపుటిని ఆయన ఆవిష్కరించారు. అనంతరం బుద్ధప్రసాద్ మాట్లాడుతూ పాత్రికేయులకు ప్రశ్నించే గుణం ఉండాలన్నారు. రాధాకృష్ణ ప్రశ్నించే పాత్రికేయుడిగా సమాజాన్ని పరిశీలించేవారని గుర్తుచేశారు. ఆయన దశాబ్దాల అనుభవమున్న ఆయన జర్నలిస్టు అనుభవాలను పుస్తకంగా తీసుకువస్తే రేపటి తరానికి ఎంతో ఉపయోగపడుతుందన్నారు. నేటి ప్రజాస్వామ్యం ధనస్వామ్యంగా మారిపోవడాన్ని ప్రతి ఒక్కరూ ప్రశ్నించాలన్నారు. విశ్రాంత ఆధ్యాపకుడు డాక్టర్ 50 వ్యాసాలను ఎంపిక చేసి సత్యాన్వేషణ పేరుతో వ్యాసాలుగా ప్రచురించినట్లు తెలిపారు. నవమల్లెతీగ సంపాదకుడు కలిమిశ్రీ మాట్లాడుతూ వ్యక్తిగత ప్రయోజనాల కోసం రచనలు చేస్తున్న రచయితలున్న నేటి తరుణంలో ఎలాంటి వ్యక్తిగత ప్రయోజనం ఆశించకుండా సమాజ పునరుద్ధరణ కోసం, వ్యవస్థలో మార్పుకోసం రాధాకృష్ణ రచనలు చేశారన్నారు. రచయిత బండారు రాధాకృష్ణ తనకు ప్రేరణ కలిగించిన అంశాలను వివరించారు. కృష్ణా జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు గుత్తికొండ సుబ్బారావు సభకు అధ్యక్షత వహించారు. రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ జీవీ పూర్ణచందు. ఆకాశవాణి దూరదర్శన్ విశ్రాంత సంచాలకుడు గుత్తికొండ కొండలరావు, సీనియర్ పాత్రికేయుడు టీవీ సుబ్బయ్య, సర్వోత్తమ గ్రంథాలయం నిర్వాహకురాలు రావి శారద పాల్గొన్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కవులు స్వీయ కవితాగానం చేశారు. నాదెళ్ళ ఉమాదేవి ప్రదర్శించిన వీణావాదన శ్రావ్యంగా సాగింది. వివిధ ప్రాంతాలనుంచి వచ్చిన సాహితీవేత్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## విజయవాడలో నేటినుంచి ఖాదీ ఎగ్జిబిషన్



విజయవాడ, జనవరి 2 ప్రభాత వార్త ప్రతినిధి: ఖాదీ పరిశ్రమల ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యం తోపాటు, గ్రామీణ కళాకారుల జీవనోపాధి ప్రోత్సహించి, వారి ఆర్థిక పరిస్థితిని మెరుగుపరిచేలా ఖాదీ మహోత్సవాన్ని నిర్వహిస్తున్నామని ఖాదీ, గ్రామీణ పరిశ్రమల కమిషన్ రాష్ట్ర సంచాలకులు డా. ఎస్. గ్రీప్ తెలిపారు. స్థానిక పడమట రామినేని వారి వీధిలోని ఖాదీ గ్రామీణ పరిశ్రమల కమిషన్ రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం ఖాదీ విలేజ్ ఇండస్ట్రీస్ కమిషన్ రాష్ట్ర సంచాలకులు డా.ఎస్. గ్రీప్ ఖాదీ మహోత్సవం నిర్వహణపై మీడియా ప్రతినిధుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర సంచాలకులు డా.ఎస్. గ్రీప్ మాట్లాడుతూ ఖాదీ, గ్రామీణ పరిశ్రమల కమిషన్, భారత ప్రభుత్వం సంయుక్త ఆధ్వర్యంలో పిఎంఈజిపి ఖాదీ మార్కెటింగ్ రాష్ట్రస్థాయి సంయుక్త మార్కెటింగ్ ఎగ్జిబిషన్‌ను ప్రారంభించడం జరుగుతుందన్నారు. ఈ ఎగ్జిబిషన్‌ను 3 తేదీ శనివారం సాయంత్రం 5:00 గంటలకు స్థానిక పంట కాలువ రోడ్డులోని మేరీ స్టెల్లా ఇండోర్ స్టేడియంలో ప్రదర్శనను విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్ (చిన్ని), తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ రావు ప్రారంభిస్తారన్నారు. జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ, కేవీఐబీ సీఈవో కట్టా సింహాచలం, పరిశ్రమల శాఖ సంచాలకులు శుభం బన్సల్, ఎస్ఎల్బీసీ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ శ్రీనివాస దాస్యం, పాల్గొననున్నారన్నారు. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుండి వచ్చిన కళాకారులచే 100కు పైగా స్టాళ్లు ఏర్పాటు చేశామన్నారు. ఖాదీ గ్రామీణ పరిశ్రమల కమిషన్ సహాయ సంచాలకుల ఆర్.ఎల్.ఎన్. మూర్తి మాట్లాడుతూ ఖాదీ, గ్రామీణ పరిశ్రమలు, ప్రైమ్ మినిస్టర్ ఎంప్లాయిమెంట్ గ్యారంటీ జనరేషన్ ప్రోగ్రాం (పీఎంఈజీపీ) కింద తయారైన ఉత్పత్తులకు ఈ ఎగ్జిబిషన్‌లో మార్కెటింగ్ సౌకర్యం కల్పించడం జరుగుతుందన్నారు. తయారీదారులు, కళాకారుల ప్రతిభను చాటేందుకు ఈ వేదికను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పొందూరు ఖాదీ, ధర్మవరం సిల్క్, కలంకారీ ప్రింటింగ్, చెక్క బొమ్మలు, చేతితో తయారు చేసిన వైవిధ్యమైన ఉత్పత్తులు అందుబాటులో ఉంటాయని, వాటిని నగర ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సహాయ సంచాలకులు ఆర్.ఎల్.ఎన్. మూర్తి తెలియజేశారు.

### ఉపాధి హామీపై కేంద్రం కుట్రలు చేస్తుంటే

## చంద్రబాబు మౌనం దారుణం

### పిసిసి అధ్యక్షురాలు వైఎస్ షర్మిల



విజయవాడ, జనవరి 2 ప్రభాతవార్త ప్రతినిధి: ఉపాధి హామీ పథకంపై కేంద్రం కుట్రలు చేస్తుంటే, సిఎం చంద్రబాబు మౌనంగా ఉండటం దారుణమని ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రి చంద్ర బాబు ప్రభుత్వంపైనా, కేంద్రంలోని ఎన్డీయే సర్కారుపైనా తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంపై కేంద్రం కుట్రలు చేస్తుంటే, సీఎం చంద్రబాబు మౌనంగా ఉండటం దారుణమని ఆమె మండిపడ్డారు. బీజేపీ తెస్తున్న నల్లచట్టాలకు రాష్ట్ర ప్రభుత్వం చప్పట్లు కొట్టడం అత్యంత సిగ్గుచేటని విమర్శించారు. షర్మిల మాట్లాడుతూ, "గ్రామీణ ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి ఉపాధి హామీ పథకం ఊతమిచ్చింది. వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో దేశంలోనే తొలి జాబ్ కార్డును మన రాష్ట్రంలోనే అందించాం. ఈ పథకం ద్వారా ఏటా 80 లక్షల మంది పేదలకు ఉపాధి హక్కుగా మారింది" అని వెల్లడించారు. దేశంలోనే ఈ పథకాన్ని సమర్థంగా వినియోగించుకుంటున్న రాష్ట్రాల్లో ఏపీ అగ్రస్థానంలో ఉందని తెలిసినా, కేంద్రం జీ రామ్ జీ పేరుతో కొత్త చట్టం తీసుకొచ్చి దానికి గండి కొడుతోందని ఆరోపించారు. ఈ అక్రమ చట్టంతో రాష్ట్రంపై ఏటా రూ.4,500 కోట్ల భారం పడుతుందని, ఈ నిజాన్ని తెలిసి కూడా చంద్రబాబు ఏమీ మాట్లాడకుండా ఉండడం బాధాకరమన్నారు. ఉపాధి హామీ పథకానికి ఊపిరి తీస్తున్న జీ రామ్ జీ చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని కూటమి పార్టీలను ఆమె కోరారు. పాత నరేగా చట్టాన్ని పునరుద్ధరించేలా బేషరతుగా మద్దతు పలకాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో, కూటమి పార్టీల నిర్లక్ష్యాన్ని కాంగ్రెస్ పార్టీ ప్రజల్లో ఎండగడుతుందని షర్మిల హెచ్చరించారు.

# గుండ్లపల్లిలో మంత్రి పయ్యావుల ప్రజాదర్బార్

- ప్రజల నుంచి అర్జీలు స్వీకరించిన మంత్రి
- ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం
- రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్



అనంతపురం, జనవరి 2 ప్రభాతవార్త బ్యూరో: ఉరవకొండ నియోజకవర్గ పరిధిలోని బెలుగుప్ప మండలం గుండ్లపల్లి గ్రామంలోని మంజునాథ కల్యాణ మండపంలో రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నులు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ "ప్రజాదర్బార్" కార్యక్రమాన్ని నిర్వహించారు. శుక్రవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్ సిస్టం, పిజిఆర్ఎస్) కార్యక్రమంలో భాగంగా ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించి నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి వివిధ రకాల సమస్యలపై అనంతపురం ఎంపి అంబికా లక్ష్మీనారాయణతో కలిసి మంత్రి పయ్యావుల కేశవ్ అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా తమ కూటమి ప్రభుత్వం పని చేస్తోందన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలోని ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారానికి పెద్దపీట వేసిందన్నారు. తమ ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి "ప్రజాదర్బార్" కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతోందన్నారు. ప్రజాదర్బార్‌లో వచ్చిన సమస్యల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారించడం జరిగిందని పేర్కొన్నారు. కేంద్రంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సహకారంతో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో రాష్ట్రంలో అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చేపట్టడం జరుగుతోందన్నారు. ఈ సందర్భంగా మంత్రి నలుమూలల నుంచి వచ్చిన బాధితులు, నాయకులు, ప్రజలు సమస్యలను అర్జీల రూపంలో స్వీకరించారు. ఎలాంటి ఆలస్యం కాకుండా ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో కళ్యాణదుర్గం ఆర్డీఓ వసంతబాబు, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

# యల్లనూరులో దాడులు, ప్రతిదాడులు

- 20 మంది తెదేపా, 13 మంది వైకాపా వర్గీయులపై కేసులు
- వైసిపి కార్యకర్తలకు వైఎస్ జగన్ పరామర్శ



యల్లనూరులో పోలీసుల ఎదుటే చోటు చేసుకున్న దాడులు

తాడిపత్రి, జనవరి 2, ప్రభాతవార్త: అనంతపురం జిల్లా శింగనమల నియోజకవర్గ పరిధిలోని యల్లనూరులో గురువారం జరిగిన దాడులు ప్రతి దాడులకు సంబంధించి ఇరువర్గాలకు చెందిన 33 మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. గురువారం నూతన సంవత్సర వేడుకలను వేదికగా చేసుకొని తెదేపా, వైకాపా నాయకులు, కార్యకర్తలు పరస్పరం దాడులు, ప్రతిదాడులు చేసుకోవడంతో యల్లనూరు మండల కేంద్రం రణరంగంగా మారిన విషయం విదితమే. తాము నూతన సంవత్సర వేడుకలు చేసుకుంటుంటే హాజరైన ఓ కార్యకర్త ఇంటి మీదికి తెదేపా నాయకులు, కార్యకర్తలు దాడికి వెళ్లారని, అది తెలుసుకొని వెన్నపూసపల్లి నుంచి యల్లనూరుకు వస్తుంటే తనపై తెదేపా నాయకులు దాడిచేసి హత్యాయత్నానికి పాల్పడ్డారని వైసీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి, జడ్పీటీసీ సభ్యులు భోగాతి ప్రతాప్‌రెడ్డి ఆరోపిస్తున్నారు. ప్రశాంతంగా ఉన్న యల్లనూరులో అలజడి రేపడానికి వస్తున్నారా అంటూ భోగాతి ప్రతాప్‌రెడ్డిని అడ్డుకునే ప్రయత్నంలో వాగ్వాదానికి దిగినట్లు తెదేపా వర్గీయులు చెబుతున్నారు. ఈ కారణాలను సాకుగా చూపుతూ ఇరువర్గాలు రాళ్లు, గాజు సీసాలు విసురుకుంటూ కర్రలతో పరస్పరం దాడులకు తెగబడ్డారు. దీంతో ఇరువర్గాలకు చెందిన 12 మందికి తీవ్రగాయాలవగా తెదేపా వర్గీయులను అనంతపురానికి, వైసీపీ వర్గీయులను పులివెందుల ఆసుపత్రికి పోలీసులు తరలించారు. పులివెందుల ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వైసీపీ నాయకులకు వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్ రెడ్డి ఫోన్‌లో పరామర్శించారు. భోగాతి ప్రతాప్‌రెడ్డి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీసినట్లు, దాడికి గల కారణాలను విచారించినట్లు తెలిసింది. పార్టీ తరపున అన్ని విధాలుగా అండగా ఉంటామని, బాధిత కుటుంబాలకు వైసీపీ పూర్తి మద్దతుగా నిలుస్తుందని భరోసా ఇచ్చినట్లు వైసీపీ నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా ప్రజాస్వామ్య విరుద్ధ చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఆయన తెలిపారు. అధికారం ఉందని అహంకారం ప్రదర్శిస్తే భవిష్యత్తులో తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని, సంఘటన జరిగిన తీరును చూస్తుంటే మాకే భయమేస్తోందని మాజీ మంత్రి, శింగనమల వైసీపీ ఇన్‌ఛార్జి శైలజానాథ్ తెలిపారు. చరవాణిలో చిత్రీకరించిన తెదేపా నాయకుల దాడి దృశ్యాలను ఆయన పోలీసు అధికారులకు చూపిస్తూ ఇంత దౌర్జన్యం ఏమిటని ప్రశ్నించారు. తెదేపా నాయకులు దాడులు చేస్తుంటే చూస్తూ ఊరుకోబోమని, రానున్న రోజుల్లో చట్టపరిధిలోనే ప్రస్తుతం తెదేపా నాయకులు చేస్తున్న దౌర్జన్యాలకు తగిన రీతిలో బుద్ధి చెబుతామని వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆలూరు సాంబశివారెడ్డి అన్నారు. అనంతపురంలో చికిత్స పొందుతున్న తెదేపా వర్గీయులను ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణి, తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్‌రెడ్డి పరామర్శించారు. ఇరువర్గాల ఫిర్యాదుల మేరకు తెదేపా వర్గీయులు 20 మందిపైనా, వైసీపీ వర్గీయులు 13 మందిపైనా కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

## విశేషమైన ప్రజాదరణ పొందిన ప్రజా నాయకుడు ఎబి బర్ధన్

### సిపిఐ జాతీయ కార్యదర్శి కె. రామకృష్ణ



విజయవాడ, జనవరి 2 ప్రభాతవార్త ప్రతినిధి: జీవితాంతం కమ్యూనిస్ట్‌గా పనిచేసి విశేషమైన ప్రజాదరణ పొందిన గొప్ప ప్రజా నాయకుడు ఏ.బి. బర్ధన్ అని సిపిఐ జాతీయ కార్యదర్శి కె. రామకృష్ణ, కొనియాడారు. సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి, ప్రముఖ ట్రేడ్ యూనియన్ నాయకులూ ఏ.బి. బర్ధన్ 10వ వర్ధంతి సందర్భంగా సిపిఐ జాతీయ కార్యదర్శి కె. రామకృష్ణ, సిపిఐ తెలంగాణ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈ.టి. నరసింహ, సిపిఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి బి. స్టాలిన్, డి.హెచ్.పి.ఎస్ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మరుపాక అనిల్ కుమార్, ఏఐఎస్ఎఫ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు మణికంఠ రెడ్డి తదితరులు అయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా కె.రామకృష్ణ, మాట్లాడుతూ ఏ.బి. బర్ధన్ కమ్యూనిస్ట్ నిర్వాహకుడుగా, కార్మికవర్గ నాయకుడుగా, కార్మికవర్గం తక్షణ, హక్కులు, సామజిక భద్రత, ఆర్థిక ప్రయోజనాలు, రాజకీయ హక్కులను కాపాడే పనితో పాటు, కార్మికులలో రాజకీయ విద్యను అందించడం, మార్క్సిస్ట్ భావజాలాన్ని ప్రాచుర్యంలోకి తీసుకురావడంపై ప్రత్యేక శ్రద్ధ చూపారని తెలిపారు. ఆయన మంచి వక్త, సరళత, ఆలోచనల స్పష్టతతో తరచుగా చమత్కారమైన వ్యాఖ్యలు చేసేవారని గుర్తు చేసారు. ఈ.టి. నరసింహ మాట్లాడుతూ భారత కమ్యూనిస్ట్ పార్టీ ప్రజా పోరాటాల పట్ల శ్రమించే ప్రజల హక్కులను కాపాడడంలో ఏ.బి. బర్ధన్ చూపిన అచంచల నిబద్ధత మనందరికీ మార్గదర్శకమని అన్నారు. ఐక్యత, ప్రజాస్వామ్యం, సోషలిజం, ప్రజల హక్కుల కోసం జీవితాంతం పోరాడిన పోరాట యోధుడు ఏ.బి. బర్ధన్ అని గుర్తు చేసారు.

# గంజాయి విక్రేతలపై పోలీసుల ఉక్కుపాదం

- నలుగురు అరెస్టు... గంజాయి స్వాధీనం
- నిందితులను రోడ్డుపై ఊరేగింపుగా స్టేషన్‌కు తరలింపు
- వివరాలు వెల్లడించిన కదిరి డిఎస్పీ శివనారాయణస్వామి



కదిరి, జనవరి 2 ప్రభాతవార్త: శ్రీ సత్యసాయి జిల్లా కదిరి పట్టణంలో గంజాయి విక్రయించడం, అక్రమ రవాణా చేయడంపై పోలీసులు ఉక్కుపాదం మోపారు. గంజాయి విక్రయిస్తూ పట్టుబడిన నిందితులను శుక్రవారం పట్టణంలోని ప్రధాన రహదారుల గుండా ఊరేగిస్తూ స్టేషన్‌కు తీసుకెళ్లారు. అనంతరం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో డిఎస్పీ శివనారాయణ స్వామి ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. కదిరి పట్టణంలో పలు ప్రాంతాల్లో గంజాయి విక్రయిస్తూ సేవిస్తున్నారన్న వచ్చిన సమాచారం మేరకు పట్టణ సిఐ డివి నారాయణరెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి అనుమాన స్పదంగా తిరుగుతున్న నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారించగా, వారి నుంచి ఒక కెజి 200 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పట్టణంలోని నల్లగుట్ట వీధికి చెందిన బి.ఆంజినేయులు నాయక్, డి.పవన్‌కుమార్, సాకే సూరి అనే ముగ్గురు నింధితుల నుంచి ఒక్కొక్కరి నుంచి 400 గ్రాములు చొప్పున ఒక కెజి 200 గ్రాములు స్వాధీనం చేసుకున్నామని, అదే విధంగా చాకలి ఆదినారాయణ గంజాయి సేవిస్తూ పట్టుబడిన సందర్భంలో అతనిపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకున్నామన్నారు. పట్టుబడిన ముగ్గురు నిందితులు గంజాయి అక్రమంగా కొనుగోలు చేయడం, రవాణా చేయడం, విక్రయిస్తునట్లు తమ విచారణలో వెల్లడైందన్నారు. గత ఆరు నెలల నుంచి ఉమ్మడి అనంతపురం జిల్లా కేంద్రం నుంచి గంజాయిని తీసుకొచ్చి కదిరి పట్టణంలోని పరిసర ప్రాంతాల్లో యువకులకు అధిక ధరలకు విక్రయిస్తున్నారన్నారు. ఈ కేసులో ముగ్గురు నిందితులపై, గంజాయి సేవిస్తున్న వ్యక్తి, గంజాయి సేవించే అలవాటు ఉన్న మరో 10 మంది యువకులపై కేసులు నమోదు చేశామన్నారు. అలాగే మరో 15 మంది నిందితులను వేర్వేరు సందర్భాల్లో మత్తు పదార్థాలు సేవించినట్లు తమ దృష్టికి రావడంతో వారి తల్లిదండ్రులను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చినట్లు డిఎస్పీ తెలిపారు. గంజాయి విక్రయించడం, రవాణా చేయడం చట్టరీత్యా నేరమని ఎంతటి వారైనా ఉపేక్షించమని డిఎస్పీ హెచ్చరించారు. ఈ సమావేశంలో పట్టణ సిఐ డివి.నారాయణరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

# శ్రీశైలంలో చిరుత కలకలం

### పాతాళగంగ మెట్ల మార్గంలో ఓ ఇంటి ఆవరణలో సంచారం

### సిసి కెమెరాల్లో రికార్డయిన చిరుత పులి దృశ్యాలు



శ్రీశైలం ప్రాజెక్ట్, జనవరి 2 ప్రభాతవార్త: శ్రీశైలం పాతాళగంగ మెట్ల మార్గంలో గురువారం అర్ధరాత్రి చిరుతపులి హల్‌చల్ చేసింది. సమీపంలో నివాసముంటున్న పూజారి సత్యనారాయణ ఇంటి ఆవరణములో చిరుత సంచారం సిసి కెమెరాల్లో రికార్డు అయింది. చిరుత సంచారమును ఉదయమున పూజారి ఇంట్లో సిసి కెమెరాలు దృశ్యాలను చూసి కుటుంబ సభ్యులు షాక్ గురయ్యారు.

గత ఏడాది కూడా ఈ పూజారి ఇంట్లోకి ప్రవేశించిన సంఘటన కూడా ఉంది. తిరిగి మరలా ఈ ఏడాది అదే పూజారి ఇంట్లోకి ప్రవేశించిన దృశ్యాలు క్షేత్రంలో వైరల్‌గా మారాయి. తాము వరండా ఆవరణములో రాత్రిపూట పడుకొని ఉంటే చిరుత పులి దాడి చేసి ఉండేదేమోనని కుటుంబ సభ్యులు భయాందోళన వ్యక్తం చేశారు.

శ్రీశైలం అటవీ ప్రాంతం అంతా దట్టమైన నల్లమల అడవి కావడంతో చిరుత పులుల సంచారం పరిపాటిగా మారింది. చిరుత పులి పూజారి వరండా ఆవరణంలో సంచారం చేసిన విషయం అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వడంతో వారు పరిసర ప్రాంతాలను పరిశీలించి ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వారు సూచించారు. అదేవిధంగా దేవస్థానం అధికారులు కూడా భక్తులను అప్రమత్తం చేస్తూ శబ్ద యంత్రాల ద్వారా సూచనలు చేస్తున్నారు.

## శ్రీకాళహస్తీశ్వరాలయంలో అమ్మవారికి బంగారు పుష్పాలతో అభిషేకాలు



శ్రీకాళహస్తి, జనవరి 2 ప్రభాతవార్త: శ్రీకాళహస్తిలో ఒక్కొక్క రోజు ఒక్కొక్క దేవునికి నిత్యపూజలు, అభిషేకాలు ప్రత్యేక అలంకారాలు నిర్వహించటం ఆనవాయితి. ఈ నేపథ్యంలో శుక్రవారం దేవేరి జ్ఞాన ప్రసూనాంబ అమ్మవారికి 116 బంగారు పుష్పాలతో అభిషేకించారు. అంతేకాక అమ్మవారికి బంగారు చీరతో ముస్తాబు చేసి వజ్రకిరీటాన్ని అలంకరించారు. మహిళా భక్తులు విశేష సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. శ్రీకాళహస్తీశ్వ రాలయం కంచుగడప నుంచి ప్రవేశిస్తే మొదట దర్శనమిచ్చేది గురుదక్షిణామూర్తి. కుడివైపు చూస్తే మృత్యుంజయస్వామి ప్రతిష్టిత లింగం దర్శనమిస్తుంది. ఎడమవైపు నిత్యకల్యాణోత్సవం దర్శనమిస్తుంది. ఇక శుక్రవారం ఆలయంలో నిత్యోత్సవం ప్రత్యేక ఆకర్షణ. భక్తులకు పండగే పండగ అన్నట్లు ఉంటుంది. ఆలయంలో నిత్యకళ్యాణం పచ్చ తోరణంలా పూజలు అభిషేకాలు నిర్వహించబడుతుంది. ఓ వైపు స్వామి అమ్మవార్లకు అభిషేకాలతో పాటు రాహుకేతుదోష నివారణ పూజలు, శనీశ్వరునికి ప్రత్యేకాభిషేకాలు, ఇక స్వామి అమ్మవార్లకు నిత్యకల్యాణం, మృత్యుంజయ స్వామికి అభిషేకాలతో పునీతమౌతుంది. గణపతి పూజలు, నవగ్రహ పూజలు, యజ్ఞోపవేత పూజలు, మాంగల్యధారణ కార్యక్రమూలు నిర్వహించారు.

### శివయ్య సేవలో తెలంగాణ జడ్జి



శ్రీకాళహస్తి, జనవరి 2 ప్రభాతవార్త: తెలంగాణ హైకోర్టు జడ్జి జస్టిస్ ప్రవీణ్‌కుమార్ కుటుంబసభ్యులతో రాగా వారికి దక్షిణ గోపురం వద్ద ఆలయ మర్యాదలతో ఎపిఆర్ఓ శ్రీనివాసులు, కోర్టు సిబ్బంది స్వాగతం పలికారు. స్వామి అమ్మవార్ల అలయంలో అంతరాలయ దర్శనం ఏర్పాటు చేసారు. దర్శనానంతరం వారికి మృత్యుంజయస్వామి ఆలయం వద్ద వేదపండితులతో ప్రత్యేకాశీర్వచనాలు అందించారు. స్వామి అమ్మవార్ల చిత్రపటాలను అందించారు.

### బెంగళూరు టు విజయవాడ డ్రగ్స్ కేసులో

## కీలక సూత్రధారి అరెస్ట్

విజయవాడ, జనవరి 2 ప్రభాతవార్త ప్రతినిధి: బెంగళూరు డ్రగ్స్ కేసును చేధించిన విజయవాడ పోలీసులు విక్రయదారుడిని అరెస్ట్ చేశారు. ఇంజినీరింగ్ చదువుతూ చెడు సహవాసాల కారణంగా దారితప్పాడు. డ్రగ్స్‌కు అలవాటు పడి మత్తుకు బానిసయ్యాడు. అదనపు ఆదాయం కోసం మరొకరి వద్ద ఎండీఎంఏ కొనుగోలు చేసి, దానిని అధిక ధరకు విక్రయించడం ప్రారంభించాడు. చివరకు పోలీసులకు దొరికి కటకటాల పాలయ్యాడు. ఇటీవల మాచవరం స్టేషన్ పరిధిలో నమోదైన ఎండీఎంఏ కేసులో బెంగళూరులో డ్రగ్స్ అందజేసిన మహేష్‌ను పోలీసులు అరెస్టు చేశారు. బెంగళూరు వెళ్లిన ప్రత్యేక బృందం బుధవారం తెల్లవారుజామున నిందితుడిని అక్కడ హాస్టల్‌లో అదుపులోకి తీసుకుని విజయవాడకు తరలించారు. అక్కడ డ్రగ్స్ సరఫరాదారులతో సంబంధాలపై పోలీసులు విచారణ చేస్తున్నారు. మహేష్‌రెడ్డి (ఏ4) నుంచి 2 గ్రాముల ఎండీఎంఏ స్వాధీనం చేసుకున్నారు. విజయవాడ మధురానగర్‌కు చెందిన వెంకట జగదీష్ కుమార్, సింగ్‌నగర్ ప్రాంతానికి చెందిన అఖిలేష్ ఇంటర్ తర్వాత చదువు మానేశారు. స్నేహితుల పార్టీల్లో ఎండీఎంఏ అలవాటైంది. దీంతో తరచూ బెంగళూరు వెళ్లి అక్కడ స్నేహితులతో కలిసి తీసుకునేవారు. డిసెంబరు 20న వీరిద్దరూ బెంగళూరులో 19 గ్రాముల డ్రగ్స్ కొనుగోలు చేశారు. జగదీష్‌కు రాజేష్ ఫోన్ చేసి తనకు 2 గ్రాములు ఎండీఎంఏ తీసుకురావాలని కోరాడు. నెల్లూరులో రాజేష్‌కు ఎండీఎంఏ ఇచ్చారు. కారు మొరాయించడంతో అక్కడే వదిలేసి, రాజేష్ కారులో ముగ్గురూ విజయవాడ చేరుకున్నారు. మాచవరం స్టేషన్ పరిధిలోని ఓ హోటల్లో దిగారు. అక్కడ ముగ్గురూ డ్రగ్స్ తీసుకుని మత్తులో మునిగి తేలారు. సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు హోటల్‌పై దాడి చేసి నిందితులను పట్టుకున్నారు. 10గ్రాముల ఎండీఎంఏను స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ పోలీసులు నిందితులను తీసుకుని మాచవరం స్టేషన్లో కారుతో సహా అప్పగించారు. కారును పార్క్ చేసే సమయంలో డోర్ లాక్ పడకపోవడంతో రాజేష్‌కు లాక్ వేయమని పోలీసులు చెప్పడంతో అతను కారు ఎక్కి ఇంజిన్ స్టార్ట్ చేసి రెప్పపాటులో స్టేషన్ నుంచి పరారయ్యాడు. పోలీసులు అప్రమత్తమై ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి బెంగళూరు వెళ్లిన నిందితుడిని అదుపులోకి తీసుకుని విజయవాడకు తరలించారు.

## కూతురిపై తండ్రి అఘాయిత్యం

పెద్దపంజాణి, జనవరి 2 ప్రభాతవార్త: అభంశుభం తెలియని సొంత కుమార్తెపై ఓ కామాంధుడైన తండ్రి వావివరుసలు మరచి అత్యాచారంకు ఒడి గట్టాడు. దీన్ని వారించబోయిన అతని తల్లిని కాళ్లతో తన్ని బాలికను లాక్కెళ్లిన పాశవిక ఘటన పెద్దపంజాణి మండలం పెద్దకాప్పల్లి పంచాయతీ ఎస్టీ కాలనీలో చోటుచేసుకుంది.

పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా.. ఎస్టీ కాలనీలో నివాస ం ఉంటున్న రెడ్డెప్ప కుమారుడు పెద్దప్పకు ఇద్దరు భార్యలు. కాగా గురువారం సాయంత్రం అతని పెద్ద భార్య కుమారె_(12) పెనుగొలకల నుంచి చికెన్ తీసుకుని వసు_ండగా మార్గమధ్యంలో పెద్దబండ ప్రాంతంలో పెద్దప్ప తన కూతుర్ని అడ్డగించి లాకె ళ్లసాగాడు. ఇది గమనించిన పెద్దప్ప తల్లి పార్వతమ్మ అడ్డుపడి ప్రాధేయపడింది. తల్లిని కాళ్లతో తన్ని తన కుమార్తెను లాక్కెళ్లిపోయాడన్నారు. పార్వతమ్మ అరుస్తూ సాయం కోసం బూరుగుల పల్లి ఎస్టీ కాలనీకి వెళ్లింది. అక్కడ ఆమె తన కుమార్తె భువనేశ్వరి, తన అల్లుడు రమేష్‌ను వెంట పెట్టుకుని పరుగులు తీస్తూ పెద్దబండ ప్రాంతం వద్దకు చేరుకున్నారు. అప్పటికే బాలిక ఏడుస్తూ వస్తుండగా బాలికను విచారించగా తన తండ్రి చేసిన దారుణాన్ని చెప్పింది.

ఈ నేపథ్యంలో శుక్రవారం పార్వతమ్మ పెద్దపంజాణి పోలీసులకు ఫిర్యాదు చేసింది. పలమనేరు రూరల్ సిఐ పరశురాముడు నిందితుడిపై పోక్సోతో పాటు పలు సెక్షన్లతో కేసు నమోదు చేసి విచారిస్తున్నారు.

### బంగ్లాదేశ్ నిర్బంధ మత్స్యకారుల విడుదలకు

## కేంద్రం తక్షణ జోక్యం చేసుకోవాలి

### తిరుపతి ఎంపి గురుమూర్తి విజ్ఞప్తి

వెంకటగిరి, జనవరి 2 ప్రభాతవార్త: రాష్ట్రానికి చెందిన తొమ్మిది మంది మత్స్యకారులను బంగ్లాదేశ్ కోస్ట్ గార్డ్ నిర్బంధించిన ఘటనపై కేంద్ర విదేశాంగ శాఖ మంత్రి డా.జైశంకర్‌కు, అలాగే బంగ్లాదేశ్‌లోని భారత హైకమిషనర్ ప్రణయ్ వర్మకు తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి లేఖలు రాసి తక్షణ జోక్యం చేసుకోవాలని కోరారు. విజయనగరం జిల్లాకు చెందిన మత్స్యకారులు గత ఏడాది అక్టోబర్ 21న బంగాళాఖాతంలో పశ్చిమ బెంగాల్ తీరానికి సమీపంలోని మిడ్ సీ ప్రాంతంలో చేపల వేటకు వెళ్లిన సమయంలో అనుకోకుండా సముద్ర సరిహద్దులు దాటిన కారణంగా బంగ్లాదేశ్ కోస్ట్ గార్డ్ సిబ్బంది వారిని వారి మత్స్యకార పడవతో సహా అదుపులోకి తీసుకున్నట్లు ఎంపి లేఖలో ప్రస్తావించారు. ఈ మత్స్యకారులు సంప్రదాయ వృత్తిపై ఆధారపడి జీవనం సాగిస్తున్నవారని, వారి నిర్బంధం కారణంగా కుటుంబాలు తీవ్రమైన మానసిక, ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని తెలిపారు. అంతర్జాతీయ చట్టాలు, మానవతా దృక్పథాన్ని పరిగణనలోకి తీసుకుని తొమ్మిది మంది భారతీయ మత్స్యకారులను వారి పడవతో సహా త్వరితగతిన విడుదల అయ్యేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, అలాగే బంగ్లాదేశ్ లోని భారత హైకమిషన్ బంగ్లాదేశ్ ప్రభుత్వంతో చర్చలు జరపాలని కోరారు.

# కనకదుర్గ ఆలయంలో త్రయాహ్నిక దీక్ష ఆరుద్రోత్సవ కల్యాణోత్సవాలు



ఆరుద్రోత్సవ స్వామి అమ్మవార్ల మూర్తులకు అభిషేకాలు

ఇంద్రకీలాద్రి, జనవరి 2 ప్రభాతవార్త: ఇంద్రకీలాద్రిపై మూడు రోజులపాటు జరిగే ఆరుద్రోత్సవ కల్యాణ ప్రత్యేక పూజలు శుక్రవారం ఉదయం దేవస్థానంలో ప్రారంభమయ్యాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో నటరాజస్వామి ఆలయాలు అరుదు కాగా దైవ ప్రేరేపణతో 1954లో దాతలు ఇంద్రకీలాద్రిపై నటరాజస్వామి వారి ఆలయ నిర్మాణం ప్రారంభించారు. ప్రముఖ పుణ్య క్షేత్రమైన చిదంబరం ఆలయం తరహాలో ఇక్కడ శ్రీ విఘ్నేశ్వరస్వామి, శ్రీ నటరాజస్వామి, శ్రీ శివ కామ సుందరీదేవి, నందీశ్వర, చండీశ్వర విగ్రహాలను చంద్రశిలతో రూపొందించారు. సకల కళలకు ఆద్యుడైన నటరాజఆలయానికి అనుబంధంగా నాట్యమండపం, కల్యాణమండపం అప్పట్లోనే నిర్మించారు. శ్రీ శివకామ సుందరీ సమేత నటరాజస్వామి వార్ల ఆరుద్రోత్సవ కళ్యాణం పురస్కరించుకొని ఈరోజు ఉదయం 8 గంటలకు శ్రీ శివ కామ సుందరీ సమేత నటరాజస్వామివార్లకు మంగళస్నానాలు, వధూవరులుగా అలంకరణ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక పూజల్లో ఆలయ కార్యనిర్వాహణాధికారి వికె శీనానాయక్, నటరాజ స్వామి ఆలయ నిర్మాణదాతలు చెన్నాప్రగఢ కోటంరాజు వంశీకులు లీల నాగేశ్వరి దంపతులుఆలయ ప్రధాన అర్చకులు లింగంబొట్ల దుర్గా ప్రసాద్, ఉపప్రధాన అర్చకులు కోట ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

– త్వరలో మారిషష్ అధ్యక్షులు రాక

ఇంద్రకీలాద్రి పై కొలువైన శ్రీ కనకదుర్గ అమ్మవారి దర్శనం కోసం ఈ నెల రెండవవారంలో మారిషష్ దేశ అధ్యక్షులు ధరమ్‌బీర్ గోకుల్ వస్తున్న సందర్భంగా ఈవో వికె శీనానాయక్ ఛాంబర్‌లో ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించారు. సెక్యూరిటీ వింగ్ డిసిపి ఎస్‌విడి ప్రసాద్, ఎడిసిపి జి.రామకృష్ణ, రెవిన్యూ, వైద్య, ఆరోగ్య, మున్సిపల్ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ప్రతి పౌర్ణమి రోజున నిర్వహించే ఇంద్రకీలాద్రి గిరి ప్రదక్షిణ ప్రత్యేక ఆధ్యాత్మిక వైభవంతో 3వ తేదీ శనివారము ఉదయం 5:55 నిమిషములకు ప్రారంభమవుతుంది. ఘాట్ రోడ్ ప్రవేశ ద్వారం వద్ద ఉన్న శ్రీ కామధేను అమ్మవారి ఆలయం నుండి గిరి ప్రదక్షిణ మొదలవుతుంది. భక్తులందరూ ఈ కార్యక్రమంలో పాల్గొనాలని ఆలయ కమిటీ విజ్ఞప్తి చేసింది.



ఆలయాధికారులతో సమావేశంలో ఆలయ ఈవో

## ఇంటర్ విద్యార్థుల తల్లిదండ్రుల మొబైల్స్‌కు హాల్‌టికెట్ ప్రివ్యూ

### తప్పులను సరిచేసుకోవడానికి అవకాశం

### ఆ వివరాలను ప్రిన్సిపాల్స్ దగ్గర సవరించుకోవచ్చు

### నేటి నుంచి పంపనున్న ఇంటర్ బోర్డు

**హైదరాబాద్, జనవరి 2, ప్రభాతవార్త:** ఫిబ్రవరి 25 నుంచి జరగనున్న ఇంటర్ వార్షిక పరీక్షలతోపాటు, ఫిబ్రవరి 2 నుంచి జరగనున్న ప్రాక్టికల్ పరీక్షలకు సంబంధించిన హాల్ టికెట్ల ప్రివ్యూను ఇంటర్ బోర్డు విద్యార్థుల తల్లిదండ్రుల మొబైల్ నంబర్లకు పంపించనుంది. విద్యార్థుల తల్లిదండ్రుల రిజిస్టర్ మొబైల్ నంబర్లలో వాట్సాప్ ఉన్న నంబర్లకు వారి పిల్లలకు సంబంధించిన హాల్ టికెట్ల ప్రివ్యూను పంపించనున్నారు. ఈ ప్రివ్యూను నేటి(శనివారం) నుంచే పంపించనున్నట్టు ఇంటర్ బోర్డు పరీక్షల నియంత్రణాధికారి (సీవోఈ) జయప్రదబాయి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులకు పంపిన హాల్ టికెట్స్ ప్రివ్యూలో విద్యార్థికి సంబంధించిన వివరాలను చెక్‌చేసకోవాలని సూచించారు. వివరాల్లో ఏమైనా తప్పులుంటే వెంటనే సంబంధిత ప్రిన్సిపాల్‌ను సంప్రదించి సరిచేసుకోవాలని సూచించారు. మొదటి సంవత్సరం విద్యార్థుల హాల్ టికెట్స్ ప్రివ్యూ రావాలంటే ఆ విద్యార్థి ఎస్ఎస్‌సి రోల్ నంబర్, పుట్టిన తేదిని ఎంటర్‌చేయడం ద్వారా హాల్‌టికెట్ ప్రివ్యూను చూసుకోవచ్చని తెలిపారు. సెకండియర్ విద్యార్థులకు సంబంధించి ఆ విద్యార్థి మొదటి సంవత్సరం హాల్ టికెట్, పుట్టిన తేది ఎంటర్ చేస్తే సెకండియర్ హాల్ టికెట్ ప్రివ్యూ చూసుకోవచ్చని తెలిపారు. సెకండియర్ విద్యార్థులకు సంబంధించి ఆ విద్యార్థి మొదటి సంవత్సరంలో పాసైన సబ్జెక్టులు, ఫెయిలైన సబ్జెక్టులతోపాటు ఆయా పరీక్షల టైం టేబుల్ వివరాలు ఉంటాయని పేర్కొన్నారు. ఈ నెల 21న ఇంటర్ మొదటి సంవత్సరం ఇంగ్లీష్ ప్రాక్టికల్ పరీక్ష, 22న సెకండియర్ విద్యార్థులకు ఇంగ్లీష్ ప్రాక్టికల్ పరీక్ష, ఎథిక్స్ అండ్ హ్యూమన్ వాల్యూస్ పరీక్ష (బాక్ లాగ్ విద్యార్థులకు) ఈ నెల 23, 24 తేదిల్లో నిర్వహించనున్నారు. ఫిబ్రవరి 2 నుంచి 21 వరకు ప్రాక్టికల్ పరీక్షలను నిర్వహించనున్నారు. చాలా మంది తల్లిదండ్రుల వద్ద స్మార్ట్‌ఫోన్‌లు ఉండటంతో, హాల్ టికెట్లను సకాలంలో పొందడం, లోపాలను ముందుగానే గుర్తించడం, విద్యార్థులు, తల్లిదండ్రులు, కళాశాలలు, జిల్లా అధికారుల మధ్య సమన్వయాన్ని మెరుగుపరచడం కోసం ఈ వాట్సాప్ ఆధారిత కమ్యూనికేషన్ వ్యవస్థను ఇంటర్ బోర్డు ప్రవేశపెట్టింది.

## శాంతియుత నిరసనకారులపై కాల్పులు జరపొద్దు

### ఇరాన్‌కు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వార్నింగ్

### మీ జోక్యం అనవసరం.. తిప్పికొట్టిన సుప్రీం లీడర్



**వాషింగ్టన్, జనవరి 2:** అమెరికా అధ్యక్షుడు డొ నాల్డ్ ట్రంప్ ఇరాన్‌కు గట్టి హెచ్చరికలు జారీ చేశారు. ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న ఇరాన్ లో నిరసనకారులపై అక్కడి భద్రతాదళాలు వ్యవహరిస్తున్న తీరు పై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. శాంతియు తంగా నిరసన చేపడుతున్న వారిపై కాల్పులు జరప వద్దని, అలాంటి వారిని అమెరికా కాపా డుతుందని అన్నారు. శాంతి యుతంగా ఆందోళన జరుపుతున్న వారిని లక్ష్యంగా చేసుకుంటే అమెరికా చూస్తూ ఊరుకోదని ఆయన అన్నారు. అమెరికా అన్నింటికీ సిద్ధంగా ఉందని ఆయన అన్నారు. ట్రంప్ హెచ్చరికలను ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీఖమేనీ సీనియర్ సలహా దారుడు అలీ లారిజాని తిప్పికొట్టారు. ఈ వ్యవ హారంలో అమెరికా జోక్యం అవసరం లేదని ఘాటుగా వ్యాఖ్యా నించారు. అమెరికా జోక్యం చేసుకుంటే ఆ ప్రాంత మంతా ఘర్షణలకు దారితీస్తుందని వ్యాఖ్యా నించారు. తమ జాతీయ భద్రత రెడ్‌లైన్ వంటిదని, దీనిని పరీక్షించాల నుకోవడం సాహసమే అవు తుందని అన్నారు. దేశంలో ధరలు పెరగడంతో పాటు కరెన్సీ విలువ పడిపోయింది. ఇరాన్ ఆర్థిక పరిస్థితి క్షీణించింది. దీంతో దేశంలో ఆందోళనలు కొనసాగుతున్నాయి. పలు ప్రాంతాల్లో నిరసనకారులు పోలీసుల కార్లకు నిప్పంటించారు. పలు ప్రాంతాల్లో భద్రతా దళాలు కాల్పులు జరపడంతో పలువురు ప్రాణాలు కోల్పోగా, అనేకమంది గాయపడ్డారు.

## మావోయిస్టు అగ్రనేత బర్సెదేవా లొంగుబాటు

### హిడ్మాకు అత్యంత సన్నిహితుడు

### 15 మంది సహచరులతో కలిసి లొంగిపోయిన దేవా



బర్సెదేవా (ఫైల్)

**హైదరాబాద్, జనవరి 2, ప్రభాతవార్త:** మావోయిస్టు పార్టీకి మరో ఎదురుదెబ్బ తగిలింది. ఆ పార్టీ అగ్రనేత పిఎల్‌జిఎ (పీపుల్స్ లెబరేషన్ గెరిల్లా ఆర్మీ) బెటాలియన్ కమాం డెంట్‌గా వున్న బర్సెదేవా తన సహచరులు 15 మందితో ఆయుధాలతో సహా తెలంగాణ పోలీసులకు లొంగి పోయారు. ఎపిలో ఇటీవల ఎన్‌కౌంటర్‌లో మరణించిన మా వోయిస్టు అగ్రనేత, పిఎల్‌జిఎ కీలకనేత హిడ్మాకు దేవా అత్యంత సన్నిహితుడు. వీరిద్దరిది ఛత్తీస్‌గఢ్ లోని బీజాపూర్ జిల్లా పూవర్తి గ్రామం సొంతవూరు. మావోయిస్టు పార్టీలో హిడ్మా తరువాత దేవా ఆ స్థాయికి ఎదిగిన నేత. రెండేళ్ల క్రితం హిడ్మా, దేవాల కలిసి పనిచేశారు. ఇద్దరు కలిసి అనేక ఆపరేషన్లను నిర్వహించారు. పోలీసులపై జరిగిన అనేక దాడుల్లో వీరిద్దరు ముఖ్య పాత్ర వహించారు. దేవాపై 50 లక్షల రూపాయల రివార్డు వుంది. 2013లో ఝీరాం ఘాటి దాడి సహా భద్రతా బలగాలపై జరిగిన పలు దాడుల్లో దేవా నేరుగా పాల్గొన్నాడని పోలీసులు చెబుతున్నారు. నక్సలైట్లకు ఆయుధాలను సరఫరా చేయడంలో దేవాది ప్రధాన పాత్ర. గత నెల 19న 41 మంది మావోయిస్టులు భారీగా ఆయుధాలతో డిజిపి ఎదుట లొంగిపోవడం తెలిసిందే. దీని తరువాత మరోసారి పెద్దఎత్తున నక్సల్స్ లొంగిపోవడం గమనార్హం. దీనిపై శనివారం పోలీసు శాఖ అధికారికంగా ప్రకటన చేయనుంది.

## న్యూఢిల్లీలో రసఝరి అంతర్జాతీయ నృత్యోత్సవం

### వర్సిటీ విసి ఆచార్య వెలుదండ నిత్యానందరావు

**హైదరాబాద్ (నాంపల్లి), జనవరి 2, ప్రభాతవార్త :** భారతీయ శాస్త్రీయ నృత్య సంప్రదాయల పరిరక్షణ, ప్రచారం లక్ష్యంగా సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో రసఝరి అంతర్జాతీయ నృత్యోత్సవం 2026ను న్యూఢిల్లీలోని గోదావరి ఆడి టోరియం, ఆంధ్ర అసోసియేషన్, లోధీరోడ్‌లో ఈ నెల 3, 4 తేదీల్లో రెండు రోజుల పాటు నిర్వహించ నున్నట్లు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షుడు ఆచార్య వెలుదండ నిత్యానంద రావు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ భాషా సాంస్కృతికశాఖ సహకారంతో ఆంధ్ర అసోసియేన్ ఢిల్లీ, తెలుగు విశ్వవిద్యా లయం సంయుక్త నిర్వహణలో జరగనున్న ఈ నృత్యోత్సవంలో కూచిపూడి, ఆంధ్ర నాట్యం, భరతనాట్యం, కథక్, ఒడిస్సీ, మణిపురి, మోహినీయాట్టం, పేరిణి, మయూర భంజ్, ఛౌ తదితర భారతీయ శాస్త్రీయ నృత్య రూపాల ప్రదర్శనలు, ఉపన్యాస- ప్రదర్శనలు నిర్వహించనున్నట్లు తెలిపారు. దేశ నలుమూలల నుండి సంగీత నాటక అకాడమీ, పద్మశ్రీ అవార్డు గ్రహీతలైన ప్రముఖ గురువులతోపాటు అమెరికా, కెనడా, లండన్‌ల నుండి పలువురు ప్రముఖ నృత్యకళాకారులు ఈ ఉత్సవంలో పాల్గొన నున్నారని ఆయన వివరించారు. జనవరి 3న ఉత్సవ ప్రారంభోత్సవానికి తెలంగాణ రాష్ట్ర బిజెపి అధ్యక్షుడు ఎన్.రామచందర్ రావు, జనవరి 4న జరిగే ముగింపు కార్యక్రమానికి మల్కాజ్‌గిరి ఎంపి ఈటల రాజేందర్ ముఖ్యఅతిథిగా విచ్చేయ నున్నట్లు, కేంద్ర ప్రభుత్వ సాంస్కృతిక మంత్రిత్వ శాఖ అధికారులతోపాటు తెలంగాణ ప్రభుత్వ భాషా సాంస్కృతికశాఖ సంచా లకుడు డా. ఏనుగు నరసింహారెడ్డి, ఆంధ్ర అసోసియేషన్ అధ్యక్షుడు సత్యనారాయణ, కార్యదర్శి మాచిరాజు లహరి తదితరులు విశిష్ట అతిథులుగా పాల్గొం టారని విశదీకరించారు. ఈ నృత్యోత్సవంలో అనేక అంశాలతో ప్రత్యేక నృత్య ప్రదర్శనలతో పాటు గురుసత్కార కార్యక్రమం నిర్వహించ నున్నట్లు విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య కోట్ల హనుమంతరావు వెల్లడించారు. భారతీయ శాస్త్రీయ నృత్యవారసత్వాన్ని భవిష్యత్ తరాలకు అందించడమే ఈ ఉత్సవ ప్రధాన లక్ష్యమని, కళాభిమానులు, పరిశోధకులు, విద్యార్థులు పెద్దసంఖ్యలో హాజరై ఈ రెండురోజుల రసఝరి నృత్యోత్సవాన్ని విజయవంతం చేయాలని ఉత్సవ కోఆర్డినేటర్ డా. వనజ ఉదయ్ కోరారు.

## కృష్ణా జలాలపై బిఆర్ఎస్ ప్రచారాన్ని తిప్పికొట్టండి

### మహబూబ్‌నగర్ ప్రజాప్రతినిధులతో సిఎం రేవంత్ సమావేశం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి 2:** కృష్ణా జలాల విషయంలో బీఆర్ఎస్ చేస్తున్న అబద్ధపు ప్రచారాన్ని తిప్పికొట్టాలని ఉమ్మడి మహబూబ్‌నగర్ ప్రజాప్రతినిధులకు సీఎం రేవంత్ రెడ్డి దిశానిర్దేశం చేశారు. బీఆర్ఎస్ పాలనలో ఏం జరిగిందో బయట పెట్టాలని వారికి సూచించారు. కృష్ణాజలాల్లో వాటా తగ్గడం వల్ల జరిగిన నష్టాన్ని వివరించాలన్నారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుపై ఉమ్మడి మహబూబ్‌నగర్ ప్రజాప్రతి నిధులకు ఆయన పలు సూచనలు చేశారు. శుక్రవారం అసెంబ్లీలో సిఎంను ఆయన ఛాంబర్‌లో కలిశారు. కృష్ణాజలాలపై పూర్తిస్థాయిలో అవగాహన పెంచుకోవాలని సూచించారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుకు కేసీఆర్ కేసీఆర్ ఏడేళ్ల వరకు డీపీఆర్ సమర్పించలేదని, డీపీఆర్ లేకుండానే రూ.27 వేల కోట్లు ఖర్చు చేశారని సీఎం రేవంత్ రేవంత్ రెడ్డి గురువారం ఆరోపించిన విషయం తెలిసిందే. ఇందువల్ల పర్యావరణ అనుమతులు కూడా రాలేదని, అనుమతులు లేని ప్రాజెక్టులు నిర్మిస్తున్నారన్నారని పాలమూరు రంగారెడ్డిపై కేసులు వేశారని విమర్శించారు. తెలుగు రాష్ట్రాల మధ్య జల వివాదం సృష్టించి, తద్వారా లబ్ధి పొందాలని భారత రాష్ట్ర సమితి అధినేత కె. చంద్రశేఖర్ ప్రయత్నిస్తున్నారని రేవంత్‌రెడ్డి ధ్వజమెత్తారు.

## విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తున్న బిజెపి

### పార్లమెంట్‌లో విబిఎస్ఎ బిల్లు సిగ్గుచేటు

### ఎఐఎస్ఎఫ్ జాతీయ ఉపాధ్యక్షుడు ఎన్ఎ స్టాలిన్

**హైదరాబాద్, జనవరి 2, ప్రభాతవార్త:** కేంద్రంలో అధికారంలో ఉన్న ఎన్డీఎ బిజెపి ప్రభుత్వం విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తుందని అఖిల భారత విద్యార్థి సమాఖ్య(ఏఐఎస్ఎఫ్) జాతీయ ఉపాధ్యక్షులు ఎన్ఏ స్టాలిన్ విమర్శించారు. అందులో భాగంగానే నూతన జాతీయ విద్యావిధానంను తీసుకువచ్చి పార్లమెంట్‌లో వికాసిత్ భారత్ శిక్షా అధిష్ఠాన్(విబిఎస్ఏ) బిల్లు 2025ని ప్రవేశపెట్టిందని మండిపడ్డారు. వెంటనే వికాసిత్ భారత్ శిక్షా అధిష్ఠాన్ (విబిఎస్ఏ) బిల్లు 2025ను ఉపసంహరించు కోవాలని డిమాండ్ చేశారు. శుక్రవారం హిమాయత్‌నగర్‌లోని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో సంఘం జిల్లాల అధ్యక్ష, కార్యదర్శుల సమావేశం ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠ రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఏఐఎస్ఎఫ్ జాతీయ ఉపాధ్యక్షులు ఎన్ఎ స్టాలిన్ హాజరై మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభు త్వాలు విద్యారంగంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించకుండా కొత్త సమస్యలను సృష్టిస్తూ భ్రష్టు పట్టిస్తున్నా రని విమర్శించారు. విద్యా రంగం సమస్యలను పరిష్కరించడంలో పాలక వర్గాలకు ఎలాంటి చిత్తశుద్ధి లేదనే విషయం వారి పాలనలోనే అర్థం అవుతుం దన్నారు. ప్రభుత్వ విద్యను పూర్తిగా నిర్వీర్యం చేసి పేద, మధ్య తరగతి వర్గాలకు విద్యను పూర్తిగా దూరం చేసే కుట్ర అమలు చేస్తున్నారని.. అందులో భాగంగా కేంద్రంలో నూతన జాతీయ విద్యావిధానం-2020 పేరుతో విద్య కార్పొరేటికరణ, విద్య కేంద్రీకరణ, కాషాయికరణ చేయాలని చూస్తుందని విమర్శించారు. పార్లమెంట్‌లో ప్రవేశ పెట్టిన విబిఎస్ఏ బిల్లు.. సమాఖ్య నిర్మాణం, ప్రజాస్వామ్య, యూనివర్సిటీల స్వయం ప్రతిపత్తి, దేశ ఉన్నత విద్యా వ్యవస్థ లౌకిక, శాస్త్రీయ స్వభావాలను దెబ్బ తీసే విధంగా ఈ బిల్లు ఉందన్నారు. యూనివర్శిటీ గ్రాంట్స్ కమీషన్ (యూజిసి) ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఏఐసిటిఇ)తో సహా ప్రస్తుతం ఉన్న రెగ్యులేటరీ ఆర్కిటెక్చర్‌ను రద్దు చేయాలని విబిఎస్ఏ బిల్లు ప్రతిపాది స్తుందని, దాని స్థానంలో పూర్తిగా కేంద్ర ప్రభుత్వంచే నియంత్రించబడే ఏకైక, అత్యంత కేంద్రీకృత ఒకే కమిషన్‌ను ఏర్పాటు చేస్తుందన్నారు.

## ప్రజల నమ్మకం గెలుచుకొన్న కాంగ్రెస్ పాలన

### పిసిసి చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్

**హైదరాబాద్, జనవరి 2, ప్రభాతవార్త:** ప్రజల నమ్మకం గెలుచుకొన్న కాంగ్రెస్ పాలన వైఖరీతో తెలంగాణలో ఎంతో మంది నాయకులు ప్రజలు పార్టీలో చేరేందుకు స్వచ్ఛందంగా ముందుకు వస్తున్నారని టిపిసిసి చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్ అన్నారు. శుక్రవారం గాంధీ భవన్‌లో మహబూ బాబాద్ నియోజకవర్గానికి చెందిన పలువురు ప్రముఖ నాయకులను టిపిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ సమక్షంలో పార్టీ కండువా కప్పి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు. దేశంలో లౌకిక విలువలు సమన్యాయంతో పనిచేసే పార్టీ కాంగ్రెస్ మాత్రమే అని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని మరింత బలోపేతం చేయడమే తమ లక్ష్యమని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో కేసముద్రం మార్కెట్ మాజీ చైర్మన్, రాష్ట్ర ముదిరాజు కార్యదర్శి నీలం సుహాసిని దుర్గేష్, ఎంఐపిఎ రాష్ట్ర అధ్యక్షులు పులి దేవేందర్, సర్పంచ్ దొంతర బోయిన నరేష్, సారంపల్లి దేవేంద్ర మోహన్ రెడ్డి (సర్పంచ్), సర్పంచ్ దారావత్ కైక, మాజీ ఎంపిటిసి రవి నాయక్, మూడవత్ బుజ్జీ శంకర్, వాళ్ళందాసు రవి, రడం శ్రీను, తుంపిల్ల వెంకన్న, కొలిపాక బాబు, సంకెపల్లి శ్రీనివాస్ రెడ్డి, కాంపటి వీరయ్య, యాకుబ్ రెడ్డి, కొప్పుల వెంకట్ రెడ్డి, పోరెడ్డి రాం రెడ్డి, పాశం రాం రెడ్డి, పుచ్చకాయల వెంకట్ రెడ్డి, కముటం స్వామి, కముటం శ్రీను, కముటం శ్రీధర్, కముటం పెద్ద కుమార్ స్వామి, రడం చిన్న వెంకన్న, కొలిపాక శ్రీను, నీలకుర్తి కళ్యాణ్ రెడ్డి, బొల్లా రాజాలు, శ్రీశైలం, నారాయణ, బొల్లా చిన్న దూడన్న, కీర్తి సంపత్, శీలం సత్యానా రాయణ, పరికిపండ్ల అశోక్ పార్టీలో చేరారు.

## ఆదిలాబాద్‌లో ఈగల్ పోలీసుల దాడులు

### గంజాయి స్మగ్లర్‌ను పట్టించిన జాగిలం

**హైదరాబాద్, జనవరి 2, ప్రభాతవార్త:** ఆదిలాబాద్ పట్టణంలో ఈగల్ పోలీసులు శుక్రవారం ఉదయం పలుచోట్ల ఆకస్మిక తనిఖీలు చేయగా ఒక యువకుడు గంజాయి ప్యాకెట్లతో దొరికి పోయాడు. పట్టణ పరిధిలోని వినాయక్ చౌక్ వద్ద ఈ ఘటన జరిగింది. పట్టుబడ్డ వ్యక్తిని సాహిల్ అహ్మద్(38)గా గుర్తించారు. నిందితుడు స్థానిక ధన్‌గర్ మొహల్లాకు చెందిన వాడుగా తేలింది. నిందితుడిని వెంటనే గంజాయితో పాటు ఆదిలాబాద్ వన్ టౌన్ పోలీసులకు అప్పగించారు. కాగా ఈ కేసులో ఈగల్ పోలీసు విభాగానికి చెందిన జాగిలం కీలకంగా వ్యవహ రించింది. సాహిల్ అహ్మద్ వద్ద గంజాయి ప్యాకెట్లు వున్న విషయాన్ని ముందుగా ఈగల్ జాగిలం గుర్తించింది. అనంతరం అతను పారిపోతుండగా జాగిలం వెంటాడి పట్టుకుంది.

**మాదకద్రవ్యాలను గుర్తించేందుకు 38 జాగిలాలను వాడుతున్న ఈగల్**

మాదకద్రవ్యాలను గుర్తించేందుకు ఈగల్ పోలీసులు జాగిలాల సేవలను వాడుతున్నారు. మొత్తం మీద 38 శిక్షణ పొందిన జాగి లాలను ఈగల్ బృందం వాడుతోంది. దేశంలో డ్రగ్స్‌ను పట్టుకునేందుకు ఇన్ని జాగిలాలను వాడుతున్న రాష్ట్రం తెలంగాణ కావడం గమనార్హం. కా గా ఇందులో హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో అత్యధికంగా ఐదు, రామగుండం, వరంగల్, సైబరాబాద్ కమిషనరేట్లతో పాటు కొత్తగూడెం జిల్లా లలో రెండేసి జాగిలాలు, మిగతా అన్ని కమిషనరేట్లు, జిల్లా పోలీసు విభాగాల వద్ద ఒక్కో జాగిలం వుంది. ఈ జాగిలాలకు మాదకద్రవ్యాలను పసి గట్టడంలో మొయినాబాద్‌లోని పోలీసు జాగిలాల శిక్షణ కేంద్రంలో శిక్షణనిస్తారు. అనంతరం వీటిని ఆయా జిల్లాల పోలీసు విభాగాలకు పంపుతారు. గత ఏడాది వరంగల్‌లో ఓ ఇంటి టెర్రస్ పైన ఓ వ్యక్తి పూల కుండీలో గంజాయి మొక్క సాగు చేస్తున్న విషయాన్ని ఈగల్ జాగిలం గుర్తించింది. మరో ఘటనలో కాజీపేట్ రైల్వే స్టేషన్‌లో ఓ ప్రయాణీకుడు తన సంచీలో నాలుగు కిలోల గంజాయిని తరలిస్తుండగా జాగిలం గుర్తించి నిందితుడిని పట్టించింది.

## పార్టీ మనుగడ సాగించాలంటే అసెంబ్లీకి కెసిఆర్ రావాల్సిందే

### మండలి చైర్మన్‌ను కలిసిన కల్వకుంట్ల కవిత



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి 2:** ప్రస్తుతం జరగుతున్న అసెంబ్లీ సమావేశాల్లో కేసీఆర్ పాల్గొనా లని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత కోరారు. అసెంబ్లీ వేదికగా ప్రస్తుత రాజకీయ పరిణామాలపై బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ స్వయంగా వచ్చి మాట్లాడితేనే బాగుంటుందని కవిత అభిప్రాయపడ్డారు. కృష్ణా జలాలపై కేసీఆర్ మాట్లాడి.. అధికార పక్షం నోరు మూయించాలని చెప్పారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ లీడర్లను మరోసారి టార్గెట్ చేశారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టులో అక్రమాలకు పాల్పడిన వారిని డిప్యూటీ ఫ్లోర్ లీడర్‌గా చేయడం అన్యాయమని.. హరీశ్ రావును ఉద్దేశించి విమర్శించారు. బీఆర్ఎస్‌లో బబుల్ షూటర్లకే డిప్యూటీ ఫ్లోర్ లీడర్‌కు పదవులు ఇచ్చారని ఘాటు వ్యాఖ్యలు చేశారు. పార్టీ మనుగడ సాగించాలంటే కేసీఆర్ అసెంబ్లీకి రావాలన్నారు. పిల్ల కాకులకేం తెలుసు.. నదీ జలాల విషయాన్ని పిల్లకాకులకు వదిలేయవద్దని.. బీఆర్ఎస్ నేతలను ఉద్దేశించి కల్వకుంట్ల కవిత అన్నారు. అంతేకాకుండా ఆర్థిక శాఖలో ఒక్కో ఫైల్ 9 నెలలుగా పెండింగ్‌లో ఉందని విమర్శించారు. ప్రభుత్వం తన చేతగాని తనాన్ని కప్పిపుచ్చుకునేందుకు బీఆర్ఎస్‌పై నిందలు వేస్తున్నారని మండి పడ్డారు. ఆంధ్రప్రదేశ్ నాయకులు శాశ్వతంగా తెలంగాణ నీళ్లు ఎత్తు కెళ్లాలని చూస్తున్నారని.. ఆంధ్ర నేతలకు ఉన్న ఐక్యత తెలంగాణలో లేదని కవిత ఘాటుగా విమర్శించారు. ఇక భవిష్యత్తులో తెలంగాణ జాగృతి మళ్లీ యాక్టివ్ అయితే.. బీఆర్ఎస్‌కు గడ్డుకాలం తప్పదని వార్నింగ్ ఇచ్చారు. అందుకే పార్టీని కాపాడుకోవాల్సిన బాధ్యత కేసీఆర్‌పైనే ఉందని తేల్చి చెప్పారు.

**అందుకే అసెంబ్లీకి వచ్చాను..**

కాగా, తాను ఎమ్మెల్సీ పదవికి సెప్టెంబర్ 3వ తేదీనే రాజీనామా లేఖ సమర్పించానని చెప్పిన కవిత.. దాన్ని ఆమోదించాలని మండలి చైర్మన్‌ను కోరేందుకు అసెంబ్లీకి వచ్చానని చెప్పారు. మండలిలో చివరిసారిగా మాట్లాడేందుకు అనుమతి కోరానని తెలిపారు.

## నేటి నుంచి టెట్-2026 పరీక్షలు

### 15 నిమిషాల ముందుగానే గేట్లు మూసివేత

### 9 రోజులపాటు 15 సెషన్స్‌లో పరీక్షల నిర్వహణ

### 18 జిల్లాల్లో 97 పరీక్షా కేంద్రాల ఏర్పాటు

**హైదరాబాద్, జనవరి 2, ప్రభాతవార్త:** రాష్ట్రంలో జరగనున్న ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్) పరీక్షలు నేటి(శనివారం) నుంచి ప్రారంభం కానున్నాయి. పరీక్షలను రెండు సెషన్‌లలో నిర్వహించనున్నారు. 15 నిమిషాల ముందుగానే పరీక్షా కేంద్రాల గేట్లు మూసివేయ నున్నారు. అభ్యర్థులు పరీక్ష కేంద్రాలకు 15 నిమిషాల ముందుగానే చేరుకోవాలని అధికారులు స్పష్టం చేశారు. నేటి నుంచి ఈ నెల 20 వరకు పరీక్షలు కొనసాగనున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా 18 జిల్లాల్లో 97 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు అధికారులు తెలిపారు. పరీక్షా కేంద్రాలను ఆదిలాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, హనుమకొండ, హైదరా బాద్, జగిత్యాల, కరీంనగర్, ఖమ్మం, మహబూబ్ నగర్, మెదక్, మేడ్చల్ మల్కాజిగిరి, నల్గొండ, నిజామాబాద్, పెద్దపల్లి, రంగారెడ్డి, సిద్దిపేట, సూర్యాపేట, వరంగల్, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో ఏర్పా టు చేశారు. డిసెంబర్ 27 నుంచి హాల్ టికెట్ల ను విడుదల చేసిన నేపథ్యంలో పరీక్షలకి దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల్లో 90 శాతానికిపైగా అభ్యర్థులు తమ హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకున్నారు.

టెట్-2026 కోసం రాష్ట్ర వ్యాప్తంగా 2,37,754 దరఖాస్తులు వచ్చాయి. ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులు కూడా టెట్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. టెట్ పరీక్షల కోసం రాష్ట్ర వ్యాప్తంగా 2,37,754 దరఖాస్తులు వచ్చాయి. టెట్ దరఖాస్తుల్లో ఇప్పటికే ఉపాధ్యాయ వృత్తిలో ఉన్న వారి నుంచి 71,670 దరఖాస్తులు వచ్చాయి. ప్రభుత్వ స్కూల్స్‌లో పనిచేస్తున్న వారు 49,236 మంది టెట్-2026 పరీక్ష కోసం దరఖాస్తు చేసుకున్నారు.

పేపర్-1కి 85,538 దరఖాస్తులు రాగా, పేపర్-2కి 1,52,216 దరఖాస్తులు వచ్చాయి. టెట్ పరీక్షల్లో భాగంగా జనవరి 3, 4, 5, 6, 8, 9, 11 తేదిల్లో మేజర్ పరీక్షలు జరగనుండగా జనవరి 19, 20 తేదిల్లో మైనర్ పరీక్షలు జరగనున్నాయి. పరీక్షలను ఉదయం సెషన్ 9 గంటల నుంచి 11.30 గంటల వరకు, మధ్యాహ్నం సెషన్ పరీక్షలను 2 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు రెండు సెషన్‌లలో నిర్వహిస్తారు. ఉదయం పరీక్షలకి 8.45 గంటలకు గేట్లను మూసే యనుండగా.. మధ్యాహ్నం సెషన్‌లో 1.45 గంటలకు క్లోజ్ చేయనున్నారు. పరీక్షల ఫలితాలను ఫిబ్రవరి రెండో వారంలో విడుదల చేయనున్నారు.

పరీక్షల కోసం అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాలో అత్యధికంగా 24 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయగా.. 72,295 మంది పరీక్షలకు హాజరు కానున్నాయి. అయితే ఎక్కువ మంది మాత్రం రంగారెడ్డి జిల్లాలో పరీక్షలకు హాజరు కానున్నట్టు పాఠశాల విద్య డైరక్టర్, టెట్ ఛైర్మన్ నవీన్ నికోలస్ తెలిపారు. రంగారెడ్డి జిల్లాలో 21 పరీక్షా కేంద్రాల్లో అత్యధికంగా 77,790 మంది అభ్య ర్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. మొత్తం 97 పరీక్షా కేంద్రాల్లో 2,37,754 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరుకానున్నట్టు తెలిపారు.

## వ్యాపారి అరెస్టు... రివాల్వర్ సీజ్



**హైదరాబాద్, జనవరి 2, ప్రభాతవార్త:** పాతబస్తీలోని హుస్సేని ఆలం పరిధిలో గల కిల్వత్‌కు చెందిన ఓ వ్యాపారి ఇరుగు పొరుగు వారిని బెదిరిం చేందుకు అక్రమంగా ఆయుధాన్ని ఖరీదు చేసిన ఉదంతమిది. సదరు వ్యాపారిని సిసిఎస్, హుస్సేని ఆలం పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. దీ నికి సంబంధించిన వివరాలను సిసిఎస్ డిసిపి శ్వేత మీడియాకు వెల్లడించారు కిల్వత్‌కు చెందిన అంజాద్ ఖాన్ (29) కొంతకాలం సౌదీ అరేబియా లో వుండి ఎనిమిది నెలల క్రితం భారత్‌కు వచ్చాడు. అక్కడ సంపాదించిన సొమ్ముతో చార్మినార్ వద్ద వ్యాపారం మొదలు పెట్టాడు. ఇంతవరకు బా గానే వున్నా ఇతను తనకు తెలిసిన ఓ మధ్యవర్తి అమిత్ (ఇతను బిహెచ్‌ఈఎల్‌కు చెందిన వాడు) సహకారంతో మధ్యప్రదేశ్‌కు చెందిన అవినాష్ అ లియాస్ కల్లు అనే ఆయుధ వ్యాపారి నుంచి 80 వేల రూపాయలకు 0.7 పిస్టల్‌ను కొన్నాడు. దీనిని తన వద్ద భద్రంగా వుంచుకున్న అంజాద్ ఖా న్ కొన్ని రోజులుగా ఇరుగు పొరుగువారిని తాను చెప్పినట్లు వినాలని, తనకు ఎదురు మాట్లా డకూడదని ఈ ఆయుధంతో బెదిరిస్తున్నాడు. దీనిపై సమాచారం అందుకున్న సిసిఎస్, హుస్సేని ఆలం పోలీసులు శుక్రవారం ఉదయం అంజాద్ ఖాన్ ఇంటిపై దాడిచేసి సదరు అక్రమ ఆయుధాన్ని జప్తు చేశారు. ఆయు ధంతోపాటు ఒక సెల్‌ఫోన్‌ను కూడా స్వాధీనం చేసుకున్నారు. అతన్ని విచారించగా అమిత్, అవినాష్‌ల పేర్లు వెలుగుచూశాయి. ఈ కేసులో అమిత్, అవినాష్‌ల కోసం గాలిస్తున్నారు.

# డబ్ల్యూపిఎల్‌లో.. అత్యధిక రన్స్ చేసిన ప్లేయర్స్



నాట్ స్కైవర్‌బ్రంట్



ఎల్లీస్ పెర్రీ



మెగ్ లానింగ్



షఫాలీ వర్మ




హర్మన్‌ప్రీత్ కౌర్

**న్యూఢిల్లీ:** ఉమన్స్ ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపిఎల్)-2026 ఈ నెల 9న ప్రారంభమవుతుంది. టోర్నమెంట్ తొలి మ్యాచ్‌లో ముంబై ఇండియన్స్ రాయల్ ఛాలెంజర్స్ బెంగుళూరుతో తలపడ నుంది. టోర్నమెంట్ చరిత్రలో, ముంబై రెండు టైటిళ్లను గెలుచుకోగా, బెంగుళూరు ఒక టైటిల్‌ను గెలుచుకుంది. ఇక ఉమెన్స్ ప్రీమియర్ లీగ్ చరిత్రలో అత్యధిక పరుగులు చేసిన ఐదుగురు మహిళా ప్లేయర్లు ఉన్నారు. ఇందులో భారత్ మహిళల జట్టు వైస్ కెప్టెన్ స్మృతి మంధాన పేరు మాత్రం లేదు. ఈ టాప్ 5 ప్లేయర్ల జాబితాలో అగ్రస్థానంలో నాట్ స్కైవర్‌బ్రంట్ ఉంది. ఆమె 29 మ్యాచ్‌ల్లో 1,027 పరుగులు చేసింది. ముంబైలో కీలక సభ్యురాలైన నాట్ స్కైవర్‌బ్రంట్ 46.68 సగటుతో అద్భుతమైన స్కోరు చేసి, 8 అర్ధ సెంచరీలు కూడా చేసింది. ఇవి ఆ జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాయి. రెండవ స్థానంలో రాయల్ ఛాలెంజర్స్ ప్లేయర్ ఎల్లీస్ పెర్రీ ఉంది. పెర్రీ మహిళల ప్రీమియర్ లీగ్ చరిత్రలో అత్యంత నమ్మకమైన బ్యాట్స్‌మెన్‌లలో ఒకరిగా పరిగణించ బడుతోంది. ఆమె 25 మ్యాచ్‌ల్లో 64.80 సగటుతో 972 పరుగులు చేసి, 8 హాఫ్ సెంచరీలు కూడా చేసి బ్యాటింగ్‌కు వెన్నెముకగా నిలిచింది. అలాగే ఢిల్లీ క్యాపిటల్స్ మాజీ కెప్టెన్ మెగ్ లానింగ్ మూడో స్థానంలోఉంది. ఆమె 27 మ్యాచ్‌ల్లో 952 పరుగులు చేసింది, సగటున 39.66తో, తొమ్మిది అర్ధ సెంచరీలు చేసింది. లానింగ్ తన జట్టుకు స్థిరంగా మంచి ఆరంభాలను అందించింది. నాలుగో

## అగ్రస్థానంలో స్కైవర్‌బ్రంట్

## టాప్ 5లో చోటు దక్కని స్మృతి

స్థానంలో యువ మరియు దూకుడు బ్యాట్స్‌మెన్ షఫాలీ వర్మ ఉంది. ఆమె నిర్భయమైన ఆటతీరు డబ్ల్యూపిఎల్‌లో ప్రత్యేకంగా నిలుస్తుంది. ఆమె 27 మ్యాచ్‌ల్లో 865 పరుగులు చేసింది. ఆమె స్ట్రైక్ రేట్ 162.59చూస్తే ఎంతత్వరగా స్కోరు చేస్తుందో చూపిస్తుంది. ఆమె ఆరు అర్ధ సెంచరీలు చేయగా, బౌలర్లను ఎల్లప్పుడూ ఒత్తిడిలోఉంచుతుంది. ఐదవ స్థానంలో ముంబై ఇండియన్స్ కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ ఉంది. ఆమె జట్టు మిడిల్ ఆర్డర్‌లో బలమైన ప్లేయర్‌గా ఉంది. ఆమె 27 మ్యాచ్‌ల్లో 851 పరుగులు చేయగా, సగటున 40.52తో 8 అర్ధ సెంచరీలు చేసింది. హర్మన్‌ప్రీత్ కౌర్ తరచుగా తన జట్టును విజయాల వైపు నడిపిస్తుందిమరియు మ్యాచ్‌లను ముగించడంలో నిష్ణాతురాలు.





# నేడే రెజ్లింగ్ లీగ్ వేలం

## ఆమన్, అంతిమ్, అన్షులకు డిమాండ్

**న్యూఢిల్లీ:** ప్రొ రెజ్లింగ్ లీగ్ (పీడబ్ల్యూఎల్) వేలం పాటకు రంగం సిద్ధమైంది. జాతీయ రెజ్లింగ్ అసోసియేషన్ (డబ్ల్యూఎఫ్ఐ) ఆధ్వర్యంలో తొలిసారి ఈనెల 3న జరుగనున్న పీడబ్ల్యూఎల్ కోసం ప్లేయర్ల ఎంపిక ప్రక్రియ అన్ని హంగులతో సమాయత్తమైంది. ఆటగాళ్లను కొనుగోలు చేసుకొనేందుకు ఆరు ఫ్రాంచైజీలు మెగా వేలంలో పాల్గొనున్నాయి. ఒక ప్రొ రెజ్లింగ్ టోర్నమెంట్ జనవరి 15 నుంచి ఫిబ్రవరి 1 వరకు జరగనుంది. రాబోయే సీజన్‌లో హర్యానా థండర్స్, టైగర్స్ ఆఫ్ ముంబై దంగల్స్, పంజాబ్ రాయల్స్, మహారాష్ట్ర కేసరి, ఢిల్లీ దంగల్ వారియర్స్, యుపి డామినేటర్స్ ఫ్రాంచైజీలు రెజ్లింగ్ టోర్నీలో ప్రాతినిధ్యం వహిస్తున్నాయి. ప్రధానంగా పారిస్(2024) ఒలింపిక్స్ కాంస్య విజేత అమన్ సెహ్రావత్‌తో పాటు, విదేశీ స్టార్ రెజ్లర్లు యుయి సుసాకి, యుసెనిలిస్ గుజ్‌మన్ లోపెజ్ రూ.18 లక్షల కనీస ధరతో వేలంలోకి అడుగుపెడుతున్నారు. మహిళల విభాగంలో ప్రపంచ చాంపియన్‌షిప్ మెడలిస్టు అంతిమ్ పంగల్, అన్షు మాలిక్, కామన్వెల్ క్రీడల పతక విజేత దీపక్ పునియా, నవీన్ రూ.10లక్షల బేస్ ధరతో వేలం రేసులో నిలువగా, అత్యుత్తమ రెజ్లర్లలో ఒకరైన సుజీత్ కల్కల్ రూ.7లక్షలతో కనీస ధరతో వేలంలో దిగాలని నిర్ణయించుకున్నాడు. మహిళల విభాగంలో అంతిమ్ పంగల్ రూ.10లక్షల బేస్ ధరతో వేలం రేసులో నిలిచింది. ఇక ఆషూ మాలిక్, జాతీయ ఛాంపియన్ స్మృతి షిండే రూ.10లక్షల, ఒలింపిక్ ఛాంపియన్, జపాన్‌కు చెందిన యూ రూ.18లక్షలతో వేలం బరిలో దిగుతోంది. క్యూబా, ఉక్రెయిన్, అజర్‌బైజాన్, రష్యా రెజ్లర్లు కూడా భారత్ వేదికగా జరిగే ప్రొ రెజ్లింగ్ వేలం కోసం రిజిస్టర్ చేయించుకున్నారు. వీరంతా కనీస ధర రూ.5లక్షల నుంచి 10 లక్షలలోపు రిజిస్టర్ చేయించుకున్నారు.



### ఇంటర్నేషనల్ లీగ్ టి20..

## ఫైనల్ బెర్త్‌కు నైట్‌రైడర్స్

**న్యూఢిల్లీ:** ఇంటర్నేషనల్ లీగ్ టి20, 2025-26 ఎడిషన్ చివరి దశకు చేరింది. క్వాలిఫయర్-1లో గెలిచి డెజర్ట్ వైపర్స్ నేరుగా ఫైనల్స్ బెర్త్‌ను ఖరారు చేసుకోగా, మరో ఫైనల్ బెర్త్ కోసం పోటీ జరిగింది. దుబాద్ వేదికగా జరిగిన ఎలిమినేటర్ మ్యాచ్‌లో అబుదాబీ నైట్‌రైడర్స్ దుబాయ్ క్యాపిటల్స్‌పై తిరుగులేని విజయం సాధించి క్వాలిఫయర్స్-2కు అర్హత సాధించింది. ఈ ఎలిమినేటర్ మ్యాచ్‌లో క్యాపిటల్స్‌పై అబుదాబీ నైట్‌రైడర్స్ 50పరుగుల తేడాతోగెలుపొందింది. తొలుత బ్యాటింగ్ చేసిన నైట్‌రైడర్స్ మైఖేల్ పిప్పర్ (72), ఫిల్ సాల్ట్ (43), జేసన్ హోల్డర్ (22 నాటౌట్) రాణించడంతో నిర్ణీత ఓవర్లలో 7 వికెట్లు నష్టానికి 158 పరుగులు చేసింది. క్యాపిటల్స్ బౌలర్లలో నబీ 3 వికెట్లతో సత్తా చాటగా, హైదర్ అలీ, వకార్ సలాంఖిల్ తలో వికెట్ తీశారు. అనంతరం ఒక మోస్తరు లక్ష్య ఛేదనలో చేతులెత్తేసిన క్యాపిటల్స్ 16.2 ఓవర్లలో 108 పరుగులకే ఆలౌటై ఘోర పరాజయాన్ని ఎదుర్కొంది. సునీల్ నరైన్ (3-0-12-3), జేసన్ హోల్డర్ (3.2-0-18-3), లివింగ్‌స్టోన్ (4-0-26-3) అద్భుతంగా బౌలింగ్ చేసి క్యాపిటల్స్ పతనాన్ని శాసించారు.

### ఉమన్స్ హాకీ లీగ్‌లో..

## బెంగాల్ టైగర్స్ విజయం

**న్యూఢిల్లీ:** మహిళల హాకీ ఇండియా లీగ్ (డబ్ల్యూహెచ్ఐఎల్), 2025-26, షూటౌట్‌లో శ్రాచి బెంగాల్ టైగర్స్ 4-3తో ఎస్‌జి పైపర్స్‌ను ఓడించింది. నిర్ణీత సమయం ముగిసే సమయానికి ఇరుజట్లు 3-3తో సమంగానిలిచాయి. లాల్రెమ్సియామి సడన్‌డెత్ గోల్‌తో బోనస్ పాయింట్‌ను దక్కించుకుంది. టైగర్స్ తరపున అగస్టినా గోర్జెలానీ (6వ నిముషం, 18), లాల్రెమ్సియామి (11) నిర్ణీత సమయంలో గోల్స్ సాధించగా, పైపర్స్ తరపున లోలా రియారా (10, 60), సునెలిటా టోప్పో (59) గోల్స్ చేశారు. టైగర్స్ తొలి ఎంట్రీ దూకుడుగా ప్రారంభించి వరుసగా పెనాల్టీ కార్నర్‌లను సంపాదించింది. గోర్జెలానీ ద్వారా గోల్‌గా మార్చి ఆధిక్యంలోకి తెచ్చింది. పైపర్స్‌కు చెందిన లోలా తనదైన పెనాల్టీ కార్నర్‌ను గెలుచుకుని స్కోర్‌ను సమంచేసింది. తదుపరి లాల్రెమ్సియామి టైగర్స్ ఆధిక్యాన్ని పునరుద్ధరించే యత్నంలో గోల్ చేసి 2-1 ఆధిక్యాన్ని ఇచ్చింది. ఆ తర్వాత గోర్జెలానీ పెనాల్టీ కార్నర్ నుండి మళ్లీ కొట్టడంతో టైగర్స్ రెండవ క్వార్టర్‌లో తమ ఆధిక్యాన్ని పెంచుకుంది. ఎస్‌జీ పైపర్స్ నిరంతర దాడులు చేసినప్పటికీ, టైగర్స్ గోల్ కీపర్ జెన్నిఫర్ రిజ్జో వరుస



సేవ్‌లను చేసి తన జట్టును హాఫ్ టైం నాటికి 3-1తో ఆధిక్యంలో ఉంచింది. రెండవ అర్ధభాగాన్ని పైపర్స్ దాడులను ప్రారంభించి పెనాల్టీ కార్నర్‌ను సంపాదించినా అది పరిగణలోకి రాలేదు. నాల్గవ క్వార్టర్ పైపర్స్ చివరికి పెనాల్టీ కార్నర్‌ను గెలుచుకుంది. కెప్టెన్ నవనీత్ కౌర్ షాట్‌ను సునేలిత నేర్పుగా తిప్పికొట్టి స్కోరును ఒకే గోల్‌కు తగ్గించింది. అయితే షూటౌట్‌లో టైగర్స్‌కు పరిస్థితులు అనుకూలించడంతో విజయం సాధించింది.

## లక్నో లయన్స్ హ్యాట్రిక్

### రామ్‌దూట్స్‌పై 48-33తో గెలుపు

**న్యూఢిల్లీ:** అవధ్ రామ్‌దూట్స్‌పై ఆధిపత్య విజయంతో లక్నో లయన్స్ కొత్త సంవత్సరాన్ని ప్రారంభించింది. ఉత్తరప్రదేశ్ కబడ్డీ లీగ్, సీజన్ 2, ఎనిమిదో రోజు ప్రారంభ మ్యాచ్‌లో లక్నో లయన్స్ 48-33 తేడాతో రామ్‌దూట్స్‌ను ఓడించి మరో కమాండింగ్ ప్రదర్శనను అందించి నూతన సంవత్సరాన్ని ప్రారంభించింది. తొలి అర్ధభాగం యువ రైడర్ శివమ్‌చౌదరి నేతృత్వంలోని లక్నో జట్టుకు అనుకూలంగా ఉంది. అతను అవధ్ డిఫెన్స్‌ను పదే పదే ఇబ్బంది పెట్టాడు. శివమ్ కేవలం ఎనిమిది రైడ్‌లలో 10 పాయింట్లు సాధించడంతో లక్నో జట్టు ఆధిపత్యాన్ని పెంచింది. నిరంతర ఒత్తిడి ఫలితంగా లక్నో లయన్స్ 13 పాయింట్ల ఆధిక్యంతో హాఫ్ టైంలోకి దూసుకెళ్లి పోటీపై పట్టు సాధించింది. విరామం తర్వాత అవధ్ రామ్‌డూట్స్ తిరిగి పుంజుకోవడానికి ప్రయత్నించింది. అయితే శివంమరో కీలకమైన దాడితో మూడు పాయింట్లను సంపాదించాడు. చివరి దశలో మ్యాచ్ మందగించడంతో, లక్నో లయన్స్ ఆటను తెలివిగా నిర్వహించి చివరికి 48-33 తేడాతో సమగ్ర విజయాన్ని సాధించింది.



# వారాంతంలో సెన్సెక్స్, నిఫ్టీలు పైపైకి..




### మెటల్, ఆటో, పిఎస్‌యు బ్యాంకింగ్ షేర్లు ర్యాలీ

**ముంబయి, జనవరి 2:** భారత ఈక్విటీ మార్కెట్లువారాంతపు ట్రేడింగ్‌లో సరికొత్త రికార్డులు సృష్టించాయి. మెటల్, ఆటో, పీఎస్‌యూ బ్యాంకింగ్ షేర్లలో బలమైన కొనుగోళ్ల మద్దతుతో సూచీలు భారీగా లాభపడ్డాయి. ట్రేడింగ్ ముగిసే సమయానికి, సెన్సెక్స్ 573 పాయింట్లు లాభపడి 85,762 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 182 పాయింట్లు పెరిగి 26,328 వద్ద ముగిసింది. ట్రేడింగ్ సమయంలో నిఫ్టీ 26,330 వద్ద ఆల్‌టైమ్ గరిష్ఠాన్ని తాకింది. బ్యాంకింగ్ షేర్లలో కొనుగోళ్ల జోరు కొనసాగడంతో బ్యాంక్ నిఫ్టీ కూడా 60,152.35 వద్ద సరికొత్త జీవనకాల గరిష్ఠాన్ని నమోదు చేసింది. రంగాల వారీగా చూస్తే, పీఎస్‌యూ బ్యాంక్ సూచీ 1.78 శాతం లాభంతో టాప్ గెయినర్‌గా నిలిచింది. ఆటో, మెటల్, రియల్టీ, పవర్ సూచీలు కూడా 1 శాతం చొప్పున లాభపడ్డాయి. అయితే, ఎఫ్ఎంసీజీ రంగం మాత్రం 1.15 శాతం నష్టపోయింది. మార్కెట్ ముగిసేసరికి, 2,527 షేర్లు లాభాల్లో ముగియగా, 1,347 షేర్లు నష్టపోయాయి. వాహన విక్రయాల గణాంకాలు ప్రోత్సాహకరంగా ఉండటంతో ఆటో షేర్లలో కొనుగోళ్ల ఆసక్తి కనిపించింది. దేశీయంగా స్థూల ఆర్థిక పరిస్థితులు స్థిరంగా ఉండటం, దేశ వృద్ధిపై విశ్వాసం వంటి అంశాలు మార్కెట్ సెంటిమెంట్‌కు బలాన్నిచ్చాయి. బ్రాడర్ మార్కెట్లలోనూ నిఫ్టీ మిడ్‌క్యాప్ 100 ఇండెక్స్ 1.04 శాతం, స్మాల్‌క్యాప్ 100 ఇండెక్స్ 0.78 శాతం చొప్పున లాభపడ్డాయి. నిఫ్టీ 26,300 స్థాయికి పైన స్థిరంగా కొనసాగితే, ర్యాలీ 26,500 వరకు వేగవంతం కావచ్చు. అదే జోరు కొనసాగితే 26,700 స్థాయికి చేరే అవకాశం ఉందని ఒక నిపుణులు అంచనావేసారు. ఇదిలా ఉండగా, ట్రేడింగ్ సెషన్‌లో యూఎస్ డాలర్‌తో రూపాయి మారకం విలువ 90 మార్కును దాటి బలహీనపడింది. రాబోయే కార్పొరేట్ ఫలితాలపై సానుకూల అంచనాలతో మార్కెట్‌లో సానుకూల ధోరణి కొనసాగుతోందని నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఇక బిఎస్ఇలో మిడ్ క్యాప్‌సైచీ 0.97శాతం, స్మాల్‌క్యాప్ సూచీ 0.79శాతంపెరిగాయి. మార్కెట్ల పరంగా బిఎస్ఇలో 2772 షేర్లు పెరిగితే 1449 కంపెనీలషేర్లు క్షీణించాయి. 150 కంపెనీలు మాత్రం స్థిరంగా కొనసాగినట్లు తెలుస్తోంది. ఇక ఎంసిఎక్స్‌లో పసిడి ఫ్యూచర్లు ఫిబ్రవరి 5వ తేదీనాటికి 0.76 శాతం పెరిగి రూ.1,36,830కి చేరాయి. కమోడిటీ మార్కెట్లలో బ్రెంట్ ముడి చమురు మార్చినెల సెటిల్‌మెంట్‌చేసుకన్నది 04సెంట్లు క్షీణించింది. బ్యారెల్‌కు 60.81 డాలర్లు చొప్పున ధరలు కొనసాగాయి.

# 2027 నాటికి భారత్ ఆర్థికవృద్ధి 11%

### ఎస్‌బిఐ మ్యూచువల్ ఫండ్స్ నివేదిక

**న్యూఢిల్లీ, జనవరి 2:**భారత్ స్థూల దేశీయోత్పత్తివృద్ధి 2027నాటికి 11 శాతానికి చేరుతుందని ఎస్‌బిఐ మూచువల్‌ఫండ్ నివేదిక ప్రకటించింది. వాస్తవ జిడిపి వృద్ధిరేటు 7.2శాతంగా ఉంటుంది. దేశీయంగా వినియోగం పెరగడం, ప్రభుత్వ విధానాల మద్దతుతో వృద్ధి సులువుగా లక్ష్యం చేరుకుంటుందని వెల్లడించింది. భౌగోళికంగా అంతర్జాతీయంగా అనిశ్చితులు ఉన్నప్పటికీ దేశీయ పరిస్థితులు ఆర్థికవృద్ధికి ఎక్కువ ఊతం ఇస్తున్నట్లు తెలిపింది. జిఎస్టీ రీడిజైన్, కొత్త కార్మికచట్టాలు, మెరుగుపడిన ఆర్తిక పరిస్థితులు, పెట్టుబడులు గణనీయంగా వృద్ధి, కార్పొరేట్ కంపెనీల ఆస్తి అప్పుల పట్టీలు వృద్ధి వంటివి ఇందుకు దోహదంచేస్తాయని ఎస్‌బిఐ మూచువల్‌ఫండ్ ప్రకటించింది. దేశీయంగా రుణాల్లో కూడా వృద్ధిక నిపిస్తుండటంతో వినియోగరంగ వ్యయంపెరుగుతుందని, మానిటరీ పాలసీలు కూడా వృద్ధికి ఆస్కారం ఇస్తున్నట్లు వివరించింది. జిఎస్టీ హేతుబద్ధీకరణ, కార్మిక చట్టాలు,మౌలికవనరుల వృద్ధి వంటివి పుష్కలంగా ఆర్థిక వృద్ధికి దోహదం చేస్తాయని ప్రకటించింది. పెట్టుబడుల సైకిల్‌పరంగా చూస్తే కంపెనీలకు




పెరుగుతున్నాయని, దీనివల్ల తక్కువ వడ్డీలకే రుణపరపతి లభ్యతతోపాటు మూలధన వ్యయం పెరిగేందుకు పరిస్థితులు సానుకూలంగా ఉన్నాయని ఎస్‌బిఐ ఫండ్స్ వివరించింది. దీనికితోడు ద్రవ్యోల్బణం కూడా నాలుగు శాతానికి పెరగకుండా అటూ ఇటూగా దిగువస్థాయిలోనే నమోదవుతున్నదని ఫండ్స్ సంస్థ ప్రకటించింది. యాక్సిస్‌బ్యాంకు గత ఏడాది జిడిపి వృద్ధి 2027లో భారత్ 7.5శాతంగా ఉంటుందని వెల్లడించింది. అలాగే ఎస్ అండ్‌పి గ్లోబల్ సంస్థ కూడా జిడిపి వృద్ధి 6.5నుంచి ఏడుశాతం ఉం టుందని గతంలోనే ప్రకటించిన సంగతి తెలిసిందే. అయితే ప్రపంచ వ్యాప్త ఆర్థిక మందగమనం, భౌగోళిక పరిస్థితులు ఉద్రిక్తతలు మాత్రం కొంత ఆందో ళనకరం కాగలవని ఎస్‌బిఐ మూచువల్‌ఫండ్స్ అంచనావేసింది.

## అదానీ ఎంటర్‌ప్రైజెస్ రూ.1000 కోట్ల ఎన్‌సిడిల జారీ

**ముంబయి,జనవరి 2:** ఆదాని గ్రూప్‌లోని ఆదాని ఎంటర్‌ప్రైజెస్ మూడో ఎన్‌సిడిలను జారీచేసింది. ఈ బదలీకి వీలుకాని డిబెంచర్ల ద్వారా సుమారు 1000 కోట్లు నిధులు సేకరించేందుకునిర్ణయించింద.ఇ సాలీనా రిటర్నులు 8.90శాతంగా ఉంటుంది. అయితే వీటి కాలపరిమితి 24,36,50 నెలలుగా నిర్ధారించింది. ఈనెల 6వ తేదీ ప్రారంభించనున్నట్లు ప్రకటించింది. స్థిరమైన ఆదాయం కోరుకునే ఇన్వెస్టర్లకు ఈ రాబడులు మంచి వేదిక అవుతుందని, కంపెనీ చెపుతోంది. ఈనిధులను రుణాలు తీర్చి రీఫైనాన్సింగ్ కోసం, సాధారణ కార్పొరేట్ అవసరాలకు ఖర్చుచేయనున్నట్లు వెల్లడించింది. డబుల్ ఎ, ఎప్లస్ రేటింగ్ ఉన్నట్లు ఆదాని వెల్లడించింది. ప్రాథమికంగా ఇష్యూబేస్ రూ.500 కోట్లు ఉంటుంది. అదనంగా మరో 500 కోట్లు సమీకరణకు కూడా వెసులుబాటు ఉంది. ఆరోతేదీ ప్రారంభం అయి 19వ తేదీ ముగుస్తుంది. సాలీనా రాబడులు 8.60శాతం నుంచి 8.90శాతం వరకూ ఉంటుంది. కంపెనీ ఆస్తులను వీటికి సెక్యూరిటీగా చూపిస్తోంది. 110శాతం సెక్యూరిటీ ఇస్తున్నట్లు ఆదాని వెల్లడించింది. కేర్‌సంస్థ డబుల్‌ఎ, ఇక్రా డబుల్‌ఏ రేటింగ్‌ఇచ్చాయి. ప్రస్తుతం ఉన్న రుణాలను చెల్లించడంకోసం 75శాతం మిగిలిన 25శాతం కార్పొరేట్ అవసరాలకు వినియోగిస్తారు. కనీస ఎట్టుబడి 10 వేల రూపాయలుగా ప్రకటించింది. అంటే పది ఎన్సీడిలు తీసుకోవాలిస ఉంటుంది. ఈ నిధులతో మౌలి కవనరుల విస్తరణ, ఇంధనం, కొత్త వ్యాపారాలకకు వినియోగించేందుకు నిధులు ఖర్చు ఉంటుందని కంపెనీ ప్రకటించింది.






## డార్క్‌స్టోర్ నెట్‌వర్క్ వల్లే స్పీడ్ డెలివరీలు

### జొమాటో సిఇఒ

**ముంబయి, జనవరి 2:** జొమాటో, బ్లింకిట్ అందిస్తున్న 10నిమిషాల డెలివరీ వెనుక ఉన్న అసలు రహస్యాన్ని ఆ కంపెనీ వ్యవస్థాపకుడు, సీఈఓ దీపిందర్ గోయల్ బయటపెట్టారు. స్పీడ్ డెలివరీకి డెలివరీ పార్ట్‌నర్లు వేగంగా వాహనాలు నడపడం కారణం కాదని, కస్ట మర్లకు అత్యంత సమీపంలో దట్టంగా ఏర్పాటుచేసిన 'డార్క్ స్టోర్ల నెట్‌వర్కే' కీలకమన్నారు.డెలివరీ ఏజెంట్ల భద్రతపై వస్తున్న ఆందోళనలు, న్యూఇయర్ సందర్భంగా కొందరు గిగ్‌వర్కర్లు చేసిన సమ్మె నేపథ్యంలో ఆయన సోషల్ మీడియాలో వివరణ ఇచ్చారు. ఒకఆర్డర్ వచ్చినప్పుడు ప్యాకింగ్‌కు సుమారు 2.5 నిమిషాల సమయం పడుతుంది. డెలివరీసగటున 2కిలోమీటర్ల లోపు దూరంలోనే ఉంటుందని,గంటకు కేవలం 15కిలోమీటర్ల వేగంతో ప్రయాణించినా 8నిమిషాల్లో చేరవచ్చని వివరించారు.డెలివరీ ఆలస్యమైతే తమ ఏజెంట్లకు ఎలాంటి జరిమానాలు విధించమని,అలాగే సమయానికి డెలివరీ చేసినందుకు ప్రత్యేక ప్రోత్సాహకాలు కూడా ఉండవని ఆయన తేల్చి చెప్పారు.దీనివల్ల వారిపై ఎలాంటి ఒత్తిడి ఉండదని పేర్కొన్నారు.డెలివరీ పార్ట్‌నర్లు ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తున్నారనే ఆరోపణలపైనా గోయల్ స్పందించారు. ఇది కేవలం డెలివరీ పార్ట్‌నర్ల సమస్య కాదని, మన సమాజంలోనే చాలా మందికి తొందర ఎక్కువ అని ఆయన అన్నారు. యూనిఫాంలో ఉండటం వల్ల తమ వాళ్లు సులభంగా కనిపిస్తారని అన్నారు. కాగా, నిరసనల మధ్యే న్యూఇయర్ రోజున జొమాటో, బ్లింకిట్ కలిసి రికార్డు స్థాయిలో 75లక్షల ఆర్డర్లను డెలివరీ చేసినట్లు తెలిపారు.

# 92 కంపెనీలపై వచ్చిన 109 ఫిర్యాదులు పరిష్కారం


### బాంబే స్టాక్ ఎక్ఛేంజి వెల్లడి



**ముంబయి, జనవరి 2:** బాంబే స్టాక్ ఎక్స్ఛేంజి గత ఏడాది డిసెంబరునెలలోఇన్వెస్టర్లనుంచి వచ్చిన 109 ఫిర్యాదులను పరిష్కరించింది. మొత్తం 92 కంపెనీలపై 109 మంది ఇన్వెస్టర్లు ఫిర్యాదులుచేసారు. కొత్తగా 141 ఫిర్యాదులు స్వీకరించిన బిఎస్ఇ వీటిని కూడా పరిశీలిస్తోంది. అదే డిసెంబరు నెలలో 113 ఫిర్యాదులు మా త్రమే వచ్చాయని తెలిపింది. వాటిలో 92 కంపెనీలక చెందిన 109 ఫిర్యాదులను పరిష్క రించామని వెల్లడించింది. జెఎస్‌డబ్ల్యు స్టీల్, మధువీర్‌కామ్ 18 నెట్‌వర్క్ లిమిటెడ్, ధని సర్వీసెస్ వంటి ఫిర్యాదులు పరిష్కారానికి నెలరో జులకుపైగా వ్యవధి తీసుకుందని తెలిపారు. ఇన్వెస్టర్లనుంచి ఫిర్యాదులకోసం సెబీ ఆన్‌లైన్ ఫిర్యాదుల ప్లాట్‌ఫామ్‌ను ఏర్పాటు చేసింది. ఈ ఫిర్యాదుల విభాగాన్నిస్కోర్స్ అని పిలుస్తున్నారు. అంటే సెబీ కంప్లయింట్ రిడ్రెస్ సిస్టమ్‌ను స్కోర్స్‌గా చెపుతున్నది. గతంలో బిఎస్ఇ ఇన్వె స్టర్లకు హెచ్చరికలు చేసింది. ఆదిత్య రిషబ్‌మిశ్రా అనే వ్యక్తి ఇన్వెస్టర్లకు చట్టవిరుద్ధంగా అక్రమ సేవలు సలహాలు ఇస్తున్నట్లు వెల్లడించింది. ఇలాంటి వ్యక్తులనుంచి ఆ వ్యక్తులు ఆఫర్‌చేసే సేవలకు దూరంగా ఉండాలని సూచించింది. బిఎస్ఇలో రిజిస్టరు అయిన వ్యక్తులనుంచి మాత్రమే ఇన్వెస్టర్లు సేవలు పొందాలని సూచించింది. అలాగే ఆర్‌బిఐ కూడా ప్రజల్లో అవగాహన పెంచే కార్యనరకమాలుచేపట్టింది.డిజిటల్ కార్యక్రమాల్లో పూర్తి అవగాహన కలిగి ఉండాలని, టివిలు, ప్రింట్, ఎస్ఎంఎస్, డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లలో విస్తృత ప్రచారం చేస్తోంది. ఆర్‌బిఐ కెహతాహై ప్రచారం బి అవేర్ బుక్‌లెట్, వంటివి పెట్టుబడులపట్ల ఇన్వెస్టర్లలో అవగాహన పెంచే కార్యక్రమాలు చేస్తోంది.

### ప్రైమరీ మార్కెట్‌లో రిటైల్ ఇన్వెస్టర్లు

## రూ.34,336 కోట్ల పెట్టుబడి




**న్యూఢిల్లీ, జనవరి 2:** రిటైల్ ఇన్వెస్టర్లు ప్రైమరీ మార్కెట్లలో ఈ ఆర్థికసంవత్సరం ఎనిమిది నెలల కాలంలో 34,336 కోట్లు పెట్టుబడులు పెట్టినట్లు పారిశ్రామికవర్గాల డేటానుంచి తెలు స్తోంది. భారత్ మార్కెట్లు 2025లో గణనీయంగా నిదులు సేకరించాయి. 103 మెయిన్ బోర్డు ఐపిఒలు రూ.176 లక్షల కోట్లు సమీకరించగా 267 ఎస్ఎంఇ ఐపిఒలు సుమారు 11, 435 కోట్లు సేకరించాయి. మొత్తం 108 మెయిన్‌బోర్డు లిస్టింగ్‌లలో 72 తెరుచుకోగా వాటి ఇష్యూ ధరలకంటే తక్కువగా 36 ట్రేడ్ అయ్యాయి. లాభాలు పొందిన సంస్థల్లో 16 స్టాక్స్ ఉన్నాయి. 30 నుంచి 70శాతంవరకూ పెరిగినట్లు తేలింది. లిస్టింగ్‌లో22 సంస్థలు 10నుంచి 30శాతం పెరిగాయి. మరికొన్ని 34 సంస్థలు ఒకటినుంచి 10శాతం మధ్యలోనే లాభపడ్డాయి. అంటే స్వల్ప లాభాలతోనే సరిపెట్టుకున్నాయి. ప్రైమరీ మార్కెట్‌లో రిటైల్ ఇన్వెస్టర్లు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. సెకండరీ మార్కెట్‌లో రికార్డుస్థాయిలో విత్‌డ్రాలు జరిగాయి. నవంబరువరకూ 13 వేల కోట్లు విత్‌డ్రా అయితే రూ.1.25 లక్షలు నిధులు వచ్చాయి. ప్రధానంగా చెప్పాలంటే ఐపిఒలనుంచే నిధులు ఎక్కువ సమకూరాయి. రూ.100 నుంచి రూ.500కోట్ల వరకూ కొన్ని కంపెనీలుంటే రూ.1000 కోట్ల నుంచి రూ.2వేల కోట్ల సెగ్మెంట్‌లోనే అత్యధిక కంపెనీలు ఐపిఒలు జారీచేసాయి. గడచిన ఎనిమిది నెలల కాలంలో గణనీయంగా వచ్చిన పెట్టుబడులు వచ్చే ఏడాది నాలుగు లక్షలకోట్ల మూలధన వనరులకు ఐపిఒలు వేదిక అవుతాయని మార్కెట్ డేటా స్పష్టం చేస్తోంది.

Print and Published by Gireesh Sangh, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd, at 11-37, Moramputi, Rajamahendravaram-533 103. Phone: 24 2460408. RNI No.64863/96, Editor: Damerla Sai Baba, Responsible for selection of News-under the PRB Act. Regd: No.H/SD/337/09-11 . Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

తూర్పుగోదావరి, కాకినాడ
డా.బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
రాజమహేంద్రవరం | శనివారం 03 జనవరి 2026 | I





# 'పోలవరం'లో స్పెషల్ కలెక్టర్‌గా సరళ వందనం మార్క్

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల ప్రతినిధి, జనవరి 2 (ప్రభాతవార్త)**

- 36ఏళ్లుగా రెవెన్యూశాఖలు కీలక పదవులు, ప్రశంసలు
- 'పోలవరం' ముంపు బాధితుల సమస్యలపై పూర్తిస్థాయి దృష్టి
- కేంద్రంతో నేరుగా చర్చలు!
- స్పెషల్ కలెక్టర్‌గా పదవీవిరమణ చేసిన సత్తెనపల్లి సరళ వందనం

*పోలవరం ఇరిగేషన్‌ప్రాజెక్టు స్పెషల్ కలెక్టర్ (భూసేకరణ)గా పదవీ బాధ్యతలు నిర్వర్తిస్తున్న సత్తెనపల్లి సరళ వందనం పదవీ విరమణ చేశారు.గత 36 ఏళ్లుగా రాష్ట్ర ప్రభుత్వంలోని కీలక పదవుల్లో ఆమె విధులు నిర్వర్తించారు. రెవెన్యూశాఖలో పనిచేస్తూ అటు ప్రభుత్వం నుంచి ఇటు ప్రజల నుంచి ఎన్నో ప్రశంసలను అందుకున్నారు. రాజమహేంద్రవరంలో పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు స్పెషల్ కలెక్టర్‌గా పనిచేస్తున్న సమయంలో పోలవరం ముంపు బాధితులకు, రైతులకు ఢిల్లీ స్థాయిలో కేంద్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరిపి, వారికి నష్ట పరిహారాన్ని, ఇతర సౌకర్యాలను కల్పించారు. దీంతో పోలవరం ప్రాజెక్ట్ ముంపు ప్రాంతవాసులు ఆమె చేసిన కృషిని కొనియాడుతున్నారు. ప్రభుత్వాలు ఇచ్చిన హామీలను తమ పరిధిలో ఉన్నవాటిపై పూర్తిగా దృష్టి సారించి, ప్రభుత్వ లక్ష్యాలను చేధించేవారు. ఇలాంటి అధికారులు మరికొన్నాళ్లు ఉండాలని ప్రజలు కోరుకుంటున్నారు.*

1990 నుంచి 2000 సంవత్సరం వరకు ఎస్ పరళవందనం కర్నూలు తహశీల్దార్‌గా విధులు నిర్వర్తించారు. తర్వాత వెలుగు ప్రధాన కార్యాలయంలో మేనేజర్‌గా, సిసిఎల్ఏ కార్యాలయంలో అసిస్టెంట్ సెక్రటరీగా, కర్నూలు యూడిఎస్‌సి కార్పోరేషన్‌లో పదవీ బాధ్యతలు నిర్వర్తించారు. మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ ఓఎస్‌డిగా హైదరాబాద్‌లో, హైదరాబాద్ కలెక్టర్ కార్యాలయంలో, డిఫెన్స్ ల్యాండ్ అక్విజేషన్‌లో, హైదరాబాద్ డిఆర్‌ఓగా, అడిషినల్ జాయింట్ కలెక్టర్‌గా విధులు నిర్వర్తించి, ఏపీకి వచ్చారు. 2019లో ఎనర్జీ డిపార్ట్‌మెంట్‌లో స్పెషల్ కలెక్టర్‌గా పనిచేస్తూ, ఏపీ ఎన్నికల డిప్యూటీ సిఈఓగా పనిచేసి, రాష్ట్ర సెక్రటేరియట్‌లో కూడా విధులు నిర్వహించారు. తర్వాత ఆమెను ప్రభుత్వం వెలిగొండ స్పెషల్ కలెక్టర్‌గా నియమించింది. అక్కడ విధులను సమర్ధవంతంగా నిర్వహించారు. విధుల్లో ఆమె చూపిన చొరవను గమనించిన ప్రభుత్వం పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్ట్ భూసేకరణ విభాగంలో స్పెషల్ కలెక్టర్‌గా నియమించింది. అప్పటికి అక్కడ పలు సమస్యలు తిష్టవేసుకుని ఉన్నాయి. సరళ వందనం బాధ్యతలు చేపట్టాక, రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల పాలకులు, ఉన్నతాధికారులతో నిత్యం సంప్రదింపులు చేపట్టి, సమస్యలను పరిష్కరించారు. ముంపు బాధితుల, రైతుల సమస్యలపై నేరుగా ఢిల్లీకి వెళ్లి కేంద్ర మంత్రులను కలిసి సమస్యలను వివరించారు. ఆమె చేస్తున్న కృషిని తెలుసుకుని కేంద్రం ఆమె వారి దృష్టికి తీసుకెళ్లిన సమస్యలను తక్షణమే పరిష్కరించేవారు.

ఇలా ప్రజలకు ప్రభుత్వం ఇచ్చిన హామీలపై పూర్తిగా దృష్టి సారించి, న్యాయపరమైన చిక్కులు లేకుండా పూర్తిస్థాయిలో సమస్యలను పరిష్కరించడంతో పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్ట్ (భూసేకరణ) స్పెషల్ కలెక్టర్ ఎస్ సరళ వందనంపై ప్రశంసలు కురుస్తున్నాయి. ప్రాజెక్టు వల్ల తమ పరిధిలో ఏర్పడే సమస్యలను పరిష్కరించే ప్రత్యేక గుర్తింపును సాధించారు.

## క్యూఆర్ కోడ్‌తో నూతన పట్టాదారు పాసుపుస్తకాలు : ఎంఎల్ఏ ఆనందరావు.



**అమలాపురం,జనవరి2,(ప్రభాతవార్త).** రాజ ముద్రతో కూడిన నూతన పట్టాదారు పాసుపుస్తకాలు ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు ఉప్పలగుప్తం లో లబ్ధిదారులకు పంపిణీ చేశారు. శుక్రవారం అంబేద్కర్ కమ్యూనిటీ హాల్ నందు జరిగిన పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆనందరావు మాట్లాడుతూ భూమి తాలూకు సర్వే నెంబరు భూమి కొలతలతో కూడిన వివరాలు ఈ పాస్ బుక్ లో ఉంటాయని,తన భూమి ఎంత ఉన్నది ఏ కొలతలతో ఉన్నది ఎక్కడ ఉన్నది క్యూ ఆర్ కోడ్ తో సహా ఈ పాస్ బుక్ లో ముద్రించడం జరిగిందని తెలియజేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు హయాంలో కూటమి ప్రభుత్వం ప్రజలకు అనేక సంక్షేమ కార్యక్రమాలు చేస్తున్నదని ఈ సందర్భంగా చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు అరిగేల నానాజీ,దేశంశెట్టి లక్ష్మినారాయణ, చిక్కం ఉమేష్, చిక్కం భీముడు, చిక్కం సూర్యమోహన్, చిక్కం కాసు, పెద్దబాబు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

**పాల్గొన్న జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే బండారు.**



**ఆత్రేయపురం, జనవరి, 02,(ప్రభాత వార్త)** రెవెన్యూ పరంగా రైతాంగం ఎదుర్కొన్న సమస్యలను పరిష్కరించడానికి, వైసిపి పాలనలో జరిగిన అవకతవకలను సరిదిద్దడానికి కూటమి ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తుందని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. మండల కేంద్రమైన ఆత్రేయపురం గ్రామ సచివాలయం నందు శుక్రవారం రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రెవెన్యూ గ్రామ సభలు, రాజముద్రతో కూడిన పాస్ పుస్తకాలు పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్, కొత్తపేట ఆర్డీవో పి. శ్రీకర్,ఆకుల రామకృష్ణ, దేవస్థానం చైర్మన్ ముదునూరి వెంకటరాజు, గ్రామ సర్పంచ్ గెద్దం సుధా రాజు ఆతో కలిసి పాల్గొన్నారు. రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైసిపి పాలనలో చేసిన తప్పులతో రెవెన్యూ పరమైన లక్షలాది సమస్యలు వెలుగులోకి రావడం జరిగిందన్నారు. గత ప్రభుత్వం పాస్ బుక్ ల పంపిణీ పేరుతో, సర్వే పేరుతో అనేక అవకతవకలు చేసిందన్నారు. ప్రజలకు తాత ముత్తాతల నుంచి వస్తున్న ఆస్తులపై హక్కును కాలదన్నేలా, రాజముద్రతో ఇవ్వవలసిన పట్టాదారు పాస్ పుస్తకాలను, ప్రజల కష్టార్జితంపై తన సొంత ఫోటోలతో, తన పార్టీ రంగులద్దీ తప్పుల తడకలతో జగన్ ఏదో తన సొంత ఆస్తులు ఇచ్చినట్లు ప్రజలకు ఇవ్వడాని విమర్శించారు. వాటిలో కూడా అనేక తప్పులు దొర్లాయని అన్నారు. గత సంవత్సరం ఆత్రేయపురంలో పడవల పోటీలు జిల్లా కలెక్టర్ సహకారంతో నిర్వహించామని, అవి మంచి పేరు తీసుకు వచ్చాయని ఈ సంవత్సరం మరింత ఘనంగా ఈ పోటీలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.ఈసారి కలెక్టర్ మహేష్ కుమార్, టూరిజం శాఖ సహకారంతో రూ.1కోటి నిధులు, దాతల సహకారంతో అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందుకు ఆయనకు హృదయపూర్వకంగా అభినందనలు తెలియజేస్తున్నట్లు అన్నారు. సంక్రాంతి సంబరాలను విజయ వంతం చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ తహసీల్దార్ రాపాక రామచంద్రమూర్తి, ఎంపీడీవో బి కె ఎస్ ఎస్ వెంకట రామన్, డిప్యూటీ ఎంపీడీవో రామక్రృష?ంరాజు,మండల టిడిపి అధ్యక్షులు కూసంపూడి రామకృష్ణంరాజు ముళ్ళపూడి భాస్కరరావు, తెలుగు యువత అధ్యక్షులు వెచ్చా అనిల్ కుమార్, నీటి సంఘం అధ్యక్షులు జుజ్జువరపు హరిబాబు, నారాలశెట్టి వెంకన్న, గ్రామ రెవెన్యూ అధికారులు, గ్రామ కార్యదర్శి, కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## టిడ్కో సమస్యలపై ఎమ్ఎల్ఏకు వినతి



**అమలాపురం,జనవరి2,(ప్రభాతవార్త).** బోడసకుర్రు దేవరలంక టిడ్కో గృహాలలో నివాసులు స్థానిక శాసనసభ్యులు అయితాబత్తుల ఆనందరావును కార్యాలయం వద్ద కలిసి వినతిపత్రం సమర్పించారు. త్వరలో రానున్న మున్సిపల్ శాఖ మంత్రి పి.నారాయణకు సమస్యలను వివరిస్తానని ఎమ్ఎల్ ఏ హామీ ఇచ్చారు. ప్రభుత్వం టిడ్కో సముదాయంలో వివిధ కేటగిరీల కింద ఫ్లాటులను మంజూరు చేసింది. ఈ గృహాలను 2024 జనవరిలో లబ్ధిదారులకు అప్పగించారు. ఈప్రాంతంలో ఎదుర్కొంటున్న తీవ్రమైన ఇబ్బందులను ఏకరవు పెట్టారు. గత ఎన్నికల సమయంలో టిడ్కో లబ్ధిదారులందరికీ బ్యాంకు రుణాలను మాఫీ చేస్తామని ఇచ్చిన హామీపై ఎన్నో ఆశలు పెట్టుకున్నామనీ ప్రస్తుతం క్షేత్రస్థాయిలో తాము ఎదుర్కొంటున్న సమస్యలను అందులో వివరించారు. రుణమాఫీ హామీ అమలు విషయంలో 500 రూపాయల కేటగిరీ వారికి ఉచితంగా అందించగా, రూ. 50,000 మరియు రూ. 1,00,000 కట్టిన వారికి బ్యాంకు రుణాలు మంజూరు చేయించారు. ప్రస్తుతం బ్యాంకు వారు ఈ రుణాల చెల్లింపు కోసం తీవ్రమైన ఒత్తిడి తెస్తున్నారు. రూ. 50,000 కట్టిన వారు రూ. 3.0 లక్షలు, రూ. 1 లక్ష కట్టిన వారు రూ. 3.5 లక్షలు చెల్లించాలని కోరుతున్నారు.? అమలాపురం పట్టణంలో వివిధ షాపుల్లో, ఇళ్లల్లో చిన్న చిన్న పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామని నెలకు రూ. 4,000 నుండి రూ. 5,000 వరకు ఈఎంఐ కట్టడం మా ఆర్థిక స్థితికి మించిన భారంగా మారింది. దయచేసి మీరు ఇచ్చిన హామీ ప్రకారం మా బ్యాంకు రుణాలను మాఫీ చేయాలని కోరారు.వాయిదాలు చెల్లించలేదనే సాకుతో లబ్ధిదారులను వేధిస్తూ, ఇళ్లను సీజ్ చేస్తున్నారన్నారు. నిరుపేదలమైన మా ఇళ్లను సీజ్ చేయడం అన్యాయని. తక్షణమే ఆ ఫ్లాట్లను అన్‌సీజ్ చేసి మాకు అప్పగించేలా ఆదేశాలు జారీ చేయాలని కోరారు. టిడ్కో సముదాయంలో తాగునీరు, డ్రైనేజీ, విద్యుత్, సరైన రోడ్డు సౌకర్యం, పాఠశాల, స్మశాన వాటిక వంటి కనీస వసతులు లేవు. సౌకర్యాలు లేకపోవడం వల్ల ఆ ఇళ్లు నివాస యోగ్యంగా లేక పాడుబడిపోతున్నాయన్నారు.పేదల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న మీరు, మా మొర ఆలకించి యుద్ధ ప్రాతిపదికన సమస్యపరిష్కారం చేయాలనీ కోరారు.

## సంక్రాంతికి టోల్ రహిత ప్రయాణం

**ఎంపీ సానా సతీష్ బాబు వినతి**



**కాకినాడ రూరల్, జనవరి 2 (ప్రభాతవార్త):** ఆంధ్ర, తెలంగాణ ఇరు రాష్ట్రాల తెలుగు ప్రజల సంక్రాంతి పురస్కరించుకొని జనవరి 11వ తేదీ నుంచి ప్రారంభమయ్యే వారంలో లక్షలాది మంది తమ కుటుంబాలను కలుసుకునేందుకు రోడ్డు మార్గం గుండా ప్రయాణిస్తున్న వారికి టోల్ రహిత ప్రయాణానికి అనుమతి ఇవ్వాలని రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ను ట్విట్టర్ ద్వారా అభ్యర్థించారు. పండుగ సమయంలో హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారి 65 పై టోల్ ప్లాజాల వద్ద రద్దీతో పాటు కొనసాగుతున్న రహదారి మరమ్మతుల పనుల కారణంగా తీవ్రమైన ట్రాఫిక్ జామ్ లు తగ్గించడం కొరకు , ప్రజల సౌలభ్యం, ప్రయాణ భద్రత, నిరవధిక రవాణా నిర్వహణను కేంద్రబిందువుగా తీసుకుని, బాధ్యత కలిగిన కూటమి ప్రభుత్వం ఆలోచనా విధానానికి అనుగుణంగా సాన సతీష్ బాబు కేంద్ర రవాణా రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీకు విజ్ఞప్తి చేశారు. సంక్రాంతి వారంలో తాత్కాలికంగా టోల్ రహిత ప్రయాణాన్ని అనుమతించాలనే ఈ అభ్యర్థన, ప్రజలపై భారం తగ్గించడమే కాకుండా రహదారులపై ట్రాఫిక్ సజావుగా సాగేందుకు దోహదపడుతుందని ఆయన స్పష్టం చేశారు. ప్రజా ప్రయోజనాన్ని ప్రథమంగా పరిగణలోకి తీసుకుని తీసుకునే ఇలాంటి నిర్ణయాలు, పండుగ వేళ దేశవ్యాప్తంగా రవాణా వ్యవస్థను సమర్థంగా నిర్వహించడంలో కూటమి ప్రభుత్వ బాధ్యతాయుత దృక్పథాన్ని ప్రతిబింబిస్తాయని ఆయన పేర్కొన్నారు. ఈ చర్య ద్వారా సంక్రాంతి ప్రయాణం సురక్షితంగా, సౌకర్యవంతంగా లక్షలాది మంది తెలుగు ప్రజలకు ట్రాఫిక్ ఇబ్బందులు కలుగకుండా ఉపశమనం కలుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

## సమాజ సేవకు ఎల్లలు లేవు.. ఎమ్మెల్యే గిడ్డి..

**అంబాజీపేట,జనవరి 2 (ప్రభాతవార్త):** తోటి వారికి సహాయం,సేవ చేయాలనే సంకల్పం ఉండాలే గాని సమాజ సేవ చేయడానికి ఎల్లలు లేవని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. అంబాజీపేటకు చెందిన రంగస్థలం వృద్ధ కళాకారుడు కొప్పిశెట్టి అజయ్ కుమార్ అనారోగ్యానికి గురి కావడంతో వైద్య ఖర్చులతో పాటు పోషణ నిమిత్తం ఆర్థిక సహాయం అందించేందుకు ముందుకు వచ్చిన సామాజిక సేవా సంస్థ ప్రతినిధులను ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అభినందించారు. స్థానిక వైష్ణవి పెట్రోల్ బంకు ఆవరణలో రాజోలు నియోజకవర్గం బట్టేలంకకు చెందిన మానవతామూర్తులు-సామాజిక సేవా సంస్థ వ్యవస్థాపకులు బోనం రాజు, సంస్థ సభ్యుల ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన నగదు,వస్తు సహాయ పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ పాల్గొన్నారు. మానవతామూర్తులు- సామాజిక సేవా సంస్థ ద్వారా సేకరించిన రూ. 36 వేల నగదుతో ఫ్రెండ్స్ హెూప్ హెల్పింగ్ హాండ్స్ ఫౌండేషన్ (24 నెలలకు 24 వేలు విలువైన కిరాణా నిత్యవసర సరుకులు అందించేందుకు నిర?యం, ప్రతి నెల రూ.1000లు చొప్పున) మొదటి నెల నిత్యావసర సరుకులను ఎమ్మెల్యే చేతుల మీదుగా అజయ్ కుమార్ దంపతులకు అందజేశారు. ఈ సందరరేగా ఎమ్మెల్యే సత్యనారాయణ మాట్లాడుతూ తోటివారు ఆపదలో ఉన్న సమయంలో సహాయం చేసేందుకు మానవతామూర్తులు ముందుకు రావాలన్నారు. వృద్ధ కళాకారుడు అజయ్ కుమార్ కు సొంత గృహం లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాడని సంస్థ ప్రతినిధులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురావడంతో అజయ్ కుమార్ కు ఇంటి స్థలం మంజూరు చేయించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు అరిగెల బలరామమూర్తి, కొప్పినీడి ఈశ్వరరావు, సూరపురెడ్డి సురేష్, కూటమి నాయకులు శిరిగినీడి వెంకటేశ్వరరావు, దాసరి వీర వెంకట సత్యనారాయణ, బొంతు పెదబాబు,అరిగెల సూరిబాబు, కొర్లపాటి ఢిల్లీ, కొర్లపాటి గోపి, మైపాల తాతాజీ, నాగాబత్తుల సుబ్బారావు, రవణం రాము,సాకా బాపూజీ, అరిగెల బుజ్జి, నల్లా పెద్దకాపు, దొమ్మేటి శ్యామ్,పత్తి దత్తుడు,మట్టా వెంకటేశ్వరరావు, ఉందుర్తి నాగబాబు తదితరులు పాల్గొన్నారు.



## సరళకు ఘనంగా వీడ్కోలు



**ఉమ్మడి తూర్పుగోదావరి బ్యూరో, జనవరి2,(ప్రభాతవార్త)** పోలవరం ప్రాజెక్ట్ స్పెషల్ కలెక్టర్ సరళ వందనం పదవి విరమణ సందర్భంగా ఘనంగా వీడ్కోలు పలికారు సుదీర్ఘ కాలం పాటు సేవలందించిన సరళ పదవి విరమణ జరిగింది. స్పెషల్ ప్రాజెక్ట్ అడ్మినిస్ట్రేటర్,ఐఏఎస్ అధికారి వి అభిషేక్ ఆధ్వర్యంలో పలువురు అధికారులు, నాయకులు ప్రజాప్రతినిధులు, పూలమాలలు వేసి, శాలువా కప్పి సరళను ఘనంగా సత్కరించారు. సమర్ధవంతంగా ఉద్యోగ బాధ్యతలు అందించిన సేవలను ఈ సందర్భంగా పలువురు పలువురు కొనియాడారు.

## టూరిజం హబ్‌గా లొల్ల లాకులు : బండారు



**ఆత్రేయపురం, జనవరి, 02,(ప్రభాత వార్త)** ఈనెల 11, 12, 13 తేదీలలో జరిగే సంక్రాంతి సంబరాలు సర్ ఆర్థర్ కాటన్ గోదావరి ట్రోఫీ డ్రాగన్ పడవల పోటీలు, ఈతల పోటీలు రంగోలి పోటీలు, పతంగులు పోటీలు,సమర్థవంతంగా నిర్వహిస్తూ కోనసీమ భౌగోళిక పరిస్థితులు అందాలు విశిష్టతను విశ్వవ్యాపితం చేయాలని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ కమిటీ సభ్యులకు ప్రజాప్రతినిధులకు పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక మండల పరిధిలోని పులిదిండి గ్రామంలో కయాకింగ్ డ్రాగన్ బోటింగును జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్, జిల్లా ఎస్పీ రాహుల్ మీనా స్థానిక శాసనసభ్యులు బండారు సత్యానందరావులు లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం మూడు రోజుల పాటు నిర్వ హించనున్న పోటీల నిర్వహణ ముందస్తు ఏర్పాట్లను వారు పరిశీలించారు ఈ సందరరేగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర పండుగగా ఈ యొక్క ఉత్సవ పోటీలను మూడు రోజులపాటు పకడ్బందీ రక్షణ భద్రత ఏర్పాట్ల మధ్య విజయవంతంగా నిర్వహిం చాలని అధికారులను ఆదేశించారు. సందర్శకులు తాకిడి కి అనుగుణంగా జెట్టీలు లైఫ్ జాకెట్లతో రక్షణ పరమైన ఇండస్ట్రీ జాగ్రత్తలు పాటిస్తూ క్రియాశీలకంగా వహించాలన్నారు.కయాకింగ్, డ్రాగన్ బోటింగ్ పోటీల నిర్వహణకు ముందే స్పష్టమైన ప్రణాళిక, భద్రతా ప్రమాణాలు, సాంకేతిక నియమాల పట్ల మరింత అప్రమత్తంగా వ్యవహరిం చాలన్నారు. బోట్లు పడవలు, ప్యాడిల్స్, లైఫ్ జాకెట్లు రక్షణ బోటు,సేఫ్టీ బోట్ మెడికల్ టీం వంటి కనీస సౌకర్యాలు సిద్ధంగా ఉంచా లన్నారు. గత ఏడాది కన్నా ఈ ప్రాంత విశిష్టత కు వన్నె తెచ్చే విధంగా రెట్టింపు ఉత్సాహంతో ఈ ఏడాది నిర్వహించాలని స్థానిక శాస నసభ్యులు బండారు సత్యానంద రావు అన్నారు. సంక్రాంతిని పురస్కరించుకుని ఈ మూడు రోజులపాటు ఈ యొక్క విజయవంతం గా నిర్వహిస్తూ రాష్ట్రవ్యా ప్తంగా ఈ యొక్క డ్రాగన్ పోటీ ఉత్సవాలకు వన్నె మరియు గుర్తింపు తేవాలని సర్ ఆర్థర్ కాటన్ గోదావరి ట్రోఫీ కమిటీ సభ్యులకు సూచించారు. కోనసీమ ప్రాంత ఖ్యాతిని ఇనుమడింప చేసేలా రెట్టింపు ఉత్సాహంతో ఈ యొక్క డ్రాగన్ పడవల పోటీలను అత్యంత వైభవోపేతంగా కనుల పండుగా అంగ రంగ వైభవంగా నిర్వహిం చాలని ఆయన కోరారు. ప్రజా ప్రతినిధులు కూటమి నాయకులు యొక్క ఈవెంట్ కు అన్ని విధాల సహాయ సహకారాలు అందించాలన్నారు బొబ్బర్లంక నుండి లొల్లలాకుల వరకు మేజర్ మెయిన్ కాలువ రెండు లక్షల ఎకరాల ఆయకట్టుతో ఉండడం మన అందరి అదృష్టంగా భావించాలన్నారు. భవిష్యత్తులో ఈ ప్రాంతం టూరిజం హబ్ గా తీర్చిదిద్దబడి సతాశీతాలను ఇచ్చేలా జిల్లా కలెక్టర్ వారు ప్రత్యేక చొరవ తీసుకోవడం హర్షనీయమ న్నారు జిల్లా పోలీస్ సూపరింటెం డెంట్ రాహుల్ మీనా ప్రసంగిస్తూ అఖండ గోదావరి తీర ప్రాంత సాంస్కృతి సాంప్రదాయాలను ప్రతిబింబించేలా హిందువుల అతిపెద్ద పండుగ సంక్రాంతినీ పురస్కరించు కొని ఈ ఉత్సవాలు నిర్వహించడం సంతోషదాయ కమన్నారు. ఈ పోటీల నిర్వహణలో స్థానిక శాసన సభ్యులు జిల్లా కలెక్టర్ వారు తీసుకున్న చొరవను ఎస్పీ అభినందించారు.ఈ కార్యక్రమం లో ఆర్డీవో పి. శ్రీకర్ డిఎస్పి ఆకుల రామకృష్ణ,డి ఎస్పీ, సుంకర మురళీమోహన్,రావులపాలెం రూరల్ సీఐ సిహెచ్ విద్యాసాగర్, ఎస్సై ఎస్ రాము, తహసీల్దార్ రాపాక రామచంద్రమూర్తి, పర్యాటక అధికారి అన్వర్, మత్స్య శాఖ అధికారి డేవిడ్ రాజు, డిప్యూటీ కలెక్టర్ టి ఆర్ రాజేశ్వరరావు, ఎంపీడీవో బి కే ఎస్ ఎస్ వెంకట రామన్, డిప్యూటీ ఎంపీడీవో రామకృష్ణంరాజు, వాడపల్లి దేవస్థానం చైర్మన్ ముదునూరి వెంకటరాజు, మండల టిడిపి అధ్యక్షులు కూసంపూడి రామకృష్ణంరాజు, ముళ్ళపూడి భాస్కరరావు, తెలుగు యువత అధ్యక్షులు వెచ్చా అనిల్ కుమార్, కాయల జగన్నాథం, సొసైటీ అధ్యక్షులు ముదునూరి రామభద్రరాజు, నాగిరెడ్డి సత్యనారాయణ, తోటకూర సుబ్బరాజు, సర్పంచులు గెద్దం సుధా రాజు, మెర్ల శ్రీరామచంద్రమూర్తి, నరాలశెట్టి సుబ్బలక్ష్మి, వెంకన్న, జుజ్జువరపు హరిబాబు, తోట రజిని, ఏపుగంటి వెంకటేష్, జిల్లా మండల స్థాయి అధికారులు, శ్రేయమీడియా, బోటు ఫెస్టివల్ కమిటీ నిర్వాహకులు ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు



## కలెక్టర్‌కి తప్పిన ప్రమాదం...



**ఆత్రేయపురం, జనవరి, 02,(ప్రభాత వార్త)** అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ రవిరాల మహేష్ కుమార్ కు ప్రమాదం తప్పింది.సంక్రాంతి సంబరాల్లో భాగంగా పడవ పోటీలు ట్రైల్ రన్ లో కయకింగ్ పడవ నడుపుతూ ఆత్రేయపురం మండలం పులిదిండి వద్ద కాయ్ కింగ్ తిరగబడటంతో పడవ నడుపుతున్న కలెక్టర్ మహేష్ కుమార్ కాలవలో జారీడడంతో ఈ ప్రమాదం జరిగింది.కలెక్టర్ లైఫ్ జాకెట్ వేయటంతో తప్పిన ప్రమాదం తప్పిందని చెప్పవచ్చు గజ ఈతగాళ్లు తక్షణమే స్పందించి కలెక్టర్ మహేష్ కుమార్ ని మరో పడవ ఎక్కించారు. కలెక్టర్ మహేష్ కుమార్ సురక్షత్సంగానే ఉన్నారు. అనంతరం మరో డ్రాగన్ బోట్ ఎక్కి నడిపారు. దీంతో కలెక్టర్ మహేష్ కుమార్ కి సురక్షతంగా బయట పడడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. కలెక్టర్ కి పెనుప్రమాదం తప్పింది అంటూ మీడియా లో వచ్చిన వార్త పై కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు స్పందించారు. కయ కింగ్ పడవ నడుపుతూ పెను ప్రమాదం కలెక్టర్ కి తప్పిందని వస్తున్న వార్తలను తప్పుపట్టారు. సంక్రాతి కార్యక్రమం లో కలెక్టర్, జిల్లా ఎస్పీ లు పాల్గొన్నారని దీనిపై ఎలాంటి అపోహలు పెట్టుకోవద్దని జనవరి 11,12,13,తేదీలలో జరిగే ఆత్రేయపురం ఉత్సవం విజయవంతం చెయ్యాలని కోరారు.

**పురపాలక సంఘం - అమలాపురం**

ఆర్.ఓ.సి.నెం. 758/2020-ఇ1. | తేది.02.01.2026.

**ఇ-ప్రొక్యూర్‌మెంటు టెండరు నోటీసు**

అమలాపురం పురపాలక సంఘ పరిధిలో టిడ్కో నిధులతో రెండు (2) పనులకు రూ.145.00 లక్షలతో, ఎం.పి.నిధులతో రెండు (2) పనులకు రూ.10.00 లక్షలతో మరియు సాధారణ నిధులతో పదిహేడు (17) పనులకు రూ.119.82 లక్షలతో ఇప్రోక్యుర్ మెంట్ ద్వారా టెండరు పిలువబడినది.

4 పనులకు షార్టు టెండరు షెడ్యూల్ డౌన్ లోడింగ్ ప్రారంభ తేది.02.01.2026.
సా.07.00ల నుండి ముగింపు తేది.08.01.2026 సా.04.00ల వరకు
మరియు
17 పనులకు టెండరు షెడ్యూల్ డౌన్ లోడింగ్ ప్రారంభ తేది.02.01.2026.
సా.7.00ల నుండి ముగింపు తేది.19.01.2026 సా.04.00ల వరకు

మిగిలిన వివరములు www.tender.apeprocurement.gov.in వెబ్‌సైట్ నందు చూడగలరు.

కమీషనరు,
అమలాపురం పురపాలక సంఘం.

**IN THE COURT OF THE HON'BLE VI ADDITIONAL DISTRICT JUDGE, RANGA REDDY DISTRICT AT: KUKATPALLY**
**O.S. NO. 211 OF 2024**

Between: -
Sri. Surendra Babu Vikrama, ...Plaintiff
AND
Thiparthi Subbalakshmi & others ...Defendants

**NOTICE THROUGH PUBLICATION**

To, 1. Thiparthi Subbalakshmi, W/o. late Thipathi Sathi Babu, Aged about: Major Occ: Not Known to Plaintiff, R/o. Plot No. 149, H# 4-149, Eswar Villas, Nizampet, Bachupalli Mandal, Medchal-Malkajgiri District, Telangana-500090.
1. Thiparthi Subbalakshmi, W/o. late Thipathi Sathi Babu, Aged about: Major Occ: Not Known to Plaintiff, C/o. Thiparthi Satyavathi, Sivalayam Street, Ramachandrapuram, East Godavari District, Andhra Pradesh, India-533255.
2. Thipathi Kalyan Sunny, S/o. late Thipathi Sathi Babu, Age: Major, Occ: Not Known to Plaintiff, R/o. Plot No. 149, H.No. 4-149, Eswar Villas, Nizampet, Bachupalli Mandal, Medchal-Malkajgiri District, Telangana-500090.
3. Thiparthi Suren, S/o. late Thipathi Sathi Babu,Age: Major, R/o. Plot No. 149, H.No. 4-149, Eswar Villas, Nizampet, Bachupalli Mandal, Medchal-Malkajgiri District,Telangana-500090.
4.M/s. Cubatic Infra & Power Pvt. Ltd., Rep. by Authorized Signatory Having its Registered Office at,First Floor, Renuka Venkateswara Nilayam, Road No. 34, Ayyapa Society, Madhapur, Hyderabad, Telangana-500018.

Whereas, the above named Plaintiff had filed the Suit vide O.S.No.211 of 2024 against the Defendants seeking relief of Recovery of Money for an amount of Rs.1,10,00,000/-(Rupees One Crore Ten Lakhs Only) along with interest @ 24% from Defendants No.1 to 4.

The Hon'ble court was pleased to pass an order to serve Notice to Defendants No.1 to 4 through "Paper Publication". Hence, the Defendants No.1 to 4 hereby summoned to appear in person or by a pleader duly instructed and able to answer all material questions in the above said case and the same is posted on 04.02.2026 at 10:30 AM for your appearance Personally or through your Advocate, failing which the case will be heard and decided in your absence in accordance with Law.

Place: Hyderabad Date: .12.2025

**V. KRISHNA**, Advocate
#304, 3rd Floor, Trident Infra Arcade, Road No.10, Opp. to Star Hospital, Banjara Hills Hyderabad-34.

## గుర్తుతెలియని వాహనం ఢీకొని మహిళ మృతి



**దేవరపల్లి జనవరి 2 (ప్రభాతవార్త):** యర్నగూడెం ఫ్లై ఓవర్ వద్ద శుక్రవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో సుమారు 45-50 సంవత్సరాల వయసు గల గుర్తు తెలియని మహిళ మృతి చెందింది. ఫ్లైఓవర్ సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఆమె అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయినట్లు దేవరపల్లి పోలీసులు తెలిపారు. మృతురాలి వద్ద కొడవలి, బూడిద గుమ్మడికాయ లభించడంతో ఉదయం పొలం పనులకు వెళ్తుండగా ప్రమాదం జరిగి ఉండవచ్చని భావిస్తున్నారు. మృతురాలిని గుర్తించిన వారు దేవరపల్లి పోలీసులను సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

## పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీ



**కె.గంగవరం, జనవరి 2 , (ప్రభాతవార్త):** గంగవరం మండలం పామర్రు గ్రామ పంచాయితీ వద్ద రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రాజముద్ర తో కూడిన కొత్త పట్టాదారు పుస్తకాల పంపిణీ జరిగింది. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వాసంశెట్టి సూరిబాబు, స్వఛాంధ్ర డైరెక్టర్ సలాది పట్టాభి రామయ్య (రమేష్), ఎంపీపీ పంపన నాగమణి సుబ్బారావు, ఎమ్మార్వో శ్రీరామ్ ప్రసాద్, వీఆర్వో భద్రం, బీజేపీ మండల ప్రెసిడెంట్ కొప్పిశెట్టి చంద్రరావు,కూటమి నాయకులు దేవరపల్లి వెంకటేశ్వర రావు, కురుపూడి గోవిందు, గ్రామ ప్రజలు,నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు సేఫ్టీపై ర్యాలీ




**తుని, జనవరి 2,( ప్రభాతవార్త )** రహదారులపై ప్రయాణించేటప్పుడు వాహనదారులు ట్రాఫిక్ రూల్స్ పాటిస్తూ ప్రయాణాలు కొనసాగించాలని కోరుతూ పట్టణంలోని శ్రీవిద్యా ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులతో కలిసి పట్టణపురవీధుల గుండా ప్లకార్డులు చేతపట్టి,నినాదాలు చేస్తూ ర్యాలీ చేశారు. అనంతరం రోడ్డు భద్రతపై విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు.సూరవరం రోడ్డు, రెడ్ కాన్వెంట్ వీధి, పెంటకోటరోడ్డు మీదుగా ర్యాలీ సాగింది. హెల్మెట్ ధరించి రోడ్డు భద్రతా నియమాలు పాటించే ద్విచక్ర వాహనదారులకు చిన్నారులు గులాబీ పువ్వులు ఇచ్చి అభినందించారు. ఈ సందర్భంగా శ్రీవిద్య ప్రిన్సిపాల్ వేణిప్రియ మాట్లాడుతూ జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలను పురస్కరించుకుని పాఠశాల కరస్పాండెంట్ దాడిశెట్టి విష్ణుచక్రం సూచనల మేరకు రహదారి భద్రత అవగాహన ర్యాలీ నిర్వహించడం జరిగిందన్నారు.తాగి వాహనాలు నడపడం, హెల్మెట్, సీట్ బెల్టు ధరించకుండా నిర్లక్ష్యంగా వాహనాలు నడపడం ప్రమాదాలు కారణం అవుతాయన్నారు. క్షణకాలం నిర్లక్ష్యం వలన జరిగే ప్రమాదాల కారణంగా వారితోపాటు వారి కుటుంబాలు కూడా జీవితకాలం నష్టపోతాయని హితవు పలికారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించి, ట్రాఫిక్ రూల్స్ పాటించడం ద్వారా గమ్యస్థానాలకు సురక్షితంగా చేరుకుంటారన్నారు. కార్యక్రమంలో ఇన్చార్జి ఉపాధ్యాయురాలు దుర్గ,ఉపాధ్యాయులు దొరబాబు, అనూష, స్వరూప, సందీప్, వెంకటలక్ష్మి,విద్యార్థులు పాల్గొన్నారు.

## వైసీపీ నుండి టిడిపిలోకి భారీ చేరికలు...



**ఆత్రేయపురం, జనవరి, 02,(ప్రభాత వార్త)** కూటమి ప్రభుత్వంలో అన్ని వర్గాలు ప్రజలకు మేలు జరుగుతుందని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పేర్కొన్నారు. అభివ ృద్ధి సంక్షేమం రెండు కళ్ళులా సాగుతున్న కూటమిపాలన వైపు ప్రజలంతా ఆకర్షితులవుతున్నారని ఆయన వ్యాఖ్యానించారు. వాడపల్లి దేవస్థానం పాలకమండలి చైర్మన్ ముదునూరి వెంకటరాజు నేత ృత్వంలో ఆత్రేయపురం కుమ్మరి గూడెనికి చెందిన 50 శాలివాహన కుటుంబాలు శుక్రవారం వైసీపీని వీడి ఎమ్మెల్యే బండారు సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరాయి. ఎమ్మెల్యే వారందరికీ పసుపు కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానం పలికారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి నిలబెట్టిన అభ్యర్థుల విజయానికి క ృషి చేయాలని వారికి సూచించారు.ఈ కార్యక్రమంలో ఆకుల రామక ృష?,ముళ్ళపూడి భాస్కరరావు,కుసంపూడి రామక ృష?రాజు,వెచ్చా అనిల్ కుమార్, జుజ్జువరపు హరిబాబు , నారాల శెట్టి వెంకన్న,తదితరులు పాల్గొన్నారు.

## చాగంటి కోటేశ్వరరావు దంపతులకు ఘనస్వాగతం



**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్యూరో జనవరి 02,(ప్రభాత వార్త).** కాకినాడ జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరం శ్రీ వీరవెంకట సత్యనారాయణ స్వామివారి సన్నిధికి శుక్రవారం ప్రముఖ దైవ ప్రవచనకర్త, ప్రభుత్వ నైతిక విలువల సలహాదారు బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు దంపతులు విచ్చేసారు. ఆలయం వద్ద దేవస్థానం ఛైర్మన్ రాజా ఐవి రోహిత్, ఈఓ వెంద్ర త్రినాధరావు ఆలయ మర్యాదలతో ఘనస్వాగతం పలికారు.ఈసందర్భంగా చాగంటి దంపతులు ప్రధానాలయంలో సత్యదేవున్ని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.దర్శనం అనంతరం ఆస్థాన వేద పండితులు మహాదాశీర్వచనం పలికి వేదాశీస్సులు అందజేసారు.ఈవో, ఛైర్మన్ లు శ్రీ స్వామివారి ఫొటో, శేషవస్త్రం, ప్రసాదం, అందజేశారు.ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈఓ దామెర క్రిష్ణారావు,అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా కర్ణాటక సంగీతగాన కచేరి



**తుని, జనవరి 2,( ప్రభాతవార్త)** తుని పట్టణంలోని స్థానిక శ్రీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయ ప్రాంగణంలో కర్?టక శాస్త్రీయ సంగీత గాన కచేరి కార్యక్రమం ఘనంగా జరిగింది. సంగీత ప్రపంచంలో దక్షిణ భారత సాంప్రదాయ కర్?టక సంగీతానికి ప్రత్యేకమైన స్థానం కలదు. మధురమైన ఈ సంగీత విధానాన్ని ప్రజలకు మరింత చేరువ చేయాలన్న సంకల్పంతో కెబి యూనివర్స్ ఆఫ్ క్లాసికల్ మ్యూజిక్ ఆధ్వర్యంలో సంగీత కచేరిని నిర్వహించారు.ప్రముఖ సంగీత గురువు శ్రీకృష్ణ బాబ్జి, డాక్టర్ శరత్ లు కార్యక్రమానికి సారధ్యం వహించారు.విశాఖకు చెందిన ప్రముఖ తవిల్ విద్వాంసులు శ్రీకూర్మపు గోవిందరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు.విద్యార్థులు పాల్గొని వీణ, వేణువు, మ ృదంగం వంటి వాయిద్యాలతో సంగీత ప్రావీణ్యాన్ని ప్రదర్శించారు. కార్యక్రమానికి అతిథులుగా హాజరైన పట్టణ ప్రముఖులు,వైద్యులు, చక్కని ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేసి అభినందించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో సంగీత అభిమానులు పాల్గొన్నారు.

## పట్టాదారు పాసుపుస్తకాలు మార్చుకోండి..



**కడియం, జనవరి 2 (ప్రభాతవార్త)** ప్రభుత్వ ఆదేశానుసారం జనవరి 2 వ తేదీ నుండి 9 వ తేదీ వరకు జరుగనున్న పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ నిమిత్తం, మండలంలోని పలు గ్రామాలలో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ ఎం. సుశీల్ కుమార్ తెలిపారు. షెడ్యూల్లో తెలిపిన వివరాలు ప్రకారం ప్రతిరోజు ఉదయం 10 గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు ఆయా గ్రామ పంచాయతీల వద్ద రెవెన్యూ సదస్సులు జరుగుతాయన్నారు. మొదటి రోజైన శుక్రవారం దామిరెడ్డిపల్లి గ్రామంలో పంపిణీ ప్రారంభించారు.మూడవ తేదీ కడియపు సావరం, ఆరవ తేదీ కడియం, ఏడవ తేదీ కడియపులంక మరియు 9వ తేదీ వేమగిరి పంచాయతీలలో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ ఈ సదస్సులు ఉపయోగించుకుని, పాత పట్టాదారు పాసుపుస్తకాలు సదస్సులలో ఇచ్చేసి, కొత్త పట్టాదారు పాసుపుస్తకాలు తీసుకోవాలని కోరారు. తదుపరి కడియం వన్ లో పాస్ పుస్తకాలు పంపిణీ చేసిన అధికారులు నాయకులు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ ముద్దగాడ జెమీ, ఏఎంజెసి డైరెక్టర్ మార్గాని సత్యనారాయణ, కూటమి నాయకులు వెలుగుబంటి నాని, బి. సుబ్రమణ్యం, ముమ్మిడి దేవి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## విజయ కనకదుర్గను దర్శించుకున్న సంకీర్తన బృందం



**శంకవరం జనవరి 2 (ప్రభాతవార్త):** పవిత్ర ధనుర్మాసాన్ని పురస్కరించుకుని గ్రామంలో పలు బృందాలు నగర సంకీర్తన చేపడుతున్నారు. మండలంలోని కత్తిపూడి లో ఐదు బృందాలు నగర సంకీర్తన నిర్వహిస్తున్నారు శుక్రవారం పురస్కరించుకుని గ్రామంలో గల విజయ కనకదుర్గ అమ్మవారిని సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయ ఆవరణలో గల వేణుమాధవ ఆలయ సంకీర్తన బ ృందం కొండ వారి పేట సంకీర్తన బ ృందం పాత కొత్తూరు రావిశెట్టి సెంటర్లో గల సంకీర్తన బ ృందాలు దర్శించుకున్నాయి ఆలయ పురోహితులు ద్వివేదుల నాని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజామునే స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని పల్లకిలో ఉంచి హరే రామ నామాన్ని జపిస్తూ గ్రామంలో సంకీర్తన చేపట్టి సూర్యోదయానికి ముందే ఆలయానికి చేరుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో గ్రామస్తులు కమిటీ సభ్యులు భక్తులు పాల్గొన్నారు.

## సావిత్రిబాయి పూలే భారతీయ విద్యా కుసుమం



**కడియం ,జనవరి 2 ()ప్రభాత వార్త)** దేశంలో మహిళా విద్య కోసం సావిత్రిబాయి పూలే చేసిన సేవలు, క ృషి మనం ఎప్పుడూ మరువలేమని యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి కే రమేష్ బాబు అన్నారు. భారతదేశపు తొలి మహిళా ఉపాధ్యాయిని సావిత్రిబాయి పూలే జయంతి మహోత్సవం శుక్రవారం మండల కేంద్రం కడియం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని యుటిఎఫ్ మండల మహిళా ఉపాధ్యక్షురాలు బ్యూలారత్నం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా రమేష్ బాబు మరియు కడియం హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు టి సత్యనారాయణ పాల్గొన్నారు. ఈ సందరరేగా వారు ఆ రోజుల్లో బాలికల విద్య కోసం, మహిళల చదువు కోసం సావిత్రిబాయి పూలే పడ్డ కష్టాలు వివరించారు. అంతకుముందు సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందరరేగా నిర్వహించిన పలు రకాల పోటీల్లో విజేతులైన చిన్నారులకు బహుమతుల అందించారు. ఈ సందరరేగా చిన్నారుల వేషధారణ విశేషంగా ఆకట్టుకుంది.కార్యక్రమం అనంతరం మండలంలో వివిధ గ్రామాలకు చెందిన ఉపాధ్యాయినులు ఆర్ భాస్కర్ కుమారి, ప్రశాంత్ కుమారి, వెంగమాంబ, శశికుమారి, సుజాత,జయలక్ష్మి, ప్రమీలరాణి,టీ వి ఏ గాయత్రి, శాంతిసరోజ, శ్రీవల్లిమంగతాయారు తదితరులను వీరు చేసిన సేవలకు గాను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కడియం మండల యుటిఎఫ్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వి శాస్త్రి, అబ్బాయి, రాష్ట్ర కౌన్సిలర్ ఎస్.అనిత, యుటిఎఫ్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## నూతన పాసు పుస్తకాలు పంపిణీ చేసిన రెవెన్యూ అధికారులు



**యు.కొత్తపల్లి, జనవరి 2 (ప్రభాతవార్త):** రీసర్వే పూర్తైన గ్రామాల రైతులకు కూటమి ప్రభుత్వం అందజేసిన పట్టాదారు పాస్ పుస్తకాలు అందిస్తున్నామని తహశీల్దారు చిన్నారావు అన్నారు. మండలంలోని అమీనాబాదు, గోర్స గ్రామాల రైతులకు శుక్రవారం పట్టాదారు పాసు పుస్తకాలను పంపిణీ చేశారు. గత ప్రభుత్వంలో రైతులకు మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ఫోటోతో పాసు పుస్తకాలను పంపిణీ చేసింది. అయితే కూటమి ప్రభుత్వం వీటి స్థానంలో రాజముద్రతో ఉన్న రీసర్వే చేసిన పొలాల రైతులకు నూతన పట్టాదారు పాసు పుస్తకాలు మంజూరు చేసింది. అందులో భాగంగా నిర్దేశించిన తేదీల్లో శనివారం ఇసుకపల్లి, 5న కొండెవరం, అమరవల్లి, 6న కొత్తపల్లి, వాకతిప్ప, కుతుకుడుమిల్లి, 7న నాగులాపల్లి, 8న ఉప్పాడ, సుబ్బంపేట, మూలపేట, 9న యండపల్లి గ్రామాల్లో సచివాలయాల వద్ద రైతులకు రీ సర్వే పట్టాదారు పాసు పుస్తకాలను అందజేయడం జరుగుతుందని తహశీల్దార్ చిన్నారావు తెలిపారు.

## నిజాన్ని దాచిపెట్టే ప్రయత్నం జరుగుతుంది:మార్గాని భరత్



**రామచంద్రపురం,జనవరి 02,(ప్రభాతవార్త):** ద్రాక్షారామం భీమేశ్వర స్వామి వారిని శుక్రవారం దర్శించుకున్న వైఎస్ఆర్సిపి మాజీ పార్లమెంట్ సభ్యులు మార్గాని భరత్ రామ్.ఆలయంలో కపాలేశ్వర ఘట్టంలో జరిగిన దుర్ఘటనపై భరత్ ఆరాతీశారు.అనంతరం కపాలేశ్వర శివలింగం వద్దకు ఆయన వెళ్లి పరిశీలించారు.జరిగిన సంఘటనపై మీడియాతో ఆయన మాట్లాడారు.కొన్నివేల సంవత్సరాల చరిత్ర,హిందువుల విశ్వాసం, ఆత్మగౌరవంతో ముడిపడి ఉన్న కపాలేశ్వర స్వామి శివలింగాన్ని ధ్వంసం చేయడం అత్యంత ఘోరమైన చర్య అని తీవ్రంగా భరత్ ఖండించారు.ఒక చిన్న పురాతన ఇటుకను కదిలిస్తేనే ఆర్కియాలజీ శాఖ పెద్ద నేరంగా పరిగణించే పరిస్థితిలో,వేల సంవత్సరాల చరిత్ర కలిగిన శివలింగం ధ్వంసం అయినా ఆర్కియాలజీ శాఖ ఏమాత్రం స్పందించకపోవడం దారుణమని ఆయన ప్రశ్నించారు.శివలింగం ధ్వంసం జరిగిన తరువాత,ఆగమశాస్త్ర నిబంధనలు పూర్తిగా ఉల్లంఘించి,సాయంత్రంలోగానే మరో శివలింగాన్ని తెచ్చి,పగుళ్లను సిమెంటుతో కప్పి యథావిధిగా పూజలు కొనసాగిస్తున్నామని చెప్పడం అనేది హిందువుల నమ్మకాలను అవమానపరచడమేనని భరత్ మండిపడ్డారు.అలాగే ఇది నిజాన్ని దాచిపెట్టే ప్రయత్నం తప్ప మరొకటి కాదని ఘాటుగా వ్యాఖ్యానించారు.ఈ ఘటనపై తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం తక్షణమే స్పందించాల్సిందేనని డిమాండ్ చేశారు.ఎండోమెంట్ మంత్రి స్వయంగా ఘటన స్థలానికి వచ్చి,జరిగిన విషయాలను పరిశీలించి,ఘటనకు బాధ్యులైన వారిని గుర్తించి కఠినంగా శిక్షించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.ఈ దుర్ఘటనతో హిందువుల మనోభావాలు తీవ్రంగా దెబ్బతిన్నాయని భరత్ రామ్ స్పష్టం చేశారు చేశారు.నియోజకవర్గ వైసిపి ఇన్చార్జ్ పిల్లి సూర్య ప్రకాష్,మండల వైస్ ఎంపీపీ శాఖ బాబి,వైసిపి కార్యకర్తలు మార్గాని భరత్ వెంట ఉన్నారు...

## ఆకట్టుకున్న సంక్రాంతి సంబరాలు..

### గంగలకుర్రు అగ్రహారంలో సంక్రాంతి కల..



**అంబాజీపేట, జనవరి 2, (ప్రభాతవార్త):** అంబాజీపేట మండలంలోని గంగలకుర్రు అగ్రహారంలో ఆర్య వైశ్య మహిళా విభాగంలోని స్నేహ కిట్టి పార్టీ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించిన సంక్రాంతి సంబరాలు అలరించాయి. పక్షం రోజుల ముందుగానే ఆ గ్రామంలో సంక్రాంతి కల వచ్చింది. ధనుర్మాసం సందరరేగా నిర్వహించిన ఈ సంబరాలలో కిట్టీ పార్టీకి చెందిన సుమారు 30 మంది ఆర్యవైశ్య మహిళలు బొమ్మల కొలువు,భోగి పళ్ళు, గొబ్బిళ్ళు,రంగవల్లులు,హరిదాసు కీర్తనలు ,భోగి మంటలు తదితర అంశాలతో సంక్రాంతి సంబరాలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అనంతరం గాలిపటాలను ఎగరవేసి, కోలాటం నిర్వహించారు. ఈ సందరరేగా స్నేహ కిట్టి పార్టీ సభ్యులు మాట్లాడుతూ వేగంగా పరుగెడుతున్న కాలంలో కనుమరుగుతున్న తెలుగు సంస్కృతి, సంప్రదాయాలను నేటితరం యువతకు తెలియజేయాలనే స్నేహ కిట్టి పార్టీ ఆధ్వర్యంలో ఈ ఏడాది తొలిసారిగా పూర్తిస్థాయి సంక్రాంతి సంబరాలను నిర్వహిస్తున్నామన్నారు. విదేశీ పోకడలకు అలవాటు పడుతున్న నేటి యువత, మహిళలు భారతీయ వస్త్రధారణ, అలంకరణ పూర్తిగా మర్చిపోతున్నారని, నుదుటిన తిలకం దిద్దుకునేందుకు సైతం ఇష్టపడడం లేదన్నారు. నిండుగా శరీరాన్ని కప్పుకొనే వస్త్రాలంకరణ కరువైందని, తెలుగు పండుగలను సైతం విస్మరిస్తున్నారన్నారు. ధనుర్మాసం సందరరేగా నెల రోజులపాటు స్థానిక శ్రీ భూదేవి, శ్రీ దేవీ సమేత కేశవస్వామి వారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని,సంక్రాంతి పర్వదినాల్లో భాగంగా మూడు రోజులు కుటుంబ సభ్యులతో సంతోషంగా జరుపుకుంటామని, కనుమనాడు జరిగే ఏకాదశ రుద్రుల ప్రభల తీర్థ మహోత్సవంనకు గంగలకుర్రు అగ్రహారంకు చెందిన శ్రీ పార్వతీ సమేత వీరేశ్వరస్వామి (ఏకాదశ రుద్రులలో 9వ రుద్రుడు) ప్రభ జగ్గన్నతోట తీర్థమునకు వెళ్లే సమయంలో మేము కూడా కుటుంబ సభ్యులతో తీర్థంలో పాల్గొంటామని తెలిపారు.తెలుగు సంస్కృతి, సంప్రదాయాలను నేటి తరానికి తెలియచెప్పే మా ప్రయత్నానికి అందరూ సహకరించాలని, ప్రతి తెలుగు వారు మన సంస్కృతి, సంప్రదాయాలను కొనసాగించాలనేదే మా ప్రయత్నమని వారు తెలిపారు.

## సంక్రాంతి, అంతర్వేది ఉత్స వాలను సమర్ధవంతంగా నిర్వహించాలి



**అమలాపురం కలెక్టరేట్, జనవరి 2,(ప్రభాతవార్త):** రెవెన్యూ అంశాలతో పాటు జనవరి నెలలో వచ్చే సం క్రాంతి, అంతర్వేది ఉత్స వాలను సమర్ధవంతంగా నిర్వహించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి నిశాంతి, రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్ నందు రెవె న్యూ సిబ్బందితో సమావే శం నిర్వహించి భూమి రికార్డులు ముటేషన్లు,రీ సర్వే,అభ్యంతరాల పై దరఖాస్తుల స్వీకరణ,పెండింగ్, తిరస్కరణ శాతం, నిర్ణీత టైమ్ లైన్ లో పరిష్కారం ఇత్యాది అంశాలపై సెక్షన్ల వారీగా సమీక్షిం చారు. ఈ సందరరేగా జేసీ మాట్లాడుతూ జనవరి మాసంలో వచ్చే సంక్రాంతి,అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి కళ్యాణం ఉత్సవాలను అధికారులు సమన్వయం తో జయప్రదంగా నిర్వహించాలని ఆదేశించారు. సమగ్ర భూ సర్వే,రి సర్వే పురోగతి, ఎఫ్ ఎం బి అడంగల్ 1-B అప్డేషన్, డిజిటల్ రికార్డు లలో లోపాలను సరిదిద్దా లన్నారు. రిజర్వే అనంతరం రాజముద్ర తో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాల ను సకాలంలో పంపిణీ చేయాలన్నారు. 22-ఎ నిషేధిత జాబితా, చుక్కల భూములు, అసై న్డ్ ల్యాండ్స్ రెగ్యులరైజేషన్ చర్యల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. భూ రెవిన్యూ, నీటి పన్ను భూ రెవిన్యూ, నీటి పన్ను, నాన్ అగ్రికల్చరల్ ల్యాండ్ ట్యాక్స్ నాలా డిమాండ్ సేకరణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నా రు. ఆక్రమణలు, ప్రభుత్వ భూముల సంరక్షణ ప్రభు త్వ భూములపై అన్అథరైజ్డ్ ఆక్రమణల గుర్తింపు, తొలగింపు అంశా లపై తగు చర్యలు తీసుకోవాలన్నారు. కుల, ఆదాయం, స్థానిక నివాస, ఇంటిగ్రేటెడ్ సర్టిఫి కేట్లు జారీ టైమ్లైన్లో చేప ట్టాలన్నారు.గ్రామ వార్డు సచివాలయాల ద్వారా వచ్చే రెవిన్యూ సేవల ఫిర్యాదుల పరిష్కారం గడువు లోపల పూర్తి చేయాలన్నారు. కోర్టు కేసుల విషయంలో అప్రమ త్తంగా వ్యవహరిస్తూ పరిష్కారం లభించేలా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలన్నారు ఈ కార్యక్రమంలో డిఆర్ఓ కే మాధవి రెవెన్యూ సమస్య లన్ని రెవెన్యూ క్లినిక్స్ ద్వారా పరిష్కరించాల న్నారు. భూ సమస్యలపై వచ్చిన ఫిర్యాదులను పరిపూర?ంగా పరిష్కరించడ మే రెవెన్యూ క్లినిక్కుల ముఖ్య ఉద్దేశ్యమన్నారు. నమో దైన అర్జీల పరిష్కారం కొర కు సంబంధిత గ్రామాల లోకి దస్త్రాలను తీసుకువెళ్లి విచా రించాల్సి ఉందన్నారు. తొమ్మిది జిల్లాలో ఐ వి ఆర్ ఎస్ ద్వారా అర్జీదారుల అభిప్రాయాలను తెలు సుకుంటామన్నారు. రెవిన్యూ దస్త్రాలను డిజిటై జేషన్ చేయాలన్నారు. పాత దస్త్రాలన్నింటిని అత్యంత భద్రతతో స్కానిం గ్ చేసి, తదుపరి సంబంధిత పోర్టల్ లో నిక్షిప్తం చేయా లన్నారు. ఈ కార్యక్రమం లో కలెక్టరేట్ పరిపాలన అధికా రి కడలి కాశీ విశ్వేశ్వరరావు సెక్షన్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ అంతరాయం

**కె.గంగవరం, జనవరి 2, (ప్రభాతవార్త):** మండలంలోని కొన్ని గ్రామాల్లో 33/ 11 కెవి పామర్రు విద్యుత్ సబ్ స్టేషన్ లో ఎం.ఆర్.టి వారి నిర్వహణ వల్ల విద్యుత్ సరఫరా నిలిపివేయుచున్నట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె రత్నాలరావు తెలియజేశారు. దీని కారణంగా పామర్రు ,పాణింగపల్లి, అముజూరు ,యండగండి, కూళ్ల కోరుమిల్లి.మాచర. వాకతిప్ప గ్రామాలకు విద్యుత్ అంతరాయం కలుగునని, అలాగే మధ్యాహ్నం 3 గంటల నుండి 4 గంటల వరకు శివల విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో బాలాంత్రం, యర్రపోతవరం, పేకేరు ,బట్లపాలిక, మసకపల్లి, అద్దంపల్లి,దంగేరు గ్రామాలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగునని తెలిపారు. విద్యుత్ వినియోగదారులు అందరూ ఈ అసౌకర్యాన్ని గమనించి సహకరించవలసిందిగా కోరుతున్నట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె రత్నాలరావు తెలిపారు.

## వెనుకబడిన పాఠ్యాంశాలకు ప్రత్యేక శిక్షణ ఇవ్వాలి



**యు.కొత్తపల్లి, జనవరి 2(ప్రభాతవార్త):** వెనుకబడిన పాఠ్యాంశాలలో పదవ తరగతి విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించాలని 100 రోజుల కార్యాచరణ ప్రణాళిక ప్రత్యేకాధికారి, జిల్లా పౌర సరఫరాల శాఖాధికారి ఎండీ నాయక్ అన్నారు. మండలంలోని కొండవరం జిల్లా పరిషత్ పాఠశాలలోని పదవ తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రేరణ తరగతులను శుక్రవారం ఆయన పరిశీలించారు. ముందుగా విద్యార్థినీ విద్యార్థులతో మాట్లాడారు. అనంతరం ఉపాధ్యాయులతో మాట్లాడుతూ విద్యార్థులు ఏ ఏ పాఠ్యాంశాల్లో వెనుకబడి ఉన్నారో గమనించి తగిన విధంగా విద్యాబోధన చేసి నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చక్రపాణి, మండల రేషన్ డీలర్ అసోసియేషన్ అధ్యక్షుడు కడియాల పెద్దిరాజు పాల్గొన్నారు.

## ఎంఎల్సీకి అభినందనలు



**అమలాపురం,జనవరి2,(ప్రభాతవార్త).** రాష్ట్ర బిజెపి సీనియర్ నాయకులు యాళ్ల దొరబాబు, వైఎస్ఆర్సిపి పార్టీ సీనియర్ నాయకులు చెల్లుబోయిన శ్రీనివాసరావు ఆంధ్రప్రదేశ్ శాసనమండలి సభ్యులు బొమ్మి ఇజ్రాయిల్ ని వారి స్వగ ృహం నందు మర్యాదపూర్వకంగా కలిసి దుస్సాలువతో సత్కరించి పుష్ప గుచ్ఛం ఇచ్చి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో అల్లవరం ఎంపీపీ యిళ్ళ శేషగిరిరావు, గువ్వల రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

## కూటమిలోకి భారీ చేరికలు



**కడియం, జనవరి 2 (ప్రభాతవార్త):** మాధవరాయుడుపాలెం లో కూటమి రాజకీయంగా బలం పెంచుకుంది. గ్రామ సర్పంచ్ అన్నందేవుల చంటి ఆధ్వర్యంలో సింగన శివరాం, సింగన సుభాష్లు తమతో పాటు సుమారు 50 మంది యువకులతో కలిసి కూటమి లో చేరారు.ఈ సందరరేగా సర్పంచ్ చంటి నూతనంగా పార్టీలోకి వచ్చిన వారికి కండువాలు కప్పి పార్టీలోనికి ఆహ్వానించారు . ఈ సందరరేగా సర్పంచ్ చంటి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివ ృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు గ్రామ యువతను ఆకర్షిస్తున్నాయని ఆయన పేర్కొన్నారు.గ్రామ అభివ ృద్ధి, యువతకు మెరుగైన భవిష్యత్తు లక్ష్యంగా కూటమితో కలిసి పనిచేస్తామని పార్టీలో చేరిన యువకులు ఈ సందరరేగా తెలిపారు.

## పోస్టల్ యూనియన్ క్యాలెండర్ ఆవిష్కరించిన ఎస్పీ శ్రీకర్ బాబు



**అమలాపురం,జనవరి2,(ప్రభాతవార్త)** నూతన 2026 సంవత్సర ఎఫ్ ఎన్ పి ఓ పోస్టల్ యూనియన్ క్యాలెండర్ ను అమలాపురం డివిజన్ పోస్టల్ సూపరిండెంట్ ఎస్ శ్రీకర్ బాబు ఆవిష్కరించారు. ఈ సందరరేగా ఎస్పీ శ్రీకార్ బాబు మాట్లాడుతూ పోస్టల్ ఉద్యోగుల కు ఎప్పుడు ఏఅవసరం వచ్చినా తన వంతు సహకారం అందిస్తానని అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఉద్యోగుల సమస్యలు ఏమి ఉన్నా తమ ద ృష్టికి తీసుకువస్తే తప్పక పరిష్కరిస్తా అని తెలిపారు. పోస్టల్ ఉద్యోగుల వెల్ఫేర్ చూడడంలో తాను ముందు ఉంటానని ఎస్పి శ్రీకర్ బాబు స్పష్టం చేశారు. కొత్తగా అమలాపురం డివిజన్ కి ఎస్పీగా విచ్చేసిన శ్రీకర్ బాబు ను యూనియన్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ నూతన క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమంలో అసిస్టెంట్ పోస్టల్ సూపరింటెండెంట్ కె శ్రీధరం, ఎఫ్ ఎన్ పి ఓ యూనియన్ నాయకులు ఎం.ఏకాంబరం, ఎం.నరసింహం, బి.అనిల్, ఏ శ్రీనివాస్,సురేష్,జి సతీష్, సాయి క్రిష్ణ, ,శివక ృష్ణ, రవి కృష్ణ,నీరజ, మహాలక్ష్మి పోస్టల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## హీటు సీటులో.. కుంచె దూకుడు



**అమలాపురం - ప్రభాతవార్త** నూతన సంవత్సర వేడుకలతో ప్రతిపక్ష వైఎస్ఆర్సిపి సీనియర్ నాయకుడు కుంచే రమణారావు దూకుడు పెంచారు. జిల్లా కేంద్రమైన అమలాపురంలో వైఎస్ఆర్సిపి ఆశావాహుల మధ్య నెలకొన్న సీటు హీట్ పోరులో కుంచె తనదైన బాణితో దూసుకుపోతున్నారు. గతం కంటే భిన్నంగా పార్టీ శ్రేణులు సైతం సంఘీభావ ప్రకటిస్తూ అనుసరిస్తోండడం ఆయన వర్గంలో కొత్త ఉత్సాహాన్ని నింపుతుంది. స్థానిక సంస్థలు ఎన్నికలు నేపథ్యంలో ఇది పార్టీకి ఎంతో ఉపకరిస్తుందని వైఎస్ఆర్సిపి నాయకులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటివరకు ఒక లెక్క ఇప్పుడు మరో లెక్కనట్టుగా నియోజకవర్గం లో ఉన్న ఇద్దరు మాజీ నేతలకు సైతం ఇది కొరుకుడు పడని అంశం. గత ఎన్నికల్లో నేతల సూచనలతో పార్టీ కోసం కట్టుబడి ఉన్నారు. అయితే మారిన పరిణామాలు అమలాపురం సీటుపై కన్నేసిన తమ నాయకుడు కు మద్దతుగా నియోజకవర్గంలోని సీనియర్ల సైతం ప్రత్యేకంగా మద్దతు వుందని అనుచరులు చెబుతున్నారు. ఇంతవరకు వేర్వేరు శిబిరంలో ని నేతలు కూడా ఇక్కడే దర్శనమివ్వడం వీరికి మరింత బలాన్ని చేకూరుస్తున్నాయి.దీనికి తోడు జిల్లా కి చెందిన ముఖ్యులను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షల తో తనమనసులోని మాటను కూడా రమణారావు చెప్పుకొచ్చారు.

Print and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at 11-37, Morampudi, Rajamahendravaram-533 103. Phone : 2469407, 2469408. RNI No.64863/96, Editor : Damerla Sai Baba, Responsible for s election of News-under the PRB Act. Regd.: No.H/SD/337/09-11 Air Surcharge: Delhi : 40Ps